
వార్షికమూల్యము : సభ్యులకు రు 3—0—0 విడిసంచిక 4 అణాలు

# గ్రంథాలయసర్వస్వము.

బెజవాడ ఆంధ్రదేశ గ్రంథాలయసంఘపక్షమున ప్రకటింపబడు సచిత్రమాసపత్రిక.

సంపాదకులు :
గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఏ.
అయ్యంకి వేంకటరమణయ్య.



గ్రంథాలయసేవక, నిడమర్తి లక్ష్మీనారాయణపంతులుగారు.

సంపుటము ౧౦. బెజవాడ సంచిక 3.
1936

## రాజపోషకులు

శ్రీ రాజా వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరుగారు

శ్రీ రాజా నాయని వేంకట రంగారావు బహద్దరుగారు

మద్దుల వేంకట చినరాజు శ్రేష్ఠిగారు, ఏలూరు.

బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు.

గోపు రామచంద్రరావుగారు, బెజవాడ.

# గ్రంథాలయ సర్వస్వము

చందా : ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వచందాతో రు 3 లు మాత్రమే.
ప్రతినెల ౧-వ తేదీన వెలువడును.

### వ్యాసములు

గ్రంథాలయ శాస్త్రము - ఆంధ్రవాఙ్మయము - ఆంధ్రాభ్యుదయములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘములయొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనలు ఇందు ప్రకటింపబడును.

### పటములు

గ్రంథాలయ భవనములయొక్కయు, గ్రంథాలయ సభలయొక్కయు, గ్రంథాలయ సేవకులయొక్కయు పటములును ఇందు ముద్రింపబడును.

### గమనింపుడు

ఈ పత్రిక ప్రతినెల ౧-వ తేదీన వెలువడును. కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రికయందు ప్రకటింపవలెనో దానికి వెనుకటినెల 15-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

### ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| ఒకసారి 1 | పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ | పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ | పుటకు | రు 6-0-0 |

వివరములకు :—

మేనేజరు, గ్రంథాలయసర్వస్వము, బెజవాడ.

1 RSVM01A 157



పరబ్రహ్మాత్మికాం దేవీం భుక్తిముక్తిఫలప్రదాం,
ప్రణమ్య స్తౌమి తామేవ జ్ఞానశక్తిం సరస్వతీమ్.

సంపుటము ౧౦

# గ్రంథాలయ సర్వస్వము

సంచిక 3

ధాత జ్యేష్ఠము జూన్ 1936

## రాధామాధవుని ప్రతిజ్ఞ

చ. సరసులు చిత్తగింపుడని చాటను, మామకవాణి సన్మనో
హరయగునేని వారిహృదయంబుల కింపొనరింపకున్నె? యె
వ్వరుపిలువంగ వచ్చి యళివర్గము లాత్మలఁజొక్కు తేనియల్
కురియు ప్రసూనగుచ్ఛభరకుంచిత మల్లిమతల్లికావనిన్.

# * ఎవరీ రాజపుత్రులు?

(శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు)

శ్రీ హర్షచక్రవర్తి చనిన పిదప సుమారు అయిదువందలసంవత్సరములు భారతభూమియం దేకచ్ఛత్రాధిపత్యము కొంతకు కొంతయైనను సాగుట కవకాశము దొరకలేదు. అట్లని భరత వర్షము అరాచకముపాలైనదని ఎవ్వరును నను కొనరాదు. ఎల్లకాల మెల్లదేశములలో నడచిన రీతిని ప్రభుత్వములు కొనసాగినవి. కాని ఈ ప్రభుత్వము లన్నియును ప్రాంతికములు. ప్రాయికముగా ప్రభుత్వాధికారము వహించిన వంశములు ఏయొకటిరెండో తప్ప మారిపోవుచుండినవి. శ్రీహర్షుని ప్రబలశక్తి గతించినతోడనే వల్లభి (గుజరాత్), కనోజి, నేపాళము, కాశ్మీరము, కాబూలు, పంజాబు, సింధు మున్నగునట్టి పొలిమేరభూములన్నియును స్వతంత్రమయిపోయెను. శ్రీహర్షునిమరణానంతర మిరువదియేండ్లు చాల గడబిడలు జరిగినవి. మొదట నతని దండనాథు డొకడు రాష్ట్రాధికారమును బాచికొని చీనారాయబారిని జంపి లేనిపోనికయ్యమునకుదిగి చీనావారిచే బందీకృతుడయ్యెను. కొంతకాలము చీనా-టిబెటువారలు భారతభూమిలో నొకకొన్ని ప్రాంతములనేలిరి. కాని గుప్తవంశజులు తుట్టతుదకు తాము బ్రతికి యున్నామనిపించ గలిగిరి. బీహారు ప్రాంతమును వంగరాష్ట్రమున నుత్తరప్రాంతమును వీరికి దక్కినవి. నూటయేబది సంవత్సరము లీ వంశము వారికొలది రాజ్యమును ప్రాత వైభవము తరిగియు నేలికొనిరి.

ఇక్కాలమున భారతభూమియందొక నవీన వాతావరణ మేర్పడినది. శక, పల్లవ, కుశాన, ఘూర్జర, హూణేత్యాది విదేశజు లెందరో తరంగములు తరంగములుగా మన దేశముజొచ్చుటయు ఆకాలపు బ్రాహ్మణులు వీరెల్లరను క్షత్రియత్వమున కర్హులని యంగీకరించుటయు జరిగినది. ఈదేశములోని తక్కువ జాతులలో కొందరు తేజోవంతులయి వంశకర్తలయి బ్రాహ్మణుల చేత క్షత్రియగణములో చేర్చబడిరి. ఈ కొత్త క్షత్రియులకు అగ్నికులులనియు రాజపుత్రులనియు పేరు కలిగెను. వీరికి బ్రాహ్మణులు మంత్రులుగా నుండుటయు, సమయము వచ్చినప్పుడు తామే రాజ్యములాక్రమించి రాజులయి క్షత్రియత్వము స్వీకరించుటయు, క్షత్రియులతో వివాహాదిసంబంధములు చేసికొనుటయు సంభవించినది. బ్రాహ్మణత్వమును క్షత్రియత్వమును రెంటికలయిక సూచించు బ్రహ్మక్షత్రియ మను వర్గీకరణము కూడనొక్కొక్కప్పుడు తోచినది. ఈ విధముగా నొక జాతివారు గాక అన్నిజాతులనుండియు

* అముద్రితమగు ఇండియాదేశచరిత్రమునుండి.

3



నేర్పడిన ప్రతాపవంతులకు రాజపుత్రులను నామధేయమమరినది. ప్రతాపాగ్నిసంతప్తులగుటచేత వీరు పవిత్రులయిపోయిరి. ప్రాతిబంధములులేని స్వతంత్రులయినందున వీరికి ఒద్దికలు కుదురలేదు. ఒకరితో నొకరికి పోరాటములు తప్పలేదు. తుదకొక్క రొక్కరుగా ముసల్మానుల దండయాత్రలకు పాత్రులై పడిపోవలసిన విధియును విడువలేదు. కాని ఈ స్వతంత్రచరిత్రయే వీరియందు మార్తాండ తేజమును;సత్యవిశ్వాసమును, ఉత్తమమగు తెంపును ప్రవర్ధిల్ల జేసి రాజపుత్రులనిన సత్యవీరులను అప్రతిమాన కీర్తిని సంపాదించినది.

శ్రీహర్షుని మరణానంతరము ముసల్మానులు మన దేశమున స్థిరపడువరకును గల చరిత్రయంతయును ఈ రాజపుత్రుల చరిత్రయే. ఆకాలమున నీదేశమునందు ప్రబలిన రాజ్యములను లెక్కబెట్టుటయన సులభసాధ్యముగాదు. నేటి రాజపుత్రస్థానములోని స్వదేశసంస్థానములును గుజరాతులోని స్వదేశసంస్థానములును రాజపుత్రులు వైచిన బీజమున మొలచినవి. ఇవిలెక్కకు నూర్లగుచున్నవి. ఈ నాటి లెక్కకే యిన్నియుండ ఆనాడు దేశమందంతటను నేర్పడినరాజ్యము లిన్నియని యెవ్వరుగణింపగలరు? అన్నిటి చరిత్ర నెవ్వరు వ్రాయగలరు?

రాజపుత్రులది వీరపరంపర పద్ధతి. రాజునకు ప్రాణమైన నర్పించు ప్రభువులు, ప్రభువులు కనుసన్న జేసిన కంఠమివ్వను సిద్ధపడునట్టి సామంతులు, వారిమాట నవ్వడిని సర్వత్యాగముచేయ సమర్థులగు వీరభటులు, భర్తచేతికి కత్తిదూసి యిచ్చు భార్యలు, డాలుచిప్పల నుయ్యాలలు గావించి వీరప్రతాపులపాటలు బాడుచు శిశువుల జోకొట్టు తల్లులు, మగలు యుద్ధమున దెబ్బతినుదురేమోయని కంటికి రెప్పవోలె పురుషవేషమున ఖడ్గపాణులై వెన్నంటియుండు మగువలు, వీరగణములను జీరికిగొనక స్వయంవరమున కన్యకలవరించి స్యందనములపై నిడుకొని వెడలిపోవు పెండ్లికొమరులు, మగవారు యుద్ధమున మడియగా శత్రుస్పర్శకలుగునేమో యని మానరక్షణకయి చితిబేర్చి జోహారొనర్చు పెండ్లికూతుండ్లును రాజపుత్రచరిత్రమును జగద్విఖ్యాతము గావించినారు. ఇట్టి ప్రతాపాగ్నిప్రజ్వరిల్లిన యైదునూరేండ్లచరిత్రము వ్యర్థచరిత్రమెన్నడును గానోపదు. ఇందును గురించి భారతభూమి విషాద మంద నవసరములేదు.

బెజవాడ మునిసిపాలిటీవారు ప్రాతటోలుగేటు కట్టడములో నొక పఠనాలయముపెట్టి ఆ ప్రాంతములలోని కర్మకరులసేవ చేయుటకు నిశ్చయించినారు.

లైబ్రరీల గ్రాంటులకొరకు మద్రాసు ప్రభుత్వంవారు రు 10,000 లు ప్రత్యేకపరచినారు. రు 400 ల గరిష్ఠమితికి ఎక్కువకాకుండ ఈ సొమ్మును పంచిపెట్టుదురు. ఇదివరలోవలెనే మునిసిపాలిటీ ద్వారాగాని జిల్లాబోర్డు ద్వారాగాని ఈ గ్రాంటులు చెందగలవు. నిబంధనలు ఇదివరలోవలెనే. దరఖాస్తులు 1936 వ సంవత్సరము జూలై 15 వ తేదీ లోపల డైరెక్టరు అఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షను వారికి చేరవలెను.

# మోటుపల్లి రేవు

(శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు)

ప్రాచీనకాలమునుండియు గుంటూరుమండలములోని బాపట్లతాలూకాలో బాపట్లకు సమీపమున సముద్రతీరమునందున్న మోటుపల్లి గ్రామము ప్రసిద్ధమయిన రేవుపట్టణముగానుండి చీనా, బర్మా, పారసీకము మొదలగు విదేశములతో వాణిజ్యము నెరపుటకు నాంధ్రదేశములో నొక ప్రధానస్థాన మయ్యెను. ఈ మోటుపల్లికే వేలానగరమని నామాంతరము గలదు. ఈ వేలానగరము ఆంధ్రశాతవాహనుల కాలమునను, ఆంధ్రపల్లవుల కాలమునను, ఆంధ్రచాళుక్యుల కాలమునను, ఆంధ్రచోడులకాలమునను ప్రసిద్ధికెక్కిన పట్టణముగ నున్నను, క్రమముగా చాళుక్యుల పరిపాలనానంతరము వాణిజ్యము క్షీణింప నంతగా గణనకు రాకయుండెను. మోటుపల్లికడ మెట్టపట్టిన ఓడలలోని సరకులను ఆసమీపమందలి మండలేశ్వరులు కొల్లగొట్టుచుండుటచేత, నావికు లా రేవునకు జేరుటకే భయపడుచుండిరి. అందువలన ప్రసిద్ధిగాంచిన వర్తకు లెవ్వరును ఆ పట్టణమున నివాస మేర్పరచుకొనకపోయిరి. కాకతిగణపతిదేవ చక్రవర్తికి పూర్వము కొంతకాలమునుండి విదేశవ్యాపారము నడపునట్టి వర్తకులకు నభయశాసన మీయగల చక్రవర్తిగాని మహారాజుగాని లేనందువలననే ఆ ప్రసిద్ధమయిన రేవుపట్టణమున కాగతిపట్టెను. గణపతిచక్రవర్తి తాను సింహాసనారూఢుడై నెలనాటిని జయించిన పిమ్మట నీ వేలానగరము నుద్ధరించి విదేశ వ్యాపారమును పెంపొందింప వలయునన్న సంకల్పము మనస్సున నంకురించిన వెంటనే యుపేక్షింపక మంత్రులతో నాలోచించి అందులకుదగిన ప్రయత్నములను గావించెను. అప్పుడాగణపతి చక్రవర్తి వర్తకులకు నభయశాసన మొసగెను. 'నాజీవితముకన్నను నాప్రజల సంరక్షణమే నాకెక్కువ ప్రీతికరమయిన విషయ'మని ఆ అభయశాసనమున వ్రాయించెను. మరియు నాశాసనమువలన సత్ప్రభుత్వము యొక్క ధర్మములను కాపాడుటకును, కీర్తికొరకై యధికాభినివేశముతో సముద్రయానముచేసి విదేశములతో వ్యాపారము జేయునట్టి వర్తకులయందలి ప్రేమచేత నొక్క కూపశుల్కము మాత్రము గాక తక్కిన సుంకముల నన్నిటిని వదలివేసితిమని లిఖింపబడియెను. ఉత్తరమునుండి దక్షిణమునకు గాని, దక్షిణమునుండి యుత్తరమునకుగాని పోవు యోడలు వాయువశమున నీ రేవున మెరకపట్టిపోయిన యెడల నాసరకుల నోడదొంగలు కొల్లగొనకుండ గట్టడిజేయుటయెగాక, వర్తకులు నిర్భయముగా రాకపోకలు జరుపుటకు తగిన మార్గముల నేర్పరచెను. ఎగుమతి దిగుమతులపై శుల్కపరిమాణము ముప్పదింట నొకటిగ నిర్ణయించెను. శ్రీగంధము ౧కి గ ౧, పచ్చకర్పూరమునకు, చీని కర్పూరమునకు, ముత్యాలకు వెల గ ౧కి అ ౻ పన్నీరు, దంతము, జవ్వాది, కర్పూరతైలము, రాగి, తగరము, సీసము, పట్టునూలు, పవడము, గంధద్రవ్యములకు వెల గ ౧కి అ ౧।, మిర్యాలు వెల గ౧కి అ ।।।-, పట్టుస్వరూపము ౧కి గ ౧కి అ ౻

ఈ రీతిగ సుంకము విధింపబడియెను. ఈసరకుల నామమునుబట్టియే యాకాలమునందా రేవుపట్టణము ఎంతప్రసిద్ధమయినదిగ నుండెనో, ఏ యే దేశములతోడ వ్యాపారముల జేయుచుండెనో వేరుగజెప్పనక్కరలేకయే బోధపడకమానదు. కాకతి గణపతిదేవ చక్రవర్తియొక్క కృపావిశేషముచేతనే ఆ రేవుపట్టణము పునరుద్ధారణము గావింపబడుటయు, అతని కుమార్తెయైన రుద్రమదేవికాలమున వెనీసువర్తకుడైన మార్కొపోలో' అను వానిచేత శ్లాఘింపబడుటయు తటస్థించినది.

# కూచిపూడి వారి సంగీతము - నృత్యము

(శ్రీ దివాకర్ల రామమూర్తిగారు)

సంగీతము లలిత కళలలోనొకటి. కవిత్వము చిత్రరచనలతో సమానమగు స్థానము సంగీతము గూడ నధిష్ఠించినది. కవిత్వము భాషాసంస్కారుల నానందపరవశుల జేయును. చక్కగా మధురమగు గళమెత్తిపాడబడిన సంగీతము, చెవులు గల్గిన వారలనందరను తన్మయుల జేయును. శ్రోతల తలత్రిప్పు లధికమగును. 'ఒహో!' లు రవళించును. ఈ యంశమున కవిత్వము సంగీతమునకు వెనుకబడినదనవచ్చును. సంగీతము సర్వజన హృదయాకర్షకమగు లలితకళ.

సప్తస్వరసమ్మేళనము సంగీతము. నిర్వాతప్రదేశమున శబ్దముప్రయాణము సాగింపదు. గాలిలో కదలింపబడిన చిన్న వాయు తరంగములవలన శబ్దముత్పన్నమగును. ధ్వని తరంగములు చెవుల దాకికదలింపబడిన కదలికలకుసరియగు ధ్వనిగలుగును. ఆధ్వనిని మనము మాటగా విందుము. సంగీతమున కాది కొందరు 'ఓం', ప్రణవ మందురు. ప్రణవనాదము కొన్ని స్వరములకూడిక. స్వరములు వాయుచలనము వలనగాని జనింపవు. స్వరములు ముఖమునుండి వదలుగాలుల హెచ్చుతగ్గుల పై నాధారపడియుండును. వాయువిస్తీర్ణమున హృద్యమగు ధ్వనులు గలుటకే సన్నాయి పాటకులు వేళ్లతో రంధ్రముల మూయుదురు, తెరచుదురు. హార్మోనియము మీద మీటరులు నొక్కుదురు. వీణాది వాయిద్యములందు చేతులను పైకి క్రిందికి తీగలపై నడిపింతురు. ఇది శాస్త్రసమ్మతము.

కొన్నికొన్ని స్వరసమ్మేళనములు శ్రవణములకు సుభగములగును. ఆస్వరసమ్మేళనములను రాగములందురు. స్వరమిశ్రభేదముల ననుసరించి రాగములుమారును. రాగములు మార్చినచో కలుగు ధ్వని తారతమ్య మంద రెరిగినదియే! సంగీతశాస్త్రానుసారముగా సంగీతము నభ్యసించుటకష్టసాధ్యమగు పని. కంఠము మధురముగా పలికినంత మాత్రమున అదిశాస్త్ర సమ్మతమయిన సంగీతముగాదు. శాస్త్రపరిచయము గల విద్వాంసులే గానసభలయందు పాట కచేరీలు చేయుదురు. శ్రీయుతులు వారి నాగభూషణము, శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగా ర్లభ్యసించి ఆంధ్రుల ముంచెత్తిన గానము శాస్త్రబద్ధము.

కూచిపూడి వారి కంఠములనుండి యశాస్త్రీయములగు స్వరములురావు. వారి మధుర కంఠములందు తియ్యని కిన్నెరగానములు ధ్వనించును. శాస్త్రవిచారణవచ్చినచో వారు వెనుకబడని పాండిత్య సముద్రులు. వారి శాస్త్రపద్ధతి ఆధునికులకు తలనొప్పి కల్గించును. ఇది వారి దౌర్భాగ్యము. అల్లి బొల్లి కూనరాగములనిన చెవిగోసు కొనువారికి శాస్త్రబద్ధ సంగీత మేల రుచించును? గొల్లభామ డబ్బాపాల రుచినెరిగిన పిల్లలకు గంగగోవుపాలేల రుచించును?

'భారతి' మాసపత్రికయందలి త్రివర్ణచిత్రములందు శ్రావణము, చైత్ర మిత్యాదినామములతో చిత్రములు ప్రచురింపబడుచున్నవి. ఆభావ చిత్రము లట్లేలయుండవలయును? పూర్వకాల చిత్ర* కళావిశేషము లనియా సమాధానము? చిత్రస్వరూప మట్లెందుకుండవలయును? పూర్వీకులుమాత్రము హృదయాకర్షకములగు చిత్రకళ నభ్యసింపలేదా? చూచినంత కనురెప్పలు మూతపడని చిత్రములు ప్రాచీన చిత్రలేఖనములందెన్నియున్నవి?

చిత్రకారుని భావముకొఱకు వెదకులాడువారరుదు. అత డనుభవించి, చింతనజేసి, అన్యదుర్లభమైన యొక దివ్యసమాధినుండి రచించిన చిత్రము లివి. ఆ చిత్రమును రచించుట కా చిత్రకారునకు కొన్ని మాసములయినను పట్టి

* కాశీనాథుని చిత్రములు. భారతి జూడుడు.

యుండును. మనము పుటతిప్పుటయేగాని కొన్ని క్షణములయిన పరిశీలనాదృక్కుల నా చిత్రపటమున నిగిడింపము. అది కళాతపస్వులకు చెల్లినది. కళోపాసకులకు తగినది.

సంగీతశాస్త్రపారంగతు డయిన విద్వాంసుడు మందస్వరమున గగనము మార్మ్రోగ పాడిన మేఘసంచారములేని యాకాశమున మేఘములు దట్టముగబట్టి వర్షము కురియునని చెప్పుట వినియుందురు. ఇది అతిశయోక్తి గా నేరదు. సంగీతమునకు హృదయములు గరగుట గాదు. శిలలు ద్రవించును. ప్రకృతికిని సంగీతమునకును ఒకానొక బాంధవ్యమున్నది. ఒక్కొక్కరాగము, ఒక్కొక్క స్వరమున శాస్త్రరీతిని పాడిన ప్రకృతి తారుమారగును. అట్టి ప్రకృతిలోని మార్పు లాచిత్రములందు నిబిడీకృతములు. ఆయా రాగములు చిత్రమునకు దిగువనుదహరింపబడి యుండును. కొన్ని కొన్ని చిత్రముల దిగువభాగమున ఆయా గీతికలుగూడ వ్రాయబడినవి. శాస్త్రకట్టుగా సంగీతము నభ్యసించి మేళవించు కూచిపూడివారు శాస్త్రప్రకృతిలో మార్పొనగూర్పగలరు. తలలు వ్రేలాడవేసిన ♦పచ్చిక మొలకలనునిగిడింపగలరు. నీరున్నవైపునకు తలలుచూపిం లతాసంతానముల తమమధురగానాలాపనమున తమదిక్కు త్రిప్పుకొనగలరు. వారిజీవన మాశాస్త్రవిచారణమీదనే ఆశాభవంతులు నిర్మించికొని యున్నది.

* * *

నృత్యమున కధిదేవత నటరాజు. ప్రళయాంతములో శివస్వామి నర్తించువేళ, చేతిలో ధ్వనించు ఢక్కినుండి ప్రణవశబ్దముత్పన్నమయినది. ఆమూర్తి నాట్యములోనుండి నృత్యము జననమైనదని కొందరిమతము. మృదంగనాదమునకు నృత్యమునకు దగ్గరబాంధవ్యమున్నది. శివమెత్తిన గణాచారిసహితము డోలుపై దెబ్బ పడినగాని నృత్యము, వాయింపునకు తగినరీతిని చిందులు, ప్రారంభింపడు. వివిధములగు మద్దెల దరువులున్నవి. దరువున కొక్కొక నృత్యము చేయుదు రా విద్యావిదులు ఆ మృదంగపు వరుసలుచ్చరించుటతోనే శరీరము తన్నుతామరచి పోవును. మద్దెళ్లకు గంగిరెద్దులు సహితము నృత్యము సల్పుట వీధులయందు ప్రత్యక్షము. మృదంగనాదములకు తాళములచప్పుళ్లు కలసిన అభినయము నృత్యము జీవమునొందును. ఆ సజీవనృత్యమును ఆరాధించిన నటరాజమూర్తులు కూచిపూడివారు. వారితాళము లెక్కడ ద్వారకునోగాని కుంభకర్ణుల నిద్రనుండి మేల్కొల్పునంతటి ధ్వని నిచ్చును. వారు మృదంగ వాయిద్యముకొఱకొరులపై నాధారపడరు. వారా విద్యయందు కొందరకు క్రమశిక్ష నొసగెదరు. మద్దెలదరువు లుచ్చైశ్శ్రవమున నుచ్చరించుచు, తాళలయయుక్తముగా నర్తనము సల్పిన, పదులాది సంవత్సరములు నాట్యములు నేర్చుకొనిన విద్యావతులగు కళాస్త్రీలు సహితము వారి ముందు తమ పాండిత్యమునకు చిన్న బుచ్చుకొందురు. ఇట్టి నృత్యము పాడుగీతిక ననుసరించి ఒకానొక మూర్తిని ద్రష్టల హృదయములందు ప్రతిబింబింపజేయును. ఆమూర్తి ఎదురుగా అభినయములో గోచరించును. ఇప్పుడు ప్రేక్షకులు రసగ్రాహులయినచో ఒక ఉన్మత్తస్థానమధిష్ఠింతురు. ఒంటిపై బట్టమరచెదరు. అప్పుడే కళకు సార్థకత; నర్తకులకు గాయకులకు తృప్తి. అది కళాతపస్సుయొక్క వెయ్యేండ్ల ఫలితము. కూచిపూడి వారి నృత్య మిట్టి యున్నతాభిప్రాయ శోభితము. కూచిపూడి వారి నాట్యసతి ఆవేశ మట్టిది. కళాపటిమ యట్టిది. ఆనాట్యసతి యుగ్గుపాలతోనేర్చిన లలితకళ ఇది. ఇది కూచిపూడి వారలకు జన్మతః హక్కు.

♦ చెట్లు సంగీతముచే నాకృష్టములని ప్రత్యక్షప్రయోగముల వృక్షశాస్త్రజ్ఞులు రుజువు చేసిరి. కృష్ణక్రీడాచిత్రములందు గోవులు, హంసలు, నెమిళ్ళు, గానాకృష్టములట్లు భావగర్భితముగా చిత్రింపబడుటయునిందులకే.

# చైనాలో విద్యార్థులొనర్చిన మహాప్రబోధము

(శ్రీ అ. కాళేశ్వరరావుగారు, బి.ఏ., బి.ఎల్.)

చైనావిద్యార్థులొనరించుటకు పూనికొనిన ముఖ్యమైన మహాత్కార్యము ప్రజాప్రబోధమై యున్నది. విద్యాలయములు తెరచియున్న దినములలో విద్యార్థులు విద్యాలయమునకు సమీపముననున్న ప్రదేశములోని సామాన్యజనులకుపన్యాసముల నిచ్చిరి. వేసంగిశలవులలో పట్టణములకును పల్లెలకును పోయి యుపన్యాసములనిచ్చిరి. తరుచుగ స్వదేశిసరుకులను వెంటగొనిపోయి ప్రజలకమ్మి వారిలో "స్వదేశీ" యభిమానమును కలుగ జేయుచుండిరి. ఒక్కొక్కపుడు సంగీతముతోగూడ నుపన్యసించిరి. ఈయుపన్యాసములలో రాజకీయ సాంఘికవిషయములగూర్చియు దేశపరిస్థితులనుగూర్చియు చెప్పుటయేగాక ఆరోగ్యము శరీరశాస్త్రము ప్రకృతిశాస్త్రములు మొదలగు విషయములను గూడ బోధించిరి. ప్రతిచోటను సామాన్యజనులకొరకు పాఠశాలలను స్థాపించి అజ్ఞానమును పోద్రోలుటకు విద్యార్థులు చాలగ కృషిసల్పిరి. ఒక్కపికింగునగరమున విద్యార్థులచే నడపబడుచుండిన పాఠశాలలు పందొమ్మిది యుండెను. వాటిలో 2326 మంది చదువుకొనుచుండిరి. శలవులలో తమ స్వగ్రామములలోను చుట్టుపట్లను పాఠశాలలను స్థాపించుచు వచ్చిరి. 1921 వ సంవత్సరమున పూచోకళాశాలలోని 123 విద్యార్థులు వేసంగిశలవులలో కొన్ని జట్టులుగ చీలి గ్రామములలోనికి పోయి 3000 మంది విద్యార్థులుగల 28 ఉచితముగ చదువుచెప్పు ప్రాథమికపాఠశాలలను స్థాపించి వచ్చిరి.

ప్రజలలో చదువురానివా డుండగూడదు.

1922 వ సంవత్సరమున చైనా దేశములోని కోట్లకొలది జనులలో వ్యాపించియున్న అజ్ఞానమును పోద్రోలి నూటికినూరుమందికిని అక్షరజ్ఞానము కలుగచేయవలెనను మహాప్రయత్నము చాంగ్షా జిల్లా విద్యార్థి సంఘమువారు ప్రారంభించిరి. ఇందునగూర్చి జిల్లాయందంతటను ఉత్సవములను సభలను జరిపిరి. 'చదువురానివాడు గ్రుడ్డివాడు,' 'నీకుమారుడు గ్రుడ్డివాడా?' 'చదువురానిజాతి బలహీనమైనజాతి,' 'చైనాయొక్క మోక్షము ప్రజలలో విద్యావ్యాపకము చేయుటలో నున్నది.' 'చైనాలో ముప్పాతికభాగము అంధకారమునందుండగ సహించియూరుకొనగలవా?' అను మొదలయిన ప్రబోధవాక్యములను పతాకములమీదను గోడలమీదను లాంతరుస్తంభములమీదను వ్రాసిరి. వందలకొలది విద్యార్థులు జిల్లాలోని పట్టణములకును పల్లెలకునుపోయి 1922 వ సంవత్సరము మార్చినెల మొదలు జూలై నెలవరకును అయిదు నెలలు వేలకొలది జనులకు ప్రాథమికవిద్యను నేర్పిరి. ఇటులనే ఛీఫోజిల్లాలోని విద్యార్థి సంఘమువారును విద్యను వ్యాపింపజేసిరి. యువతులు గృహములలోని స్త్రీలకు విద్యనేర్పుటకు పూనుకొనిరి. ఈ రెండు జిల్లాలలోను జరిగిన పనియొక్క ఫలితమువలన నీయజ్ఞానమును పారద్రోలు మహోద్యమము దేశముయొక్క పెక్కుప్రాంతములలో కార్చిచ్చువలె వ్యాపించెను. విద్యావ్యాపకమునందు ప్రజలలోను ప్రభుత్వమునందును శ్రద్ధ చాలగ హెచ్చెను. 1910 వ సంవత్సరమున దేశములో నూటికి ఒకరుచొప్పున చదువువచ్చినవారుండగ, 1928 వ సంవత్సరమునకు నూటికి చాలరాష్ట్రములలో పదిహేను మంది చొప్పునను కొన్నిరాష్ట్రములలో ఏబది మంది చొప్పునను చదువు వచ్చినవా రుండిరి. చైనాజాతీయ ప్రభుత్వము బలపడిన కొలదియు ప్రజలలో విద్యాభివృద్ధి యింకను పెంపుగాంచుచున్నది. ఇపుడు సాధారణముగ నూటికి నలుబదిమంది చదువుకున్న వారున్నారు.

# రష్యాదేశపు గ్రంథభాండాగారాలు

(శ్రీ గో. రాధాకృష్ణమూర్తిగారు, బి. ఏ.)

కొంచెం సూచన :

రష్యా ఐరోపాఖండంలో ఉన్న ఒక దేశం. ఇది ఏడు పరగణాలు కలిసినది.

దీని వైశాల్యం 8,241,673 చదరపుమైళ్లు. అంటే కొంచెం ఇంచు మించు మన దేశానికి ఐదింత లున్నది.

రష్యాలోఉన్న మొత్తం జనసంఖ్య162,143,000. సుమారు మన దేశ జనసంఖ్యకు సగం

రష్యాలో చదువురానివాళ్ళు 48,000,000 అంటే నూటికి 30 మం దన్నమాట.

రష్యావారు సమానసంపత్తివాదులు.

ఈ దేశంలో కార్మికులకు కర్షకులకు అందటి కంటె ఎక్కువ గౌరవం. వారే రష్యాకు వెన్నెముక. . కాయకష్టం చేయనివారిని రష్యావారు చాలా గర్హిస్తారు. అట్టివారికి ఆ దేశంలో తావు లేదు.

ప్రపంచంలో అన్ని దేశాలకన్నా ఈ దేశం మీాదే ఎక్కువ పుస్తకాలు వ్రాసారట.

అట్టి ఈ దేశంలో గ్రంథాలయోద్యమం ఏలాగున్నదో, దాని ఆశయాలేమిటో, అవి ఎంతవఱకు కొనసాగింపబడినవో, వాటివల్ల ప్రజలు ఎంత విజ్ఞానాన్ని గడించారో తెలుసుకోవటం వ్యర్థంకాదు.

ఈవ్యాసంలో ఇవన్నీ ఇమడ్చబడి ఉన్నాయి.

**1**

ప్రపంచంలో ఏ ఉద్యమంగురించి మాట్లాడినా, ఏ స్థితినిగురించి వ్రాసినా ప్రస్తుతం "మహాసంగ్రామానికి ముందు," "మహాసంగ్రామానికి వెనుక" అని విభజించటం పరిపాటయిపోయింది.

ఆలాగే రష్యాదేశాన్నిగురించి ఏదివ్రాసినా ఆదేశంలో జరిగిన జాతీయవిప్లవానికి ముందు, దానికి వెనుక, ఉండే పరిస్థితుల భేదాభేదాన్ని వేర్కోటం అలవాటైపోయింది.

ప్రస్తుతం అచ్చటి గ్రంథాలయోద్యమాన్ని ఆదృష్టితోటే చూడ్డం మంచిఏలు.

**2**

రష్యా కార్మికవిప్లవానికిముందు :

అప్పుడు ఆదేశంలో . పెద్దపెద్ద పట్టణాల యందే గ్రంథాలయా లుంటుండేవి. వానిలో మంచి పుస్తకాలే ఉండేవికాని అవి అందటి అందుబాటులో లేవు.

అప్పట్లో ఈ గ్రంథాలయాలు రెండు తెగలు. ప్రజల చందాలవల్ల స్థాపింపబడి పోషింపబడేవి ఒకరకము. ప్రభుత్వపు ధర్మపుస్తకభాండాగారాలు రెండవరకము. మొదటివానివల్ల కొంత మందికే లాభం వుండేది. రెండవవాని ఉపయోగం చాలా స్వల్పం. 1905 ఆ ప్రాంతాల్లో చాలా పుస్తకాలు బహిష్కరింపబడి, తగుల పెట్టబడి మొదలగు నవి జరగడంవల్ల ధర్మ పుస్తకాలయాల ఆ కొద్ది లాభం అంతరించి పోయిందని చెప్పాలి.

విప్లవానికి తరువాతసంగతి :

1917 వ సంవత్సరం.

ఇచ్చటినుంచి ఆ దేశచరిత్రలో ఒక నూతన శకం ఆరంభమైంది. రాజకీయ పరివర్తనంతో

సాంఘిక పరివర్తనం, దాంతో ప్రజల ఆశయాలు, అభిరుచులు, అభిలాషలు పరుమార్గైనవి.

ఈ మార్పులతో గ్రంథాలయోద్యమం స్థితి మారింది. నిరంకుశత్వం కాలగర్భాన్ని కలిసి పోయినట్లు, ఈ ఉద్యమపు నీచస్థితి కూడా అంతరించింది.

ప్రజలకు మంచిరోజులు వచ్చాయి. వాటితో ప్రజల విజ్ఞానాన్ని వికసింపచేసే గ్రంథాలయాలకీమంచిరోజులు వచ్చినవి.

రష్యాలోని ప్రతి పరగణాలోను గ్రంథాలయాలు వెలసినవి. వీటన్నిటికిమీదుగా కేంద్ర గ్రంథాలయాలు పుట్టినవి. ఇవిగాక చాలా చోట్ల ప్రభుత్వంవారివల్లను ప్రజలచేతను వేలకు వేలు స్థాపింపబడ్డాయి.

మూడువిధాలు :

అప్పట్లో ఈ గ్రంథాలయాలన్నీ మూడు తరగతులక్రింద భాగింపవచ్చును. అవి పట్టణాలలో ఉండేవి, కార్మికులవి, ప్రత్యేకవిషయం కొఱకున్నవి. విద్యాసంస్థలకు చెందినట్టివి.

3

రెండుకారణాలు :

దేశంలో ఏ ఉద్యమమైనా ప్రభుత్వసహాయం లేందే పైకిరాదు. ఆ ఉద్యమాలు పుట్టి అంతలోనే అపురూపమైపోతాయి.

రష్యాలోని గ్రంథాలయోద్యమపు ఉన్నత స్థితికి రెండు కారణాలున్నాయి.

అవి ప్రభుత్వమువారిచేచేయబడ్డసహాయాలు.

1920 లో ప్రభుత్వమువారిచే అములులోనికి తేబడ్డ ఒక తీర్మానం. దానివల్ల ఈ గ్రంథాలయాలన్నీ ప్రభుత్వవిద్యాశాఖవారి అధీనంలోకి వచ్చాయి. దాంతో వాటికి ఒక క్రమగతి ఏర్పడ్డది. పట్టణాల్లో ఉండే గ్రంథాలయాలన్నీ ప్రభుత్వముపోషణలోకి వచ్చాయి.

తిరుగుబాటుతర్వాత రష్యా చరిత్రలో "పంచవర్షప్రణాలిక" అటూ విటూంటాము. దీనివల్లనే, ఈదేశానికి, ఇతరదేశాలకి ఒక శతాబ్దంవల్లకలిగినమార్పుకంటే ఎక్కువమార్పు కలిగింది. ఈ మార్పంతాశుభోదయమే.

ఇట్టి ప్రణాలికయందు ఈ గ్రంథాలయోద్యమానికి మంచిస్థానం ఇవ్వబడింది. "ప్రతి మిల్లులోను, ప్రతికర్మాగారంలోను గ్రంథాలయాలు స్థాపించాలి. వాటి పోషణ కార్మికసంఘాలవల్లనే జరగాలి" అని ప్రభుత్వం శాసించింది.

4

గ్రంథాలయనిర్వహణం :

ఆదేశంలో భాండాగారాల్ని నడిపేవిధంలోని కొన్నిముఖ్య విషాయాలు గమనించతగ్గవి.

మొదటివిషయం :

చాలామట్టుకుగ్రంథాలయాల్లోపుస్తకాలను అందఱకు తెరచి వేయబడే అరల్లో (ఓపెన్ ఆక్సెసు) ఉంచుతారు.

వార, పక్ష, మాస పత్రికలు వేరే గదుల్లో ఉంచుతారు. మిక్కిలి నూతనమైన వాటిని ప్రత్యేకంగా ఉంచి ప్రతిపత్రికలోని ముఖ్యవిషయాల్ని సూచించే కాగితాలను వాటిక్రింద అతికిస్తారు.

ప్రత్యేక పరిశోధనలు చేసే విద్యార్థులకు వేరుగదు లిచ్చి సౌకర్యం చేస్తారు.

రెండోవిషయం.

పుస్తకాల పట్టికలను తయారు చేయటంలో రష్యా చాలా దేశాల్ని మించింది.

పుస్తకాలను మార్క్స్ లెనిన్ పద్ధతుల ప్రకారం అమరుస్తారు.

ప్రతిపుస్తకానికి వ్యాఖ్యానం వ్రాయించి, అందులోని ముఖ్యవిషయాల్ని చేర్చి, అక్షర సంజ్ఞాప్రకారం ప్రత్యేక పట్టికలను తయారు చేస్తారు.

గ్రంథకర్తల పట్టికలనుగూడా తయారు చేస్తారు. కాని ఇవి చాలా అరుదు.

1925 లో ఇట్టిపట్టికలను తయారుచేయుటకు ప్రభుత్వంవారు ఒక సంఘాన్ని నియమించారు

మూడోవిషయం.

ప్రత్యేకవిషయగ్రంథాలయాలు. ఇవిఏదోఒక శాస్త్రంకోసం వినియోగింపబడినవి. ఒకగ్రంథాలయంలో అన్నీ ఇంజనీరింగ్‌పుస్తకాలే, మరొక దాంట్లో అన్నీ వైద్యవిద్యకు సంబంధించినవే, యీలాగే...

నాల్గోవిషయం.

ఇది గ్రంథాలయనిర్వాహకులకు క్రమశిక్షణ ఇచ్చుట.

ఈ శిక్షణలో చాలాతరగతు లున్నాయి.

"లైబ్రరీటెక్నికం" అనేవాటిలో మూడేండ్ల శిక్షణ ఇస్తారు.

వీటిపైన కావాలంటె, "సైంటిఫిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్సు" మొదలగునవి ఉన్నాయి.

కార్మిక గ్రంథాలయ నిర్వాహకులకు ఒక ప్రత్యేకశిక్షణ ఉంది. అది, మామూలు దాంతోబాటు, కర్మాగారాల్లో కార్మికుల ప్రక్కన 40 రోజులు, రోజుకు 4 గం॥ ల చొప్పున పని చెయ్యాలి.

దీని ఉద్దేశం వారు కార్మికుల మానసిక ప్రవృత్తులను బాగాతెలిసికొని వారికి కావలసినదేదో చేయటానికి వీలుగాఉంటుందని. ఇంతకన్నా మంచివిధం మరొకటుండదు.

ఒకడు కూలివాని గురించిగాని, బిచ్చగాని గురించిగాని వ్రాయాలంటే తనూ వాడితో పాటుతిరిగి వాడి బాహ్యప్రకృతేగాక, అంతఃప్రకృతికూడా గ్రహించాలి. అప్పుడే అతడు వ్రాసింది నమ్మదగింది, గౌరవింపదగింది.

ఐదోవిషయం.

గ్రంథాలయోద్యమానికి సంబంధించిన ప్రచురణ.

ఇందులో చేరినవి మూడు పత్రికలు. ఇవి ప్రభుత్వమువారి నియామకులచే ప్రచురింపబడతాయి.

5

సోవియట్ గ్రంథాలయాలు ప్రజల సాంఘిక జీవనానికి, వారినైతిక వికాసానికి బాగా నీరుపోసినవి ఈవిషయం బాగా గ్రహించిన ప్రభుత్వంవారు వీటిని సజీవంగా చేసారు. ప్రజలను వీటివద్దకు ఆకర్షించుటకు అన్నిచిట్కులను ప్రయోగించారు.

చదువురానివార్ని ఆకర్షించటానికి ఈ గ్రంథాలయాల్లో బిగ్గరగా చదువుట ప్రవేశపెట్టారు.

ఒకవైపున ప్రభుత్వం ఈలా ఈఉద్యమాన్ని పైకితీసుకొని వస్తుంటే, ప్రజలుగూడా మరొక ప్రక్కన దీని అభివృద్ధికి తోడ్పడ్డారు. వారుకూడా దీని ఆధిక్యతను, ఉపయోగాన్ని గుర్తించారు.

ప్రతిపార్కులోను, ప్రతిరైలు స్టేషను వద్దను, ప్రతిసినిమాహాలు ముందరను పఠనమందిరాల్ని గ్రంథాలయాల్ని స్థాపించారు. ఏకార్మిక సమాజం వర్కర్సుక్లబ్బులో చూచినా ఇట్టివి లేకుండా ఉండదు.

వీటితో పాటు గ్రామగ్రంథాలయాలు ప్రతి గ్రామంలో ఉన్నాయి. వీటితో సంచార గ్రంథాలయాలు కూడా నడుపబడుతున్నాయి. ఇవి జరిగి నంత జయప్రదంగా మరే దేశాల్లోను లేదట.

1932 లో ఇట్టివి 38,283 ఉన్నాయట.

6

ఈ గ్రంథాలయాల ఉపయోగం క్రింది లెఖ్ఖల వల్ల స్పష్టమౌతుంది.

రష్యాలో 1917 లో చదువ నేర్చినవారు నూటికి 30 మంది, కాని 1933లో చదువుకొన్న వారు నూటికి 90 మంది.

ఇది 17 ఏండ్లలో కలిగిన పరివర్తనం.

300 ఏండ్లకు పైబడిన బ్రిటిషు ప్రభుత్వం వల్ల హిందూదేశంలో ఇప్పటికి చదువ నేర్చిన వారు నూటికి 16 మంది!

మరి కొన్ని అంకెలు.

| సం\|\|ము | మొత్తము గ్రంథాలయాల సంఖ్య | గ్రంథాల మొత్తము | వీటిని ఉపయోగించినవారు |
|---|---|---|---|
| 1917-18 | 28,294 | 62,313,000 | 7,600,000 |
| 1930-31 | 27,312 | 94,000,000 | 11,600,000 |

| | సంచార గ్రంథాలయాల సంఖ్య |
|---|---|
| 1917-18 | 52,000 |
| 1930-31 | 111,000 |

వీటివలన రష్యావారీమహోద్యమానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చిరో విశదమౌతుంది.

## గోడగూచికథలోని శబ్దవిశేషములు.

(చూడు ఏప్రిలు సంచిక, 15వ పుట)

1. పొన్నూరు:—i పొన - పొన్న + ఊరు - పొన్నయూరు- పొన్నూరు అగపడుచున్నయూరు పొరుగూరు;

 'అల్లదె కంటిరె పొనపొన
 తెల్లనిగట్టురుత మబ్బుదేరెడుపొలమం'
 దెల్లెడజూచినధరణీ
 వల్లభసీరాముసేన వాలుమెకంబుల్.

 మనుచరిత్రము అ. 4 ప. 15.

 ii పొందు + ఊరు - పొన్ + ఊరు - పొందూరు - పొన్నూరు.

2. గంగి:—పూజ్యము - గంగి, గోవు - పవిత్రమైనఆవు, రూపాంతరము గంగగోవు, గంగి - ఆవు, బ - వ గంగులు.

3. కోర:—గిన్నె, చెంబు - అపుకోర - అపః + కోర నీళ్ళచెంబు, పంచపాత్ర.

4. ఎడ వాద్యములు:—కొద్దిపాటి వాద్యములు, ప్రక్కవాయిద్యములు.

5. బెడంగనో:— రూపాంతరము బెళగు, బెళంగు, బెడగు - శుభ్రపఱచు, పరిశుద్ధముచేయు.

 జూడుకన్నడము బెడగు - వెలుగు
 బెడఁగు + అను + ఓ - బెడఁగనో
 శుద్ధిచేయకుంటినో - (బొను)

6. మీదుపోవు:—i ఉపరిభాగముపోవు; పొంగుపోవు
 ii దృష్టిదోషము తగిలెనో

7. చిక్కించు:—మిగిలించు

8. కుడుపు:—త్రాగుట - భుజించుట
 కుడి (అరవము) - త్రాగుట, చూడు కుడితి
 తెనుఁగులో 'భుజించుట'యను అర్థములో వాడఁబడుచున్నది.

9. గుదగుద:—(అనుకరణము), రహస్యము గోప్యము గుదగుదలాడు - దగ్గుత్తికతో నేడ్చు

10. పన్నారులు - కుండలు, బాలికలాడుకొను గురిగెలు
 "ప్రాపమేఁపర పచ్చసన్నారు లోవులగులుగు గుజ్జెనగూళ్లు కుడుచు టుడిగి" యయాతిచరిత్రము 3 ఆశ్వాసము.

11. 'లోవి':—వంటకుండ, స్థాలి,
 'లోవిలోనివిశిష్టశాకాన్నము ప్రాశించి'
 భాగవతము 1 వ స్కంధము.

12. పోలెలు:—వాసెనకుడుములు

13. పుల్లఖండము:—పులఖండము - కలకండ

14. ఎడమడుగు, ఎడమడువు - ఆలస్యము; భేదము

15. నూకు:—గెంటు - త్రోయు

16. కుడుక:—కుడువ - గురిగి

17. కటువుగము:—కడు - ఉగము

# గ్రామసీమల గ్రంథాలయములు - దేశీయుల తోడ్పాటు.

(శ్రీమతి ఈడుపుగంటి వేంకటరత్నమాంబగారు)

దేశకల్యాణమును బెంపొందించెడి యనేక ఉద్యమములలో ఆంధ్రావని ముందంజవేయుచున్నది. ఆంధ్రులు తమ నిరుపమానశక్తిసామర్థ్య త్యాగములను బ్రకటించుచున్నారు. వానిలో గ్రంథాలయోద్యమ మొకటి. ఆంధ్ర గ్రంథాలయోద్యమ పితామహులగు శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్య పంతులు, స్వర్గీయ సూరి వెంకట నరసింహశాస్త్రిగారల బోలు మహాశయులు, త్యాగశీలుర ఆధ్వర్యముక్రింద ఆంధ్రదేశములో గ్రంథాలయఉద్యమాభివృద్ధి బహుత్వరితగతిని జరుగుచున్నది ఇందు విషయములో గ్రంథాలయములు మొదలగువానిని స్థాపించుటకు భూరివిరాళముల నిచ్చినవారికిని, రాజకీయోద్యమములలో పాల్గొనెడివారివలెగాక ఎక్కువ పేరుప్రతిష్ఠలకు అంతగా అవకాశము లేనప్పటికిని, నిష్కామహృదయముతో గ్రంథాలయోద్యమవ్యాప్తిద్వారా దేశసౌభాగ్యమును పెంపొందింపజేయవలయునను దృఢసంకల్పముతో, దీక్షతో పనిజేసెడి గ్రంథాలయోద్యమ కార్యనిర్వాహకులకు నా ధన్యవాదములు.

మనదేశములో పదింట తొమ్మిది పాళ్ల జనము గ్రామసీమలలో నివసించెడివారే. అందువల్ల దేశౌన్నత్యమునకు తోడ్పడెడి ఏయుద్యమమైనను గ్రామప్రాంతములలో పూర్తిగా వ్యాపించినప్పుడే, ఆయుద్యమము దేశమందంతటను వేళ్లూనినదని తలచుట కవకాశముండును. అన్ని పట్టణములలోను గ్రంథాలయములు విరివిగా స్థాపించబడుట, పోషించబడుట, ఉపయోగింపబడుట సర్వులకు విదితమే. కాని అన్ని గ్రామములలో గ్రంథాలయము లింకను లేవని చెప్పవలసివచ్చుటయేగాక, గ్రంథాలయము లున్న గ్రామములు ఏకొలదియోగలవనియు, అలా గ్రంథాలయము లున్నను అవినామమాత్రము గాకుండానుండి, పూర్తిగా ఉపయోగింపబడెడివి ఇంకను తరుగనియు వ్రాయవలసి వచ్చినందులకు కడు విచారించుచున్నాను.

ఇవ్విధముగా పల్లెటూళ్లలో గ్రంథాలయాభివృద్ధి ఉండవలసినంత తృప్తికరముగా లేకుండుటకు కారణములు, దానిని వృద్ధిపఱచే మార్గములు, అది సాధించగలిగెడిచో, గ్రామసీమలకు గలిగెడి మహత్తర ఫలితములను గురించి కొంత స్వానుభవపూర్వకముగా చర్చించగోరెదను.

పురుషులలో నూటికి పదింటికి లోపుగాను, స్త్రీలలో ఏఇద్దఱు ముగ్గురో కొంచ మక్షరజ్ఞానముగలిగి, ప్రస్తుతము గాఢ అజ్ఞానాంధకారములో మునిగియున్న . మనదేశములో ప్రజాబాహుళ్యము గ్రంథాలయముల ఆవశ్యకతను సరిగా గుర్తించకుండుటలో నాశ్చర్యమేమియు నుండదు. అయితే ఎక్కువమంది నిరక్షరకుక్షులైన మనదేశస్థులను త్వరలో అక్షరాస్యులనుగా జేయగలిగెడి సాధనముకూడ సత్వరగ్రంథాలయోద్యమాభివృద్ధియే. ఈసంగతి "పెండ్లియైనగాని పిచ్చకుదురదు; పిచ్చకుదిరినగాని పెండ్లిగాదు" అనెడి సామెతను బోలియున్నది. అందువల్ల దేశములో విద్యాభివృద్ధికి ప్రధానబాధ్యులైన ప్రభుత్వమువారు, స్థానికసంస్థలు, రాజకీయవేత్తలు, విద్యాధికారులు మొదలైనవారు గుర్తించవలసినదేమన దేశప్రజల ప్రధానావసరములలో, అన్ని గ్రామములలోను వెంటనే ఉచితరీతిని గ్రంథాలయములు స్థాపించి వానిని అత్యుత్తమపద్ధతిని ఆకర్షణీయముగా, ప్రజోపయోగకరముగా నడపుట ఒక్కటనియు; ఇది జరుగనినాడు, దేశమందంతటను ఎన్ని విశ్వవిద్యాలయములు నెలకొల్ప బడినను, ఎన్ని

కళాశాలలు పాఠశాలలు నిర్వహింపబడుచున్నను, ఎన్నిఉత్తమోత్తమ పరీక్షలు జరుపబడుచున్నను, ఆసంస్థలు, పరీక్షలవల్ల గలిగెడిలాభము చిరస్థాయిగానుండదు. సాధారణముగా నాలుగు లేక ఐదవ తరగతివఱకును, కొన్ని ముఖ్యగ్రామములలో మాత్రము ఎనిమిదవ తరగతి వరకును విద్యగఱపుచుండెడి పాఠశాలలలో తరిబీయతుపొంది, తరువాత వ్యావసాయిక వగైరా కాయకష్టపు వృత్తులను అవలంబించెడి గ్రామీయులలో, వారిచిన్ననాటి ఒడిమిడి జ్ఞానమైనను వారిని వీడి పోకుండా ఉండవలయునవెడిచో, అది గ్రంథాలయముల ద్వారానే సాధ్యము కనుక ప్రభుత్వము స్థానికసంస్థలు ప్రజలచే లేవదీయబడి, నడపబడుచున్న గ్రంథాలయోద్యమమునకు ఇప్పటికన్న అనేకరెట్లు విరివిగా సహకార మొనర్చి, ఆయుద్యమమునకు వారు హృదయపూర్వకముగా తోడ్పడుటలేదనియెడి అపవాదునకు గురికాకుందురు గాక యని కోరుచున్నాను. ప్రభుత్వము వారును, స్థానికసంస్థలును తమతమ ఆదాయ వ్యయ పట్టికలలో ముఖ్యముగా గ్రామసీమలలో గ్రంథాలయముల వ్యాప్తికిగాను ప్రత్యేకించెడి మొత్తములను ఇప్పటికన్న అనేకరెట్లు వృద్ధి జేసినగాని, ఇందువిషయములో ప్రజలయెడల వారి ధర్మములను వారు సరిగా నిర్వహించుచున్నారని ప్రజలు విశ్వసించజాలరు. తమ ఏలుబడి ప్రాంతములో అత్యుత్తమ పద్ధతిని గ్రంథాలయ వ్యాప్తి జరుగుటకు కారకులైన బరోడా సంస్థాన గైక్వారు ప్రభుత్వము వారిని మన రాష్ట్రప్రభుత్వము వారును, స్థానిక సంస్థలును అనుకరించవచ్చును.

గ్రంథాలయోద్యమము ఇంకను సత్వరముగ గ్రామములలో వ్యాప్తి పొందకుండుటకు కారణము గ్రామవాటికల దుర్భర దారిద్ర్యము. దరిద్రనారాయణుని ఏలుబడిలోనిదైన మన దేశమునకు గ్రంథాలయములు జీవితములో ప్రధానావసరముగా లేవు. అవి ధనవంతుల పాలిటి, ధనమున్నచోటుల నెలకొల్పబడవలసిన విలాసగృహములుగా పరిగణించబడుచున్నవి ఎంతకష్టించినను, ముప్పూటలు తిండికి గూడ నోచుకొనని కొంతమంది సోదర గ్రామస్థుల ఆర్తనినాదములు చెవినిబడనివారు లేరు. అవ్విధముగా లేమిలోనున్నటువంటి సోదరుల సానుభూతిని గ్రంథాలయోద్యమమునకు మనము బడయగలిగినను, అందు విషయములో వారు చేయగలిగెడిది పరిమితముగానే యుండును. అయినను అది పూర్తిగా మృగ్యముగాదని చెప్పుట సాహసముగాదు. ఎంత బీదవారైనను, మనలో కొంతమంది భోజనసమయమందు తమ మొదటికబళమునకు ముందు ఒక ముద్ద యన్నమును భగవతార్పితముగ పక్షులు వగైరాలు స్వీకరించుటకు విడిచిపెట్టెదరు. ఇంకను కొంతమంది ప్రజలు నిరుపేదవారైన తోడి మానవుల ఆకలివిషయమై విచారింపజాలకపోయినను పుణ్యముకొఱకని చీమలపుట్టలదగ్గఱ నూకలు వగైరాలు చల్లెదరు. మన దేశములో నున్న దాదాపు ప్రతిగృహములోని గృహిణియును "భిక్షాందేహి" యని తన ఇంటికి వచ్చిన ప్రతి యాచకునకును, వాని మంచిచెడ్డలు, అర్హతానర్హతలు, ఆభిక్షవలన తనకుగాని, ఆయాచకునకుగాని, సంఘమునకుగాని కలిగెడి ప్రయోజనాప్రయోజనములైనను గుర్తించక, భిక్ష యొసగుట పరిపాటియైయున్నది. ఈ మాదిరిగా నిష్ప్రయోజనముగా వెదజల్లబడుచున్న ఈవిని గ్రంథాలయోద్యమము మొదలైన ప్రజోద్ధరణ కార్యముల వైపు మఱల్చుటకు నా దేశీయ సోదరసోదరీమణులకు వినయ పూర్వకముగా విజ్ఞప్తి జేసెదను. అతివిశాలమైన మన

దేశములో, సహజముగా దాన ధర్మనిరతి వ్యా
పించి యున్న మన పుణ్యభూమిలో, దేశప్రజల
కభీష్టకరములైన ఈధర్మచింతనలను ప్రజానాయ
కులు సక్రమమార్గములకు త్రిప్పగలిగెడిచో,
గ్రంథాలయోద్యమాభివృద్ధి కేగాక, అట్టివినూ
రు దేశశ్రేయస్కరమైన పనులకువారు బహు తేలి
కగా దోహదము చేయగలుగుదురు. దేశీయు
లలో ఒక్కొక్కరు తమ ఆదాయములో కనీ
సము పదియవవంతైనను తమ కుటుంబమునకు
గాను చేయబడెడిఖర్చులకుగాక, తమగ్రామలేక
దేశక్షేమకరమైన వ్యయములకు వినియోగ
పఱిచెడిచో, గ్రంథాలయముల బోలెడి సంస్థలు
ధనాభావముచే కృశించిపోవుటగాని, వ్యాప్తి
చెందక పోవుటగాని జరుగదు. ఒక్కొక్కగృహ
ములో కనీసము ఒక శేరుబియ్యము బట్టెడి బుట్ట
యొకటి యుంచబడి, నాసోదరీమణులు తాము
నిత్యము రెండుపూటలును తమ ఇండ్లలో వంట
జేయునప్పు రెండుపిడికెళ్లు బియ్యముదానిలో వేయు
చుండెడిచో, వారికెన్నదగిన కష్టములేకుండగనే
బహు తేలికగా వారములోజులలో ఆబుట్టనిండును.
నూరిండ్లుగల ఒకసామాన్య గ్రామములో వార
మునకునూరు శేర్ల బియ్యము ఆగ్రామ గ్రంథాల
యసహాయార్థము ఈవిధముగ లభించగలిగెడిచో
ఇక నాగ్రంథాలయమున కితరసహాయ మంతగా
యవసరమే యుండకపోవచ్చును. తామురొఖ్ఖము
వెచ్చించికొన నవసరములేకుండగనే తమ పొల
ములలో పండెడి ధాన్యము నీవిధముగా కొంత
సద్వినియోగము జేయుట నాసోదర గ్రామస్థుల
కంతగా కష్టముగా నుండకూడదు. కాని నిష్క
ల్మష హృదయములతో, పేరుప్రతిష్ఠల నంతగా
సరకుగొనక, నిష్కామసేవ జేయగలిగెడి ఉత్సా
హపురుషులు, అకుంఠితకార్యదీక్షాపరులు ప్రతి
గ్రామములో కొంతమందియుండినగాని ఈచిన్ని
కార్యములైనను ఫలోన్ముఖము గానేరవు. అట్టి
స్త్రీపురుషులు వయస్సులో యువకులైనను, వృద్ధు
లైనను, ఉత్సాహములోమాత్రము యువకు
లుగా నున్నవారు, మనగ్రామప్రాంతములలో
తండోపతండములుగా నుండవలెను.

మనదేశీయులలో అపారమైనసిరులతో తుల
తూగెడి రాజులు, జమీందారులు, వర్తకప్రముఖు
లాదిగాగల ధనసంపన్నులకు, అమెరికా కోటీ
శ్వరుడైనట్టియు, అమెరికాదేశమం దంతటను
తనపేరు చిరస్మరణీయముగానుండేటట్లు గ్రంథా
లయములు స్థాపించుటకు దాదాపు రెండువందల
కోట్లరూపాయల విలువగల తన కష్టార్జిత యావ
దాస్తిని వినియోగించినట్టి శ్రీ కార్నేజిమహా
శయుని ఉదాహరణను అనుకరించుటకు సవిన
యముగా ఎత్తిచూపుచున్నాను. ఆ ధర్మనిరతి,
స్వార్థత్యాగము,విశాలహృదయములు లేనినాడు
వీరి భోగభాగ్యములు వీరికిగాని వీరి దేశమునకు
గాని ఆవంతేనియు ప్రయోజనకరమైయుండవు.
పైగా తోడిదేశీయులలో వీరియందు. ఈర్ష్య
వగైరాదిగుణములకు ఆలవాలముగానుండును

విద్యాధికులైన సోదరదేశీయుల కొకమనవి.
వీరిలో చాలమంది కుగ్రామములనుండి పైకి
వచ్చినవారే. మన దేశములోనున్న ఉన్నత పాఠ
శాలలు, కళాశాలలు వగైరా విద్యాసంస్థలలో
పఠించి, పట్టములను పొంది, పలుకుబడి, ధనా
ర్జన గల పదవులలో చాలమంది ఇట్టి వారే
గలరు. ఒకసారి వెనుకకు తమ విద్యార్థిదశ
వైపుకు తిరిగి చూచు కొనవలసినదని వారిని
వినయపురస్సరముగా కోరుచున్నాను. తాము
తమ పాఠశాలలలో గాని, కళాశాలలలోగాని
చెల్లించెడి జీతమునకు దాదాపు పదిరెట్లుధనము
ఆపాఠశాల కళాశాల వల్ల ఒక్కొక్క విద్యార్థి
చదువువిషయములో ఖర్చుపెట్ట బడుచున్నది.
ఈ అధికద్రవ్య మంతయు ఎక్కువగా బీదలైన
గ్రామరైతుల వద్దనుండి వసూలు చేయబడిన

15



సిస్తులు వగైరా వృత్తిభత్యాదాయములో నుండి యేగదా వెచ్చింపబడుచున్నది. అట్టి పరిస్థితులలో, ఎంతమంది విద్యాధికులు తమ స్వగ్రామాభివృద్ధికిగాను తమ చేయూత నిచ్చుచున్నారు? తమ ఆదాయములో, తమ కాలములో, బహు స్వల్పభాగమునైనను వాని యుద్ధరణలో వెచ్చించుచున్నారా? వీరిలో అధిక సంఖ్యాకులు తమ గ్రామములవల్ల తమకు లభించెడి లాభములను విరివిగా పొందుటయే తప్ప, తమగ్రామము, గ్రామస్థులయెడల తమ ధర్మమును పూర్తిగా విడనాడినవారై యున్నారు. మఱికొందఱు తమ విద్యాబుద్ధిబలముచే తమ గ్రామములో చీలికలు కలుగజేసి, సహజముగా శాంతికాములైన తోడి గ్రామీయులలో కక్షలుపెంచి, వారిని రచ్చలకీడ్చి, నాశనము చేసి, దానివలన లాభమును పొంద జూచెదరు. ఇట్టి వారిచర్యలు అమానుషములు, అనిర్వచనీయములు. గ్రామ సర్వతోముఖాభివృద్ధికి దోహద మొసగెడి గ్రంథాలయములాదిగాగల అనేక గ్రామసంస్థలను, వారి ధనము, పలుకుబడి, ప్రబోధనాశక్తి, సామర్థ్యములచే నెలకొల్పి, వానిద్వారా తమ గ్రామములలో నున్న అజ్ఞానము, నిరుత్సాహము, నిర్వ్యాపారము అసౌఖ్యములను పారద్రోలుటకు ప్రధాన బాధ్యత వహింపవలసినను ఈ పెద్ద మనుష్యులు వృథాగా చేతులు ముడుచుకొని కూర్చుండుట చాల శోచనీయము. పైన వివరింపబడిన లోపములకు గురికాని కొలదిమంది పుణ్యాత్ములైన విద్యాధికులకు నాజోహారులు, కృతజ్ఞతాభివందనములు. గ్రంథాలయములు స్థాపించి, వానిలో పుస్తకములు, వార్తాపత్రికలు దూరశ్రవణయంత్రములు వగైరాలనుంచి, రాత్రి పాఠశాలలు, ఉపన్యాసములు వగైరాలుఏర్పాటు చేసి వాని ద్వారా గ్రామస్థుల సకలావసరములు తీరేటట్లుచూచి ఆవిధముగా గ్రామవాసులలో సంతుష్టి, సౌఖ్యము, జ్ఞానము వ్యాపింపజేసి,వారి మన్ననలకు గురిగాగలందులకు ఈవిద్యాధికులను నేను హృదయపూర్వకముగా కోరుచున్నాను.

నాసోదర సోదరీమణులలో మఱియొక తెగ వారికికూడ నావిజ్ఞప్తిగలదు. వారు గడచిన పదునైదు వత్సరములలో దేశములో వ్యాపించి యున్న బలవత్తరమైనరాజకీయవాతావరణములో పైకితేలినవారు. వారితో నేను రాజకీయములలో ఏకీభవించ జాలకున్నను, తామునమ్మిన సిద్ధాంతములకు వారిలోచాలమంది జూపిన త్యాగము, కష్ట సహిష్ణుత వగైరాలను నేను ప్రశంసించ కుండజాలను. అయితే వారిలో చాలమంది తమ శక్తి, సామర్థ్యములు, తమ ధన, బల పూర్వక త్యాగములు ఒక ప్రత్యేక రాజకీయాందోళనలో మాత్రమేగాక, తమతమ స్వగ్రామముల అభివృద్ధికి అవసరమైన అనేక సంస్థలను నెలకొల్పుట, పోషించుట వగైరా పనులలో వినియోగించిన, ఆపనులు తాము కాంక్షించిన జాతీయతకు ఇంకను ఎక్కువగా తోడ్పడి యుండెడివని నాసమ్మకము. అట్టి చాలప్రయోజనకరమైన సంస్థలలో గ్రంథాలయము మొదటి స్థాన మాక్రమించుకొనునని నేను వేరుగాజెప్ప నవసరము లేదు. గ్రామములలో ఇంటింటికి వార్తా పత్రికలు, గ్రంథములు చేరేటట్లును, అవి విరివిగా వినియోగింప బడేటట్లును చూచెడి దానికన్న, మించినసేవ జాతీయతకు వేఱొండు కలదా? రాజకీయాందోళన ఉద్యమములో పని చేసిన వారిలో చాలమంది ఈ మాదిరి నిర్మాణ కార్యక్రమమునకు విముఖులుగానుండి, తేలికగాచౌకశేరు పడయగలిగెడి ఉపన్యాసములు, వార్తాపత్రికలలో వ్యాసములకే దాస్యులుగా నుండుట కిష్టపడుచున్నారని వ్రాయుటకు చాల చింతిల్లుచున్నాను.

# విశ్వగ్రంథాలయోద్యమము

(విద్వాన్ కల్లూరి వేంకటసుబ్రహ్మణ్యదీక్షితులు)

ప్రజల నొకత్రాటి నడిపించుటకు ముఖ్యసూత్రము కావలెనన్న నది వారిని ప్రేమపాత్రులనుగా నొనర్చునదిగాను, వారిజాతీయజీవనానుకూలభావమును గల్గించు సువిశాలమగు నాదర్శముతో రాణించునదిగాను నుండవలెను. ప్రభుదండనమునకేని యీ నీతిబలవర్ధకము. విజ్ఞానసూత్రగ్రథితమగు శాసనము విప్లవనిరోధకమగుటచే నత్యుత్తమమును, శాశ్వతమునగును. ఒక జపమాలికలో గ్రుచ్చబడిన యొకటవ పూసకును నూటయొకటవ పూసకు నెట్లు భేదములేదో, ఒకే విజ్ఞానలక్ష్యమునకు సంబంధించిన వ్యక్తుల పరంపరలో భేదము లేదు. "శునిచైవశ్వపాకేచ పండితాస్సమదర్శనాః" అన్న ప్రాచ్యుల విజ్ఞానసూత్రము వ్యక్తుల నెవరిని భిన్నపఱచునదికాదు. ధనము, భోగము అను సంకుచితవిషయములనే పరమావధిగా బెట్టుకొందుమేని, యెంతనియంతటవానికే ఐహికవిషయోపభోగవాంఛ అధికారవాంఛ మితిమీరి ముప్పుదెచ్చును. ధనభోగాదులు తమంత సంభవింపవలయు. అందులకు మరియనక్కరలేదు. లేకున్న విచారింపనక్కరలేదు. అప్పుడే మనలో విశ్వమానవప్రేమ మూర్తీభవించును.

వ్యక్తి, కులము, జాతి మొదలగు భేదపరిభాషలన్నియు విజ్ఞానలక్ష్యమున లయించిపోవును. ఈ లక్ష్య మీనడుమ కొన్నిశతాబ్దములనుండి చెదరిపోయినది. అజ్ఞానాంధకారము దేశము నావరించినది. స్వపరవిభేద తంత్రము అధికారము వహించినది. కనుకనే మనలో పరాధీనత, సాంఘికవైషమ్యములు, కులకక్షలు మొదలగు విషమభావదుర్వాసనలు గ్రమ్మి, జ్ఞానపరిమళము నణచివేసినవి. ధనభోగాదినీచతమలక్ష్యములకై ప్రాకులాడుచు, జ్ఞానశూన్యులైనపుడు, ఒక్క కంచమున గుడిచి, ఒక్క శయ్య పరుండిన సోదరులలోను వైరాగ్ని ప్రజ్వలించును. విజ్ఞానప్రచారమున గావలసిన యీ సాంఘికపరిష్కారమును సాధనాంతరముల సాధింపజూచుట వ్యర్థము. ప్రాచీన సిద్ధాంతము లన్నంతనే ఘృణీభావము చెందు నూతన వీరావేశపూరితులగు అనాత్మనిష్ఠుల చలచిత్తములకును, నవనాగరికము పిశాచమని భావించి నిలువలేక వెఱ్ఱిపరువులువెట్టు కేవల పండితమ్మన్యులకును బరస్పర మైత్రి చేకూర్పవలెనన్న హృదయపరివర్తనము గలిగింపవలెను. అందులకు విజ్ఞానాభివృద్ధియే మూలము.

ఇప్పుడు మనకు రెండువిధములగు నిక్కట్టులు సంభవించినవి. మనలోమనము కుమ్ములాడుచుండ మతవిజ్ఞానవిషయములపట్ల, కులవైషమ్యులు వాపుపట్ల ప్రభుత్వము పూనుకొనదు. మనలోమనమే సాంఘిక పరిష్కారమున నొక దారికివచ్చుటకు విజ్ఞానము తక్కువ. మనల నందరను బంధించు ప్రాచీనార్య మతాచార సూత్రమును ద్రెంచుకొనుటయా? మానుటయా? అని చర్చించు భారము మన తలనే పడినది.

మహాత్ములు నూరుగురైనను ఈ విజ్ఞాన ప్రచారమున గాక ప్రాచీన మతాచారములకు బరివర్తనము తీసికొని రాజాలరు. తమకు బ్రపంచమున విధానాంతరముల లభియించిన యద్వితీయశక్తిని, పలుకుబడిని వినియోగించి, అధిక సంఖ్యాకుల ప్రాతినిధ్యబలమున, స్వల్ప సంఖ్యాకులగు ప్రాచీనాచారపరులను తమమార్గమునకు ద్రిప్పజూచుచో నది యొకవిధమగు నిర్బంధ శాసన ప్రయోగమువంటిదగును. తత్ఫలము తాత్కాలికమాత్రమయి తుదకు పెడదారుల బట్టింపగలదు. ముక్కు మూలమెఱుఁగని వట్టి యావేశముం బురికొనుట తుదకు నాశనహేతువు. కనుక మనలోమనము మానసిక ప్రవృత్తులను ప్రేమచే నేకీభవించుటకు ప్రబలమగు ఆర్యజాతీయ విజ్ఞానపథమునే ఆశ్రయింపవలెను గ్రామ పునర్నిర్మాణాభిమాను లెల్లరు, పుస్తకపాణియగు నా సరస్వతీదేవియొక్క పరిపూర్ణ స్వరూపమును సాక్షాత్కరింపజేయు విశ్వగ్రంథాలయమును నిర్మించుటకు పాటుపడవగును. విద్యాప్రణాళిక నములు పఱచుటలో విశ్వవిద్యాలయము లెంత యవసరమని లోకము గ్రహించినదో, వికాస విస్తరణోద్యమమున కనువగునట్టి ప్రణాళికను నిర్మించుటకు విశ్వగ్రంథాలయమంత యవసర మనదగును.

అనాదియగు వేదమునుండి శాఖోపశాఖలుగా విస్తరిల్లిన విజ్ఞానగ్రంథసంతతి పోయినదిపోగా, నేటికి మిగిలియున్న దెంత? దానిని సేకరించు కొంటిమా? సేకరించు టెట్లు? అని చర్చించవలెను. అట్టి ప్రయత్నమున కుద్యమించుటకు స్వార్థత్యాగము ఆర్థికసహాయము కావలెను. రాజకీయరంగమున నందుల కవకాశము లభింపవలెను. నా దేశము, నా విజ్ఞానము, కాలచక్రమున, ధరాగర్భమున మన్నగుచున్నదని కన్నీరురాల్చు నచంచల జాతీయ భావ


పూరితుడగు యువకుని వేడిరక్తపుచుక్క దండనశాఖాధికారము పూనవలెను. పాపము ప్రభుత్వమువారు మాత్రము కొంతవఱకు దానిమెదుర్కొన వలసిన రాజకీయ వాతావరణమున నొకవంక ప్రతీకారము చెల్లించుకొనుచు, నొకవంక నార్యవిజ్ఞాన సర్వస్వవిధానములగు లిఖితప్రతులను సేకరించుకొనుచుపోయి రాజధాని ప్రధానస్థానముల దమ హద్దుల నిల్పుకొనుచున్నారు. జీర్ణకుటీరములలో చెదపురుగుల కాహారము గావలసిన గ్రంథము లిప్పుడు దృఢకవాట సంఘటితములగు ప్రభుభవనములలో నున్నవని యానందితము. కాని యేనాటికైనా వాని కాచీకటిప్రవాస శిక్ష ముగియునా? వానిలో దేజరిల్లు విజ్ఞానకాంతులు మనపైన బ్రసరించునా? యని చూడచూడ కండ్లు కాయలు కాయుచున్నవి. విజ్ఞానవాసనలేని పండితపుత్రులాభవనములకు కాపలా కాయుచున్నారు. ఆతాటాకు ప్రతుల కట్టు త్రెళ్ళు విప్పవలసిన ప్రజ్ఞానిధి, వానికి దూరముగ జీర్ణకుటీరమున క్షుద్బాధచే మనస్సు నిట్టూర్పు పుచ్చుచున్నాడు. జ్ఞాన సరస్వతీ సేవాసమాసాదితానందరస లేశమేని వాని నీరసము వాపుకొనుటకు దోడ్పడకపోవుచున్నది. పోయిన దానికి వగచుచుండ, ఉన్నవిఖాడా లబ్ధునిహస్తగతమైన ధనమువలె ననాస్వాద్యమైన కతమున గలుగు నిరాశ సంతాపహేతువగుచున్నది. విశ్వవిద్యాలయములేని యీ గ్రంథముల బ్రచురించుట కార్థికసంపత్తి కొఱవడి యుండుటనో, మరేకారణమోగాని తగినంత శ్రద్ధపూనకున్నవి.

విశ్వవిద్యాలయములు, గ్రంథాలయములు, గ్రంథరచనలు, పత్రికలు, వివిధ భావసంకులములై, వివిధ మార్గముల ఝంఝామారుతములట్లు మన శాశ్వత విజ్ఞాన దీపముల నూగించుచున్నవి. మన దుర్బల చంచలమనోవికారములు స్పష్టముగా నద్దమునందువలె వీనియందు గోచరించుచున్నవి. ఒక దానియందు నిరూఢత, నిస్సంశయత, విశ్వాసము, క్రమము కలుగుటలేదు. మనోనిరోధమునకు ప్రతిబంధమగు హేతువాదము ప్రబలిపోయినది. 'ఏకమేవా ద్వితీయం బ్రహ్మ' అను శ్రుతియొక్క గాంభీర్యమును గుర్తించి, అది లక్ష్యముగా నిలుపుకొని ఏకవిద్యోపాసనము' ఏకగురుసేవ మొదలగు పురుషార్థ సాధనల నలవడిన చిత్తైకాగ్రత దూరమైనది. ప్రాచ్యుల దృష్టిలో ముఖ్యసూత్రముగా దాండవించిన యీ ఏకాగ్రతను మరల సంపాదించుకొని అన్ని విజ్ఞానశాఖలకు నేకాగ్రమగు సమన్వయ మేహద్దులో జరుగునో, అంతవరకు మన ప్రాచీనాధునాతన గ్రంథములను శోధించి, ఒక క్రమమగు చరిత్రను వ్రాసికొనుట మొదటి కర్తవ్యము. ఆ చరిత్రమునుబట్టి ఆర్యవిజ్ఞానమును విశ్వతోముఖముగ బ్రదర్శించు నాయా శాఖల విభాగించి యొక్క ఆదర్శ విశ్వగ్రంథాలయమును నిర్మించుకొనుట రెండవ పని. విజ్ఞాన గ్రంథముల సృష్టిస్థితులను, విషయమునుబట్టి, కాలమునుబట్టి విశ్వతోముఖముగ జూపగల యీ విశ్వగ్రంథాలయమునకును, నేటి విశ్వవిద్యాలయమునకును విడిపోని సంబంధము నేర్పరుచుట తుదికార్యము. ఇట్టి యుద్యమము మూడు ముఖ్యప్రణాళికలక్రింద నడుపబడి భారతీయవిజ్ఞాన జ్యోతిని ప్రపంచవిజ్ఞానసౌధశిరోవీధికి దలమానికముగా నెప్పటియట్లు నిలుపుకొనునని తోచుచున్నది. ఈ కార్యక్రమము సాగించుటకు మన మెచ్చటినుండి బయలుదేరవలెను? మనకు సామగ్రి యేమికలదు? ఏది సంపాదింపవలెను? అన్నది ముఖ్యమగు చర్చాంశము కదా! ఇప్పుడు దేశమున ప్రభుత్వసహాయాపేక్షితముగ నడచుచున్న విద్యాశాఖ, విశ్వవిద్యాలయాదులు నటుండ, ప్రాచ్యవిజ్ఞాన ధనమును గాపాడు మరికొన్ని జాతీయ సంస్థలు ప్రజాసహకార మాత్రమున నిర్వహింపబడునవి కలవు. అందులో గ్రంథాలయములొకటి. వానిస్థితి పరికించినచో, నేవో కొన్నిటికిదప్ప తమశక్తిపై దాము నిలువలేని దెన్నోకలవు ప్రజలలో విద్యావ్యాప్తి లేమియే అందుకు కారణము. మహాపండితుడుగూడ ధనదాసుడై తన భావములను దానాశ్రయించిన మూర్ఖచక్రవర్తి కనుకూలముగా మార్చుకొనునట్లు గ్రంథాలయ లక్ష్మియు సహజ సౌందర్యమును స్వర్ణభూషణములను గప్పిపుచ్చుకొని, పామరజనము నాకర్షింపగల గాజు పూసల నెఱువు దెచ్చికొని కృత్రిమ వేషరచనల చేదన యుసురుల గాపాడుకొను స్థితిలోనున్నది. ప్రజాసామాన్యమే గ్రంథముల విరవిగా గోరిన వానికై ఆదాయమును వ్యయించుచు తన్నిర్వాహకులు మూలఘాత కాకుండ చూచుకొనుచున్నారు. గ్రంథాలయములన్నియు నొక్కవిధమగు గ్రంథములతో నింపబడి, పుస్తక విక్రయస్థానములకు బ్రతిగా నిల్వ, విశ్వవిద్యాలయములును ముద్రాయంత్రమునకెక్కిన గ్రంథమునెల్ల చదువుడని విద్యార్థులకు నిర్బంధముగా నమ్మకమునకు నూపనిదియొక వర్తకవ్యాపారమయినది. విజ్ఞాన లబ్ధి మాత్రము సున్నయైనది. విశ్వవిద్యాలయము లిట్లు మిడిమిడి జ్ఞానముచే కూర్చుచుండ మఖలోబుట్టి పుబ్బలోవాడు గ్రంథాలయములగతి వేర చెప్పవలెనా? భారత భాగవతాదులతో బ్రారంభించిన వాఙ్మయశాఖలో నీనాడు నోట నుచ్చరింపరాని తుచ్ఛమగు గ్రంథములకు దావు లభించుట శోచనీయము. ఇందువలన వాఙ్మయ ప్రపంచమున దొలుత మనము గడించిన యున్నతస్థానమును నేటికి బొందిన యధఃపతనమును నలుగురకు బోధపరచుకొను

చున్నామన్న మాట. ఇట్లత్యున్నతాతినీచతమ వ్యవస్థలనూగులాడు జ్ఞానసరస్వతింజూచి, యీ దౌర్భాగ్యదశకు వాపోయెడి సోదరులు గ్రంథాలయోద్యమ నిర్వాహకులు గావలెను. అపుడే ఈ లజ్జాకరమగు దుఃస్థితి వాయును.

విద్వాంసులగువారికిగూడ ఉపయోగించు గ్రంథములను నిలిపి, వారి సానుభూతి వడయుటకు యత్నించు గ్రంథాలయములు శాశ్వత సంపత్తి నొందగలవు. ఏబుగ్వేదమువంటి యుద్గ్రంథమో సంపాదించి పెట్టుకొన్న గ్రంథాలయములు, వాని యుపయోగమును విద్వాంసుల కందుబాటులో నుంచుటలోగూడ వైశాల్యము చూపుట లేదు. ఇది నిర్వాహకుల దోషమనియనరాదు. అట్టి గ్రంథములు మరల లభియింపవేమోయని వారి భయము. ఆభయమును వాపుటకు దగిన వైశాల్యమును ఇప్పటి గ్రంథాలయ విధానము పరిష్కరింపలేదు. కేంద్రమైన విశ్వగ్రంథాలయ మేర్పడిననే ఇట్టి కొరంత తీరును. ఇప్పటి గ్రంథాలయములవారు వేరువేరుగా అందరును గలిసి విశ్వగ్రంథాలయమున కొక విధాన మేర్పరచుటకు సహాయ పడవలసియున్నారు.

వేదములు మొదలు వాఙ్మయశాఖవరకు, విషయమును బట్టి, కాలమునుబట్టి గ్రంథము లభివృద్ధినొందినవి. అట్టి గ్రంథములును కలవు. మనదేశములో కొన్ని గ్రంథాలయములలో నున్నవియు, జర్మనీ అమెరికా మొదలగు ఖండములలో ఇంతవరకుగలవియుసంపాదించి, వానికి గ్రమముగ వరుససంఖ్య నిర్ణయించుమా నొక్కొక్క శాస్త్రములో నొక్కొక్క క్రమచరిత్రవ్రాయుటయు, నా గ్రంథములతో విశ్వగ్రంథాలయము నేర్పరచుటయు జరుగుచో, నా గ్రంథాలయమే విద్యావాంఛగల ప్రతిమానవునకును విజ్ఞానముయొక్క క్రమరూపమును అద్దమున గట్టినట్లు చూపగలదు. అపుడు నూతనవిషయ పరిశోధనములు జరిగి క్రొత్తగ్రంథములు పుట్టును. చర్వితచర్వణముగా చేతి కబ్బిన చిల్లరగ్రంథముల వెదకి నాలుమాటలు వ్రాసి గ్రంథము నచ్చొత్తించి విద్యార్థుల కండ్లగప్పు ఈ కృత్రిమ విద్యాప్రచార మప్పు డంతరించును. ఏ గ్రంథము క్రొత్తగా వ్రాయబడినను, దానిని బరిశోధించి, విషయప్రాధాన్యమునుబట్టి విశ్వగ్రంథాలయమిచ్చు స్థానమును గమనించి, దానిని విశ్వవిద్యాలయము పాఠ్యగ్రంథముగా నిర్ణయింప గలుగును. అప్పుడు వ్యక్తుల యభిమానములకు దావు గలుగదు. విద్యార్థులకు ప్రాచీనాధునాతన సిద్ధాంతరహస్యములు, విశేషములు చక్కగా బోధపడును. విశ్వవిద్యాలయములనుండి కృతార్థులయ్యును, విద్యార్థులు విశ్వగ్రంథాలయముయొక్క పరమప్రయోజనమును స్వయం వ్యక్తిత్వమున బడయుగోరుదురు ఇట్టి మహాసంస్థకు ధనము ఏకీభావము ముఖ్యము. యువకులగు జాతీయాభిమానులు కార్యరంగమునకు దిగవలెను. నేడు దేశమున నామమాత్రావశిష్టములై, కొనయూపిరితో నున్న విజ్ఞానవృద్ధికై పాటుపడు సంస్థలు గ్రంథాలయములు, విజ్ఞానచంద్రికా గ్రంథమండలులు, గ్రంథమాలలు, సమితులు, సంఘములు, పరిషత్తులు, విద్యాపీఠములు, గురుకులములు, మఠములు, మొదలగున వెన్నో గలవు. ధనలోపము చే కార్యములు నడువకున్నను, వీనికి జాలవరకు దేశీయులలో పలుకుబడి గలదు. చాల విజ్ఞానసేవ చేసినవి. ఇవన్నియు గలిసి తమ పలుకుబడిని వినియోగించి, వాక్సహాయము చేయుటకు దారిచూపుచో అన్నిటికిని బరమప్రాప్యమైన విజ్ఞానసేవకు ఫలితముగా విశ్వగ్రంథాలయమును సులభముగా నిలుపగలము. కేవలవాచారంభణముగాక క్రియచేసి చూపగలమని యువకులు చాటగలరు.



# పశ్చిమగోదావరిజిల్లా గ్రంథాలయ సేవకులు*

గ్రంథాలయసేవయందు పశ్చిమగోదావరిమండలము పెక్కువత్సరములనుండి ప్రధానస్థానమును వహించినది. దేశభాషాపత్రికలు అసలే లేక, ఆంగ్లేయపత్రికలు గూడ బహుస్వల్పముగనున్న ఏబదిసంవత్సరములకు పూర్వకాలముననే ఈజిల్లా భీమవరం తాలూకాయందు దేశసౌభాగ్యమునకు సేవజేయ ప్రారంభించిన మహనీయులు వెలసియుండుట భాగ్యము. అట్టివారిలో శ్రీ కాళ్ళకూరి నరసింహంగారు ప్రముఖులు. వారికి కుడిభుజమై, తోడునీడయై ప్రవర్తించి, నేటికిని తన నిరుపమానమైన సేవావ్రతదీక్షతో - పడుచుకుర్రవానికంటె ఎక్కువ దార్ఢ్యవంతుడై -, వృద్ధభీష్మాచార్యునివలె తన తేజస్సుతో మెరసిపోవుచున్న ఆ భూపతిరాజు తిరుపతిరాజు తాతను మనమధ్యను జూడగలుగుట నిజముగా మన భాగ్యమేను. వీరిద్దరును ఇంగ్లీషుభాషయొక్క వాసన ఏ మాత్రమును లేనివారు. అయినను దాదాభాయి నౌరోజీ, హ్యూము, వెడ్డర్ బరన్, రానడే, దత్తు, వీరేశలింగం మున్నగు భారతజాతీయతా నిర్మాతలలో వీరిద్దరును లెక్కింపదగినవారు; దేశసౌభాగ్యము మీదనే తమ దృష్టిని నిల్పి, సేవావ్రతము నూతగాగొని తమ జీవితములను దేశకళ్యాణమునకై ధారవోసిన మహనీయులు. ఆంగ్లేయభాషయొక్క వాసన ఏమాత్రమును లేని వీరికి దేశసేవానిరతి ఎట్లు కలిగినది? దానికి కావలసిన సామర్థ్యము ఎట్లు అలవడినది? వీరిని కదలించిన మహాశక్తులేవి? శ్రీ కాళ్ళకూరి నరసింహముగారు ఎవరు? ఈ సంవత్సరమునుండి ఆ సంవత్సరమునకు వరవడి వ్రాసినట్లుగా లెక్కలను తయారుచేయునట్టి - లేక పగ్గమును ఒకరైతు పొలమునకు అడ్డముగా బెట్టివరహాయు, ఇంకొకరైతు పొలమునకు నిలువునా బెట్టి మాడవసూలు జేయునట్టి - మామూలు పల్లెటూరి కరణంగాదు. గ్రామకరణముగాకూడ ఈయన అపూర్వమైన ప్రతిభను సంపాదించినారు. జ్ఞానపిపాసగలిగిన నరసింహంగారికి దేశమునకు సంబంధించిన వివిధసమస్యలను అర్థముజేసికొనుటకు గ్రామకరణీకమే పునాదియయ్యెను. కరణముదగ్గఱనుండి బయలుజేరని సమస్యలు కరణముతలచుకొనిన విడిపడని దేశసమస్యలు ఎందైనగలవా? ప్రభుత్వమువారు ఆంధ్రమున ప్రచురించిన చట్టములు, కరపత్రములు, వీరికి మొదటిగురువులు-పిమ్మట తెలిసినవారి నడిగి గ్రహించినశ్రుతపాండిత్యము-దీనితో గ్రంథసమీకరణము-గ్రంథాలయస్థాపనము - వరుసక్రమములయ్యెను. తోడిగ్రామోద్యోగులకు-రైతులకుసంబంధించిన సమస్యలను పరిష్కరింపవలసివచ్చెను. దానితోఅప్పుడు మద్రాసు చట్టనిర్మాణ సభయందు సభ్యులుగానున్న *గంజాం వెంకటరత్నం పంతులుకృత్తివెంటి పేరాజు పంతులుగార్లతో సాహచర్యముప్రబలెను. వారుచట్టనిర్మాణసభలో చేయు పనికంతకును తగిన సంభారమును సంపాదించి యిచ్చుట ప్రారంభమయ్యెను. వారిద్దరును తాము శాసనసభయందు గడించిన ప్రతిభకు శ్రీ నరసింహముగారు పోగుజేసియిచ్చిన అంకెల సహాయమేయని అంగీకరించిన సందర్భము లనేకములుగలవు ఆంధ్రదేశమున చాలకాలమునుండియు గ్రంథాలయములను స్థాపించినవారు-నడపుచున్న వారు చాలమందిగలరు.ఐతే, దానినొక యుద్యమముగా దీసికొని ఊరూర దిరిగి గ్రంథాలయ ప్రచారముచేసినవారిలో మన నాయకు లిద్దరును ప్రథములని జెప్పవచ్చును. వారు స్థాపించిన నౌరోజీ గ్రంథాలయము, హ్యూముక్లబ్బు, వీరేశలింగ గ్రంథాలయములను

* పశ్చిమ గోదావరిజిల్లా గ్రంథాలయ సభయందు అయ్యంకి వేంకటరమణయ్యగారిచే చెప్పబడిన సంగతులు.

మీరిప్పటికిని జూడవచ్చును. వీరిలో శ్రీ నరసింహంగారు దివంగతులైనప్పటికిని తిరుపతి రాజుగారు నేటికిని గ్రంథాలయసేవయం దప్రమత్తులైయున్నారు.

వీరికి బిమ్మట గ్రంథాలయసేవలో నీజిల్లాయందు బేర్కొనదగినవారు నిడమర్తి లక్ష్మీనారాయణగారు. వీరియొక్క సేవకు సాక్షి వీరు తమ స్వగ్రామమందు కట్టించిన బ్రహ్మాండమైన గ్రంథాలయమే. ఈ జిల్లా గ్రంథాలయోద్యమ వ్యాప్తికి వీరు చాల పనిజేసిరి. మరియు ఆత్మకూరి గోవిందాచార్యులుగారు, పాలకోడేటి వెంకట్రామశర్మగారు ఈ జిల్లాయందు గ్రంథాలయోద్యమ వ్యాప్తికై విశేషముగా పాటుబడిరి.

ఏ యుద్యమమైనను అందులో ముఖ్యముగా గ్రంథాలయోద్యమము ఒక రిద్దరిసేనతో జరుగు కార్యముగాదు. వీరుగాక ఇంకను పెక్కండ్రు సేవావ్రతపరాయణులగు యువకుల కార్యదీక్ష వలననే ఈ యుద్యమ మింత సత్వరాభివృద్ధినందుటకు వీలయ్యెను.

### తాలూకా సంఘము

ఇప్పుడు ఈ జిల్లాయందు భీమవరం, ఏలూరు, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం తాలూకాలకు గ్రంథాలయ సంఘము లేర్పడినవి. కాని భీమవరం, తాడేపల్లిగూడెంతాలూకా సంఘములు మాత్రమే సక్రమాభివృద్ధి గాంచుచున్నవి. ఈ రెండు తాలూకాలయందును సంతృప్తికరమైన అభివృద్ధులే గాన్పించుచున్నవి.

ఈ రెండుతాలూకాల కార్యదర్శులు డాక్టరు పాలకోడేటి సత్యనారాయణశర్మగారు, డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగార్లయొక్క నిరంతర పరిశ్రమ వలననే ఇట్టి సత్ఫలితములు గలుగుటకు సావకాశమయ్యెను. వారుఇద్దరును డాక్టరులు అయియుండియు, ఎక్కువ తీరుబడి లేకపోయినప్పటికిని తాము ఏమాత్రము తీరుబడి గలిగినను, ఒకప్పుడు తీరుబడిలేక పోయినను బలవంతముగా తీరుబడిగలుగజేసికొనియు, ఈయుద్యమవ్యాప్తికై తమయావచ్ఛక్తిని వినియోగించుచున్నారు.

మరియు వేగేశిన సూరపరాజుగారు, కొత్తపల్లి నారాయణరాజుగారు, కొండేపూడి చలపతిరావుగారు, కలిదిండి సూర్యనారాయణగారు, వద్దిపర్తి రాజారావుగారు, నంబూరి సుబ్బరాజుగారు భీమవరం తాలూకాలోను, దద్దనాల లక్ష్మి సత్యనారాయణరాజుగారు, తల్లాప్రగడ భీమేశ్వరరావుగారు, పుట్టా సుబ్బారావుగారు, పెనుమెత్స సూర్యనారాయణరావుగారు, నిడమర్తి అశ్వనీకుమారదత్తుగారు, పెమ్మరాజు వీర్రాజుగారు, ఉదయగిరి శేషగిరిరావుగారు, తోట సూరియ్యగారు, కలిదిండి చినగంగరాజుగారు, అడివికొలను సూరయ్యగారు, కామిశెట్టి వెంకట నరసయ్యగారు, చింతలపాటి సూరపరాజుగారు తాడేపల్లిగూడెం తాలూకాలోను, ఆ యా తాలూకాల గ్రంథాలయోద్యమాభివృద్ధికై విశేషముగ పాటుపడుచున్నారు.

మరియు నర్సాపురం తాలూకాయందు రుద్రరాజు నరసింహరాజుగారును, తణుకు తాలూకాయందు పోతాప్రగడ నరసింహంగారు, ఏలూరు తాలూకాయందు మాగంటి బాపినీడు సామవేదం సత్యనారాయణ గార్లును, కొవ్వూరు తాలూకాయందు యేలూరిపాటి రామభద్రచయనులు తాడిమేటి కుటుంబశాస్త్రి శనివారపు సుబ్బారావుగార్లును గ్రంథాలయోద్యమాభివృద్ధికై ఆయాతాలూకాలయందు కొన్నిప్రయత్నములను జేసియుండిరి.

ఈ సందర్భమున ఏలూరు హిందూయువజన సంఘము యొక్క ట్రస్టుబోర్డుకార్యదర్శి మద్దుల వేంకట చినరాజుగారి యొక్క పట్టుదలను ప్రశంసింపకుండ ఉండజాలను. వీరియొక్క కార్య

దీక్షవలన ఆగ్రంథాలయమునకు విశేషమొత్తము శాశ్వతనిధిగా వసూలుఅయినది; ఏలూరుపురమునకు ఎవరైన భాగ్యవంతుడు వచ్చుట తరవాయిగా చినరాజుగారు అక్కడ వ్రాలినారే! గ్రంథాలయమునకో, అన్నదాన సమాజమునకో, గోసంరక్షణసంఘమునకో, లేక మూడింటికో- విరాళమును దీసికొన్నారేను.

## జిల్లాబోర్డువారు చేసినపని.

మరియు కలిదిండి గంగరాజుగారు తమ తాలూకాబోర్డు అధ్యక్షపదవియందు తాడేపల్లిగూడెం గ్రామమందొక చక్కని గ్రంథాలయమును నిర్మించినారు. తణుకు తాలూకాబోర్డు అధ్యక్షులు ముళ్లపూడి తిమ్మరాజుగారు బోర్డు గ్రంథాలయమును ఏర్పాటుజేసి మంచి గ్రంథములు పెక్కింటిని జేర్చిరి. శ్రీ బడేటి వెంకటామయ్యగారు జిల్లాబోర్డు అధ్యక్షులుగానుండి కొవ్వూరు, భీమవరంలయందు గ్రంథాలయములను నెలకొల్పుటయేగాక, మాధవరం, చేబ్రోలు, కైకరం గ్రామములయందు గ్రంథాలయముల నిర్మాణమునకు దోడ్పడి వాటిని బోర్డు పరిపాలనలోకి దీసికొనిరి.

## జరుగవలసిన పని.

ఈ జిల్లాయందు ఇదివరకు జరగిన సేవతో సంతుష్టిపడిన లాభములేదు. జరుగవలసిన కార్యక్రమము అనంతముగా నున్నది. ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమువారు మీ జిల్లాయందు తమ కార్యక్రమమును కేంద్రీకరించి ఆదర్శములుగా చెప్పుచున్న కార్యములను అనుభవములందుచేసి చూపవలెనని సంకల్పించుచున్నారు. భీమవరము, తాడేపల్లిగూడెం తాలూకాలలో ఉన్న గ్రామములలో సగముకంటె ఎక్కువ గ్రామములలో గ్రంథాలయము లున్నవి. వానినన్నిటిని జూచి పనిజేయుచున్నవానికిని పనిజేయనివానికిని ఉత్సాహము గల్పించుటకును గ్రంథాలయ యాత్రలను ఏర్పాటు చేసితిమి. ఈ క్రిందివిషయములయందు ఈ రెండు తాలూకాలలో కొంత పనిజేయుటకై బూనుకొంటిమి.

1 గ్రంథములను చదువు అభిలాష నెక్కువజేయుట.

2 గ్రంథముల సంయుక్త పట్టికను తయారుజేసి అన్ని గ్రంథాలయములయందుంచుట.

3 గ్రంథములను పరస్పరము ఎరువిచ్చుట.

4 బాలశాఖలను నిర్వహించుట.

5 చదువుకొనజాలని జనులకు చదివి వి[illegible]పించుట.

6 గ్రంథాలయములులేని గ్రామములకు సంచార గ్రంథాలయపేటికలద్వారా గ్రంథములనందజేయుట.

సేవావ్రతులగు గ్రంథాలయ సోదరుల సహాయమువలనను, ఈ జిల్లాకు ప్రభువర్యులుగ దయచేసిన శ్రీ దండు నారాయణరాజుగారి అమృతహస్తమువలనను ఈ జిల్లాయందు గ్రంథాలయసేవ ఆంధ్రదేశమునకే గాక భారతవర్షమునంతకును మార్గదర్శకమై వెలయుగాక.

| తాలూకా | గ్రంథాలయములు | అందులో బాగా పని చేయునవి |
|---|---|---|
| భీమవరంతాలూకా | 56 | 32 |
| తాడేపల్లిగూడెం | 56 | 30 |
| నర్సాపురంతాలూకా | 25 | 15 |
| తణుకుతాలూకా | 25 | 15 |
| కొవ్వూరుతాలూకా | 7 | 5 |
| చింతలపూడి తాలూకా | 2 | 2 |
| ఏలూరుతాలూకా | 25 | 15 |
| | 194 | 114 |

# స్వర్గీయ నిడమర్తి లక్ష్మీనారాయణపంతులు

(అశ్వనీకుమారదత్తు)

కాలమహాసంద్రంలోని విస్మృతి సుడిగుండాలలో బడి, అడుగంటిపోక, చిరసంస్మరణీయమైనది శ్రీలక్ష్మీనారాయణపంతులుగారి ధన్యజీవితము.

మకరంద సౌరభోపేతమైన అరవింద పూజాసుమమీ మహనీయుని జీవనసుమము. మహదాశయాశ్రితము, గురుగుణోపేతము, నిష్కళంక జీవనపూర్ణము, సరళస్వభావరంజితము, నిస్తులసాహసోత్సాహోద్రేక పూరితము, కపటనటనా విముఖత్వము, నిరంతర పవిత్ర నిరాడంబర సేవాప్రఫుల్లమునగు ఈ యుత్తమోత్తమ జీవితమునకు జేజేలువెట్ట నళికుమారులు కడు సంబరముతో స్వాభావికముగనే వాంఛింతురు.

మానవునిలోని 'అహం' ఈ విపుల విశ్వాన్నంతటిని విశాలదృష్టితో చూడనీయక, సంకుచితంజేసి, రెక్కలు విరిచిన పక్షివలె, కూపస్థమండూకమురీతి స్వగృహం భార్యబిడ్డలకు, పాలంపుటర్రకు, బంధించేస్తుంది. ఈ ప్రాపంచిక అహమికరజ్జువులను త్రెంపుకొని, స్వపరభేదం జూపక తమచిన్నచేతులలో మానవసముదాయాన్నంత జాతిమత వివక్షత పాటింపక కౌగిలిలో ఉక్కిరిబిక్కిరి చేయగలవాడే ఉత్తమోత్తముడు.వీరమూర్ధన్యుడు.

ఏ మహారాణుల వేణులయందు తులుకకపోయినను, ఏ మహాదేవుని మూర్ధమున నిలచి మహార్ధత్యమును వెడల గ్రక్కకున్నను, దిగంత యశోవిరాజితులు గాకున్నను, అడవి పుష్పములవలెనే తమయపూర్వ విముగ్ధరాగరంజతమే అమూల్యజీవనస్రవంతి నవకము చెడి వసివాడుచుండగ స్రుక్కిపోతుంటారు. కారణం సర్వజనవేద్యమే. పరిస్థితుల ప్రాబల్యాభావము-మూర్ఖమానవుల అసహనమూను.

ఎంత అణచివేయబడినను సత్యము ఒకనాటికి చేబట్టి మధురస్వరవల్లకిని మ్రోయగలదు.

శ్రీ పంతులవారి జీవనపథములోని కాలిగుర్తులనిండ జాతిరత్నములే కాన్పిస్తవి. అందు తర, తమ విచక్షణకు తావేలేదు, యథాశక్తినచ్చటచ్చట నొక వజ్రమును పరీక్షకుల ముందిడి కృతకృత్యుడ నయ్యెదను.

జీవితప్రమాణము బహుస్వల్పము. చిన్నిదేవీనికుంజమున జననమంది చిందులాడుచు పర్వత శిఖరసానువుల నిండి తరలివచ్చి బహువిధభూముల సారవంతమొనర్చి, మహావాహినియైపరమావధియగు సాగరుని జేరబోవునప్పటి పరిపక్వదశకాదు. వాంఛాప్రాబల్య మమితముగానున్న తరుణమున ప్రాణభర్త ప్రాణహర్తయైనాడు.

ఇంకా జీవించియుంటేనో – అని అంచనావేయడమవివేకమేమో? కాని పద్ధతిని దేశానికి పలువురు కీర్తిశేషులయావశ్యకతయున్నది.

నాముందు పంతులువారి దినచర్య పుస్తకము లేండ్లవారీగాయున్నవి. జీవితచరిత్రలేఖనముల కివియే ఆధారభూతములైనవి. జిల్లాప్రజలు, స్నేహితులు, ముఖ్యులు, చెప్పెడి యమూల్యవిషయములుకూడ విషయసంగ్రహణమున కమితముగా నుపకరించినవి. కేవల తేదీలకే ప్రాముఖ్యమొసగి కథాసంగ్రహమును కటువుగా నొనరుచు నుద్దేశ్యము లేదు.శుష్కవస్తు ప్రాధాన్యమునులేదు.అచ్చటచ్చట నీపుస్తకములనుండి కొన్ని సంఘటనములనుకూడ నుదాహరింతును. ఇందు భూతకల్పనలకు తావేలేదను సంగతి చదువరులు మనమునం దుంచుకొందురుగాక.

గ్రామపెత్తనదార్లు, యిజారాదార్లు సంపన్నులునగు పుమ్మయ్యాగారు జనకుడు. ధాతకరువు సమయమున ఆకొన్నవారిని, పేదవారిని, పరాయివారిని, ఆత్మీయులనుకూడ కడుపునందిడుకొని యాదరించిన మహాలక్ష్మమ్మగారు జనని. ఆఅమృతహస్త ఆదరభాగ్యమునందిన షాహుకారీ కథనమును చెప్పినాడు ఉమ్మయ్యాగారు ధాతకరువు ముందు భూములు తెగపండటంచేత చాల సంతోషంగా వున్న సమయంలో నాల్గువందలధాన్యపుబస్తాలున్న గాదిని నీయిష్టంవచ్చినట్లు చేసికొమ్మన్నారు. ఆమె నగలునాణ్యములు, చేయించుకోక డొక్కా సీతమ్మగారికి మల్లే సమయాసమయములు చూడక యెడతెరిపిలేని సంతతాన్నదానమును జరిపినది. ఒకరోజున రెడ్డి సీమనుంచి రేగుపళ్ళకావిటిమనిషివచ్చి మహాలక్ష్మమ్మగారింకా బ్రతికేవుందనుకొని మామూలు చనువుతోటి అన్నంపెట్టమ్మా మహాలచ్చుమ్మతల్లీ! అని అరిచాడట. అప్పుడు పంతులుగారు, అన్నగారు, తమ్ముడు చిన్నపిల్లలు అచ్చటున్నకాపాకడు ఆవిడ చనిపోయిందని చెప్పారట. జననిస్వర్గస్థురాలైనట్లు గుండెలు బాదుకుంటూ 'ఇంకా ఈవూరుయేముఖంపెట్టుకునిరాను'అంటూ గుణవిశేషాలు తలపోసుకుంటూ గుడిదిబ్బవద్ద కూర్చొని శోకన్నాలు ప్రారంభించాడట. ఇంతట్లోనే శ్రీ పంతులుగారువెళ్ళి వోదార్చి భోజనం పెట్టిసాగనంపారు. మరలఆగ్రామంతొక్కి చూడలేదుబుణంతీరిపోయిందనుకొని.

పంతులవారి సమకాలికులు, సహచరులు తోడిసైనికులు శ్రీ కాళ్లకూరి నరశింహ్వాం పంతులుగారు, ఉండి గ్రామమందు శాశ్వత ధర్మసత్రపు నిర్మాణకర్తలైన నడుంపల్లి సుబ్బారాయుడుగారు, భూపతిరాజు తిరుపతిరాజుగారు (కుముదవల్లి), నేడు గణనకెక్కిన వారిలో మోచర్ల రామచంద్రరావు, కొండా వెంకటప్పయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, శ్రీ మీర్జాపురం జమీందారు, పెద్దిరాజు, బాపిరాజు ప్రభృతులు.

## గ్రంథాలయ సేవ.

పశ్చిమగోదావరిజిల్లాలో గ్రంథాలయోద్యమ ప్రచారకులలో, మార్గదర్శకులు, ప్రప్రథములు (pioneers) శ్రీ పంతులువారు కాళ్లకూరి నరశింహ్వాంగార్లు. ఆయన చిన్నతనమునుండియు నైతిక, సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, లౌకిక, పారలౌకిక, విషయములందుఅత్యున్నతాభిప్రాయములను గలిగియుండి దైవోద్దిష్టమైన పరివర్తనమునను తీవ్ర కృషిసల్పి ఉన్నతశ్రేణిలోని సంస్కరణాభిలాషులైరి. దినచర్యనుండి కొంతభాగము నిచ్చట నుదాహరింతును.

10-4-1914 ఈరోజువుదయము బెజవాడలో రైలు దిగి కాన్ఫరెన్సు పెండాల్‌కు వెళ్లి కృత్యములు దీర్చుకొని స్నానంచేశి పుస్తకభాండాగారసభకువెళ్లి, 11 గంటల వరకువుండి అక్కడనుండి తిరిగి ఆంధ్రమహాసభ పాకలలోకివెళ్లి యల్లంరాజు శాస్త్రిల్లుగారింటిలో భోజనంచేసి తిరిగి పెండాల్‌కు రావడమైనది. మధ్యాహ్నంనుంచి పుస్తకభాండాగారవిషయనిర్ణయసభ అయిన తరువాత కొన్ని తీర్మానములు చేయబడినవి.

11-4-14 ఈరోజు వుదయాత్పూర్వం లేచి కృష్ణానదికివెళ్లి స్నానంచేసికొని బ్యాండువగైరా వుత్సవముతోనున్నూ దేశీయకీర్తనలతోను అగ్రాసనాధిపతిగారింటికి వెళ్లి వారిని సభకు తీసికొనిరావడమైనది...విషయ విచారసభ 1 గంటకు కూడి విషయనిర్ణయ చర్యలో రాష్ట్రసభ విషయిక తీర్మానములనుగురించి చాలా చర్చజరిగి...... 5 గంటలకు కొన్ని తీర్మానములుచేశిమర్తబు చేయడమైనది. మరుసటిదినమునకూడ చర్చలందు పాల్గొని సాయంకాలమునకు స్వగ్రామమునకు తిరిగివచ్చిరి.

2-4-14 వీరు నిడమర్రు గ్రామమునం దొక గొప్ప తటాకమును త్రవ్వించిరి. దానికొరకై కాళ్లకూరి నరశింహ్వాంగారు వగైరాలు నిండ్రకోలను మొదలైన పరిసర గ్రామములకు వెడలి సభికుల ప్రోగుచేశి చందాలు వసూలుచేసిరి. బెజవాడలో జరిగిన ఆంధ్రకాన్ఫరెన్సుకు డెలిగేటుగావెళ్ళి అందు ముఖ్యస్థానము నలంకరించిరి.

21-3-1914 రాజమండ్రియందు చిత్రపు వెంకటచలం పంతులుగారి యధ్యక్షతను జరిగిన హిందూమహాజనసభకు హాజరై అందు కొన్ని ముఖ్య తీర్మానముల నుపపాదించడమైనది.

1915, 16, 17, 18 సంవత్సరముల దినచర్య పుస్తకములు లభ్యము కానందున ఒకసారి నాలుగేండ్ల మహత్తర చైతన్యోద్దీపకమైన జీవితభాగమునువదలి 19 సం॥కు గంతు వేయవలసివచ్చినది. స్వగ్రామమగు నిడమర్రునందు సరస్వతీభవనం, సత్రం కట్టవలెనని సంకల్పం కలిగినది. దానికి ప్రయత్నము లారంభమైనవి. ఆయన మాటలనే వుదాహరించిన స్వారస్యం కనుపడుతుంది.

27 12 1919 ఈరోజున మధ్యాహ్నముకు గంగాచలం (భవనములను కట్టిన వడ్రంమేస్త్రీ) ను అడవికొలను తీసికొనివెళ్ళి కామరాజుగారి యింటి కల్పను చూపించినాను. బాగానే యున్నదనియును యీకల్ప సత్రం, గ్రంథాలయ భవనము రెండు కట్టుటకు సరిపోవుననియును చెప్పినాడు. అతనిని వద్దనుంచుకొని చి॥ మంగయ్య వగయిరాలతో మాట్లాడి రేపటిరోజున పునాదులు యేర్పరచుటకు స్థిరపరచి యీరాత్రి కుముదవల్లి వెళ్లడమైనది.

28-12-1919 కుముదవల్లి – ఈరోజు వుదయముకు కుముదవల్లివచ్చి 9 గంటలకు నగరసంకీర్తనము చేసి మందిరమందు ప్రవేశించిన వెంటనే స్వర్గస్థులైన కందుకూరి వీరేశలింగంపంతులు వారి ఛాయాపటమును శ్రీయుత చిలకమర్తి లక్ష్మీనరశింహంగారి యధ్యక్షతను సభచేసి వారిచే తెరపించడమైనది. ఈ సందర్భమున వీరేశలింగంపంతులుగారి జీవితమునుగూర్చి నేను మాట్లాడడమైనది.

29-12-19 ఈరోజున వుదయమే కుముదవల్లినుండి భమిడిపాటి సూర్యనారాయణగారి కోరికమీద గునుపూడిలోయున్న గాంధి గ్రంథాలయమును సందర్శించి మధ్యాహ్నం 3 గంటలకు సభ జరుపుటకై భీమవరం రావడమైనది. సాయంత్రం 3 గంటలకు బ్రహ్మశ్రీ తెన్నేటి లక్ష్మీనారాయణశాస్త్రిగారి యాధిపత్యమున గాంధిగ్రంథాలయమున సభజరుపబడి గ్రంథాలయావశ్యకతనుగూర్చియు ప్రజలకర్తవ్యమునుగురించియు నన్నుపన్యసింపవలసినదని కోరగా ఉపన్యసించడమైనది.

ఈ సందర్భంలో అయన ఉపన్యాసధోరణినిగూర్చి ముచ్చటించుటవసరముకాకపోదు. అతడుగొప్పవక్త. స్వర్గంగవలెచిందులుత్రొక్కుచు మైమరపించే వాక్ప్రవాహము ప్రేక్షకుల నెట్టిస్థితికిగొనిపోయెడిదో అనుభవైకవేద్యము, వీరిమానసికతత్వమును తెల్పుటకీయొక్క విషయమే స్థాలీపులాకన్యాయముగ బరగగలదు.

30-12-19 భీమవరం ఈరోజున వుదయముననే శ్రీ డిప్టీకలెక్టరు జయంతి రామమూర్తిపంతులుగారి దరిశనం చేయడమైనది. వారు చదివిన ఉత్కృష్టజ్ఞానోపదేశము చేసే సంస్కృత శ్లోకములు వినినప్పటినుండియు వారి విజ్ఞానమును, విశాలస్వభావమును, దేశరక్షణతత్పరత్వమును వెల్లడించుచు కొనియాడతగియున్నవి.

వీరు తాలూకా, జిల్లాబోర్డుల సభ్యులుగాను తాత్కాలికాధ్యక్షులుగాను యెన్నుకొనబడడం మాకొల్లేటూళ్ళకు వరప్రసాదం. అన్ని విషయములలోను వెనుకబడి కొల్లేటిగొడ్లనిపించుకొన్న మాచుట్టుపక్కల గ్రామములన్నియు నేడు వీరు ప్రసాదించిన తటాకములు, బడిభవనములు, కాలువవంతెనలు, రోడ్లతోడను కలకలలాడుచున్నవి. మరియొక సంవత్సరము ముందుకు సాగిపోదము.

14-2-1920 ఈరాత్రి ఆకువీడు గ్రంథాలయపునస్థాపన చేయించుటకు వెళ్లడమయినది. 15 నున అక్కడ శ్రీ లక్ష్మణస్వామిగారితోను నందుల సుబ్బరాయశర్మగారితోను మాట్లాడి వాగ్దానముపొంది భీమవరమునకు వెళ్లియుంటిని.

15-2-1920 భీమవరంలో నన్నయ భట్టారక గ్రంథాలయ సంవత్సరోత్సవమునకు వెళ్లి అచ్చటినుండి సూరి వెంకట నరిశింహ్వాశాస్త్రిగారు, అయ్యంకి వెంకటరమణయ్యగారు, మంగిపూడి పురుషోత్తమశర్మగారు, కేశవాచారిగారు, భమిడిపాటి సూర్యనారాయణగారు నేను కలిశి కుముదవల్లివెళ్ళి అక్కడ గ్రంథాలయముచూచి శ్రీ తిరుపతిరాజుగారినికూడా వెంటబెట్టుకొని 4 గంటలకు ఆకువీడు వెళ్లడమైనది. సాయంత్రం 6 గంటలకు వెంకటరమణయ్యగారి అధిపత్యముక్రింద సభచేసి నేను గ్రంథాలయములనుగూర్చి మాట్లాడి గ్రంథాలయ పునరుద్ధారణ చేయించడమైనది. రాత్రి 11 గంటలకు చెరుకువాడ వచ్చి 12 గం॥లకు ఉండివచ్చి నడుంపల్లి వెంకటసుబ్బారాయుడుగారింటిలో పరుండడమైనది.

19-12-1920 ఉండి ఈరోజున వుండిలోవుండి సాయంత్రం 5 గంటలకు స్కూలులో వెంకటరమణయ్యగారి అధిపత్యముక్రింద సభచేసిన నారోజి గ్రంథాలయపునరుద్ధారణావశ్యకతనుగురించియు, గ్రంథాలయలాభములనుగురించియు నేను మాట్లాడి దేవాలయముముందువున్న పెంకుటిచావడిలో పునరుద్ధారణచేయించి రాత్రి బయిల్దేరి తెల్లవారుసరికి గణపవరం రావడమైనది.

22-2-1920 మంచిలి. కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీల కృష్ణామండల మహాజనసభ ప్రారంభమై శ్రీరామచంద్రరావుపంతులుగారియధ్యక్షతనుజరిగినది. వీరిర్వురకును బంధుత్వముండుటయేకాక పరస్పరగౌరవాన్వితులై యుండుటచే నీడనిప్రేమపాశములతో బంధింపబడియుండిరి. రామచంద్రరావుగారికీ ప్రాంతముల కుడిచేయిగానుండి చాల వీరుసహాయమొనర్చియుండిరి. పంతులుగారు వ్రాసిన చాల యుత్తరములింకను రామచంద్రరావుగారు జాగ్రత్త చేసియున్నారని వినికిడి.

16-3-1920 ఆంధ్రనిధికి రు 4/లు, ఆంధ్రజాతీకళాశాలకు రు 4/లు శ్రీ లక్ష్మీనారాయణపోతన గ్రంథాలయమునకు 4/లు మందలపర్రు బంగారయ్యగారి సపిండీకరణసమయమునకు వెళ్లి ధర్మం చేయించియుంటిని.

లక్ష్మీనారాయణగారు ప్రతి సంవత్సరం ఆంధ్రజాతీయకళాశాలకు సంవత్సరాదిచందా లమితముగా కృషిసల్పి వసూలుచేసి స్వయముగా పెద్దవిరాళము లిచ్చియు ప్రోత్సహించియుండిరి.

23-4-1920 ఈ సాయంత్రం గ్రంథాలయములో ఉపన్యసించడమైనది. వీరువా పోతన గ్రంథాలయమునకు నిడమర్రు పాపుడు బండిమీద పంపడమైనది.

10 5-20 శ్రీరామచంద్రరావుగారు గ్రంథాలయభవనమునకు పునాదిరాయి వేయునప్పుడు వుండడమైనది.

11-5-1920 శ్రీరామచంద్రరావు పంతులుగారితో శ్రీవుయ్యూరు యెస్టేటు మేనేజరుగారొసంగిన ఫలహారములుతీసికొని వయ్యేటికివేసినరోడ్డు వారు తెచ్చిన తర్వాత పంతులుగారూ నేనూ నన్నయభట్టారక గ్రంథాలయమును చూచి కలెక్టరుగారింటికి వెళ్ళిచూచి బసచేయడమైనది.

16-5 1920 కోపల్లె - ఈరోజున కోపల్లెలో జరిగిన తాలూకా మహాజనసభకువచ్చి రాత్రివరకు వుండడమైనది. తాలూకా మహాజన గ్రంథాలయసభకు అధ్యక్షునిగాయుండి జరపడమైనది. (వీరి ప్రారంభోపన్యాసాదుల వివరములు లభ్యము కాకపోవుట విచారకరమైన విషయము).

20 5 1920 పత్తేపురం రాజపుత్రసమాజంవారి మీటింగులో సలహాగా జాతీయవిద్య పెంపొందించుట ముఖ్యమనియు రాజపుత్రుల ఐకమత్యము, ధర్మము వగైరాలగూర్చి మాట్లాడడమైనది.

23-5-1920 ఈరోజు మధ్యాహ్నం చానమిల్లి గ్రంథాలయ వార్షికోత్సవమునకు అధ్యక్షునిగా వుండి సభజరిపి రాత్రియింటికి రావడమైనది.

ఒక యేడాదిలో వారిమనసులో చిరకాలము నుండియు పాతుకొని వర్ధిల్లుచున్న మహత్తర సరస్వతీ సత్రి

భవన నిర్మాణేచ్ఛాబీజము కొంచిఫలించినది. వదాన్యులు, వణిక్పుంగవులు రాజమండ్రివాస్తవ్యులు నగు శ్రీయుత నాళం సుబ్రహ్మణ్యంగారి కలప సహాయమున వాంఛా సిద్ధి కల్గినది. వారినామము చిరస్మరణీయమగుగాత!

14-6-1920 ఈరోజున తేలంగిలో భారతీతిలక గ్రంథాలయము తరఫున మీటింగుజరిగి గ్రంథాల యోద్యమమును గురించి నన్నుపన్యసింపుమని కోరగా మాట్లాడడమైనది.

15-6 20 తేలంగి (తణుకుతాలూకా) ఈరోజునభారతీ తిలక గ్రంథాలయంతరఫున హిందూదేశ ప్రాచీనౌన్నత్యమునుగురించి ఉపన్యసించడమైనది.

28-6-1920 ఈరోజున మ॥ రా॥ శ్రీ సుబ్రహ్మణ్యం గారు పునాదిరాయి వేయించుటకు నన్ను తమతరఫున పునాదిరాయి వేయించుడని బ్ర॥ శ్రీ చందూరి సీతారామయ్య గారిచేత ముహూర్తము పెట్టించగా ఈరోజున 10గంటలకు విఘ్నేశ్వరపూజ, తాపీపూజ, శిల్పపూజచేయించి పునాది రాయి వేయడమైనది.

22-7-1920 ఈరోజున నేను, భోగరాజు, మంగయ్య, చినలక్ష్మీనారాయణ నలుగురము బయలుదేరి ఉండివెళ్ళి కోఆపరేటివ్ సొసైటి (నిడమర్రు) రిజిష్ట్రీచేయించి భీమవరం వెళ్ళి శ్రీడిస్ట్రిక్టకలెక్టరుగారింట్లో మకాము చేయడమైనది.

4-8-20 ఉండితాలూకాకు మెంబరు షిప్పుకు దాఖలు చేసితిని (ఎన్నికలలో విజయముపొందిరి). ఈరోజునబాల గంగాధర తిలకుగారు చనిపోయినందున భీమవరంతాలూకా ప్రజలందరి తరఫున సభచేసి సానుభూతి వారి కుమాళ్లకు తెల్పడమైనది.

10-8-20 మోచర్ల రామచంద్రరావుగారితో కలిసి మోటారుమీద పాలమూరు, నవుడూరు, రాయికుదురు మొదలైన గ్రామముల సంచారముచేసి రామచంద్రరావు గారికే తమ ఓట్లు నివ్వవలసినదని సభలలో ప్రబోధించితిని.

27-8-20 శ్రీ డిష్ట్రిక్టకలెక్టరుగారు సత్రం గ్రంథాలయ భవనములజూచి మెచ్చికొనియున్నారు. సరిపల్లిలో సంగీత విద్యాభవనమునకు శ్రీ డిష్ట్రిక్టకలెక్టరుగారు పునాది రాయి వేసిన తరువాత సభజరిపి వుపన్యసించడమైనది.

23 10-20 పంజాబు విషయమైన్ని, విద్యాలాభము లనుగూర్చిన్ని విపులముగా మాట్లాడడమైనది. ఈ రోజున 4 కుంచముల పులిహోరచేయించి గ్రామస్థులకందరికి పంచిపెట్టించడమైనది. ('ఎప్పుడూ ప్రక్కని పదిమంది తింటూంటేనేగాని తిన్నట్టుండదు' అంటూ ఏ సత్యనారాయణ వ్రతమో, సంతర్పణో, సమారాధనో టీపార్టో, కల్పించేవారు పంతులుగారు.)

27 10 1920 తెల్లవారుఝామున నేలేచి ఉండి కోఆపరేటివు యూనియను మహాసభకున్ను, డైరెక్టర్సు మహాజనసభకున్ను వెళ్ళడమైనది. 28 న 3 గంటలకు సభ ప్రారంభమై రాత్రి 8 గంటలవరకు జరిగినది. అనేకవిషయములను పరిస్థితులను గురించి విపులముగా వుపన్యసించితిని.

పశ్చిమగోదావరిజిల్లా, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరంతాలూకాల రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిణామాభివృద్ధులే లక్ష్మీనారాయణగారి జీవితచరిత్ర. అందువలన వారి చరిత్రయే జరిగిన ప్రతిసభకు, పురోగమనమునకు నాందియై మంగళాచరణమునైనది. వ్యక్తిపరమైనకొన్ని విశేషముల నిందు పొందుపర్తును. నిడమర్రుచెరువు నీరు త్రాగితేనే సంగీతం వస్తుందని వాడుక. పందిళ్లస్తంభాలు కూడాపాడ్తాయట. అందులో నిడమర్తివారు సంగీతకళకు నిధులు, ఆమకొన్నవారూనూ. అది వారి కొణాచి. నిడమర్తి లక్ష్మీనారాయణగారు, వారి అన్నగారు రామయ్యగారు సేవామార్గ పద్ధతియందు అందెవేసిన చేతులు. పంతులుగారు తమశ్రేణిలోని భక్తులుగాన ప్రతి ఏకాదశికిని ప్రార్థన సమాజమును వారి మేడయందే అతి వైభవముగా జరిపించెడివారు.

ఆయన సుప్రసిద్ధరైతుసేవకులు, శ్రేయోభిలాషులు, వారిసేవ గ్రామరైతులకేకాక రాష్ట్రరైతుల కష్టవిమోచనకు పరుగులువారినది.

## రైతు సేవ.

17-11-1919 మదరాసు—ఈరోజు మధ్యాహ్నం శ్రీ కొండా వెంకటప్పయ్యగారు, కాశేశ్వరరావుగారు, కొల్లూరి నరసింహంగారు, వేమూరి వెంకటసుబ్బారావుగారు, కృష్ణాజిల్లా రయితుసంఘసభ్యులుకలసి రేపటిరోజున గవర్నరుగారితో చెప్పవలసిన అంశములను స్థిరపర్చి మెమొరాండమును తయారుచేశినాము. గవర్నరుగారికి డెప్యూటేషను వెళ్లే మెంబర్లు 30 మందిని జాబితా యిచ్చినారు. ఈసాయంత్రం శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు అందరకు ఫలహారములు నిచ్చినారు.

18 11-19 మదరాసు — ఈ రోజున 10 గంటలకు ఫోర్టుసెంటుజార్జిలోవున్న లెజిస్లేటివ్ కౌన్సిలుహాలునందు శ్రీ గవర్నరుగారిని సందర్శించి రయితుల కష్టములనుగూర్చి

చెప్పుకొనగా అన్నిటికంటె ముఖ్యముగా పల్లం మెరకలో చేర్చిన-విషయములో ఆలోచించి ఒక సంవత్సరము పల్లం క్రింద సాగయిన భూములను పల్లంక్రిందనే వుంచుటకు ఆర్డరిప్పిస్తామని చెప్పినారు. ఇతరవిషయము లన్నియు ఆలోచించి సాధ్యమైనంతవరకు రయితుల కోరికప్రకారం చేయించెదమని చెప్పినారు. చీఫ్ యింజనీరుగారు రేపు సాయంత్రం 6 గంటలకు రయితుల విజ్ఞాపనలు వింటా మన్నారు.

19-11-1919 ఈరోజున లెజస్లేటివ్ కౌన్సిలుమీటింగు చూచుటకు గవర్నరుగారి ఆర్డరునుపొంది 10 గంటలకు వెళ్ళి చూడడమైనది. ఈ రోజు సాయింత్రం 5½ గంట లకు చీఫ్ ఇంజనీరుగారినిచూచి రయితులకష్టము లన్నియు చెప్పుకొనడమయినది.

వ్యయప్రయాసలకోర్చక రైతులకొరకై యెంత త్యాగ మునకైన వెనుకంజవేయని రైతుసేవాధురంధరు లీపంతులు గారు. వీరి చిన్నవయసుననే జమీందారీగ్రామమైన ఎడ మర్రు తాణీదారు కర్ణములు, రైతులనుపెట్టిన బాధలు సహింపలేక బుద్ధిగలిగి వర్తించుటకుగాను ప్రతిహింసాపరు లైన రైతులు వారిని దేవాదేవేషుచేయగా రైతుల తఅపున బోలెడు సొమ్మును వ్యయమొనర్చి కేసునందు నెగ్గి బ్రహ్మ రథమును పట్టించుకొని ఇరువదెకరముల ఏకఖండభూమిని కొల్లేరునందు బహుమానమును పొందిరి. నేటి కాంగ్రె సధ్యక్షుడు జవాహరిలాలు రైతులతో సంబంధముకల్పించు కొని రైతు జీవితసమస్యల నెదుర్కొని భావిజీవనము నతిసౌందర్యవంతముగాను,విజ్ఞానపూరితముగను చేయుటయే కాంగ్రెసు ప్రచార ప్రణాలికయని నియమించియున్నారు భారతజాతీయోద్ధారణకు, ఔన్నత్యమునకు రైతుయొక్క మూఢత్వమును, నిరక్షరత్వమును ముఖ్యకారణములని ఆనాడే గ్రహించి 'కీలెరిగి వాతపెట్ట' ప్రయత్నించిన రాజ కీయ వైద్యులు వీరనడంలో సందేహంలేదు.

9-11-20 నిడమర్రు (వీ రీవిధముగ స్వగ్రామమున విశ్రాంతిగాయుండుట చాల అరుదు) ఈరోజు బందరు జాతీయ కళాశాలకు పంపించుటకు చందాలు వసూలు చేయడమైనది. సాయింత్రమునకు వసూలు రు 10-0-3లు.

13-11-20 గ్రంథాలయ సర్వస్వముయొక్క వి. పి. చెల్లించుటకు రు 3-0-0 పంపడమైనది వీరు ఆంధ్రదైనిక పత్రిక, కృష్ణా వారపత్రిక, గ్రంథాలయ సర్వస్వము మొదలైన పత్రికలనూ, విజ్ఞాన ప్రచారిణీ, ఆంధ్రప్రచా రిణీ మున్నగుమండలులను తెప్పించి పోషించెడివారు.

14-12-20 ఈరోజున ఉండిలో డాక్టరుగారితో మా ట్లాడి బరువాలు 2 న్నూ రెండు టేబిలున్ను కలిపి 50-0-0 రు తీసుకున్నాను. సాయంత్రం ఉండిస్కూలులో జరిగిన అష్టావధాన సమయమునం దుపన్యాస మివ్వడమైనది. నడుం పల్లి సుబ్బారాయుడుగారితో మాట్లాడి గ్రంథాలయ స్థాపన రేపటిదినం జరిపించుటకువప్పించి ఉభయులమున్ను కలిసి తాడికొండ వెంకటనరసయ్యగారు కలిసి దేవాల యములోవున్న సావడిగది హాలుచూచి రావడమైనది.

## సహాయనిరాకరణోద్యమము.

1921 లో దేశాన్నంతనీ వూపించిన సహాయనిరాకర ణోత్సాహము వీరి నేవిధమున కదలించినది చూతముగాక. వీరు కార్యశూరులుగనే యెక్కువగా ప్రకాశించినదియు వ్యర్థాడంబర రహితులనియు జ్ఞాపకముంచుకొందురుగాక.

31-3-21 ఈ రోజువుదయం౦ండిమీద 11 గంటలకు బెజవాడ రావడమైనది. షౌకతాలీ మహమ్మదాలీలసంద ర్శనం చేయడమైనది. చి॥ కుందూరి ఈశ్వరదత్తుకు (ట్వంటీ యత్ సెంచరీఅను యింగ్లీషు మాసపత్రిక సంపాదకుడు, స్పార్క్స్ అండుఫ్యూమ్సు మొదలైన విఖ్యాతగ్రంథ కర్తయునగు దత్తుగారు వీరి అప్పగారి కొడుకే.) కనపడి మరల స్నేహబృందముతో కలిసికొంటిని.

1-4-1921 శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు అరేంజిమెంట్లు బాగుగచేయుటచే మహాత్మాగాంధి, లజ పతిరాయ్, అలీసోదరులు, మోతీలాల్, శ్రీమతి సరళా దేవిచౌదరాణి, మాతాజీ వగైరాల సందర్శనంబాగా జరిగినది. తిలకు స్వరాజ్యనిధికి విరాళ మిచ్చితిని.

11-5-1921 చీరాల పేరాల ప్రజల సహాయార్థం 25—0—0 లు పంపితిని.

12, 13, 14-1-22 ఈ రోజుఉదయముకు నేను, పెద నిండ్రకొలను వారు, కూనపరాజు సోమరాజుగారు, వగై రాలు 10 మంది మందలపర్రువెళ్ళి అసహాయోద్యమత త్వమునుగూర్చి ఉపన్యసించి కాంగ్రెసు, పంచాయతి సంఘముల స్థాపనచేయించి మధ్యాహ్నము తిరిగి పెద నిండ్రకొలనులో జరుగు సభకువెళ్లగా దండు నారాయణ రాజు, గోవిందాచార్యులు, చింతలపాటి బాపిరాజుగార్లు సభకువిచ్చేసినారు. 8 గ్రామముల మునసబుకరణములు, నవుకర్లు గవర్నమెంటు నవుకరీలు వదులుకొని రిజైనులు దాఖల్ చేసినారు. సదరుత్యాగంచేసినవారికి గొప్పవుత్సవం చేసినారు. నిండ్రకొలనునందు, గ్రామపంచాయతీ కాం గ్రెసు సంఘస్థాపనలు చేయించ కోరినందున పెద్దనిండ్ర

27



కొలను వెళ్ళి రయితులతో చెప్పగా వారందరు అదివరకే సహాయనిరాకరణోద్యమము విధుల ననుసరించి పంచములను అభివృద్ధిచేయుటకు పాడుపడుట ధర్మమనే మహాత్ముని సందేశానుసారముగా వాండ్లకు ఆసామీతాహాతును ఒట్టి పశువున్నవాడికి య 2-0 లున్ను పశువులేనివానికి య 1-0 యిచ్చుటకున్నూ సంసిద్ధులై శ్రీ తహశీల్ దారువారి ఆజ్ఞానుసారం వప్పుకున్నారు. దేవరగోపవరం రయితులుకూడా పైప్రకారం వప్పుకున్నారు.

ఈయనను బాగా ప్రేమించే ఒక శ్రోత్రియబ్రాహ్మణుడు నాతో నన్నాడుకదా, లక్ష్మయ్యగారే మాలపల్లెలలో జొరబడినవారిలో ప్ర ప్రథముడని. అనేకమంది పంచమాసుర్కులు మేస్త్రీయనవద్దనుండి వుచితముగా డబ్బు తీసికొనిపోవుట నేనుకూడా బాగా యెరుగుదును. దినచర్యపుస్తకములో కూడా కనపడుతూంది. మరల ఈసంవత్సరమున గణపవరం ఫిర్కాకు మెంబరుగానిలచి ఎన్నికలందు జయముగాంచిరి. వీరి ప్రతికక్షిఅభ్యర్థి నేనూ ఒకవూళ్లో యీమస్యనే తారసిల్లాం. వీరిక చేయెత్తిమొక్కలక్ష్మయ్యగారంతటి సమర్థుడు, సుజనుడు వక్త వారియొకరు కొన్పింపరని మాటలసందర్భంలో చెప్పినాడు. పంతులుగారినే లక్ష్మయ్యగారని పిలుచుకోవడం అలవాటు. ఆయన పొట్టిగావుండేవారు. తాలూకా, జిల్లాబోర్డులందు యీయనకొరకు యెత్తైన ఆసనంవేశేవారట అందరికి కనపడగలందులకు.

30-9-1922 సరిపల్లెలో ఈమని వెంకటేశ్వర్లుగారు కట్టించిన సఖ్యాభివర్ధనీ నిలయమునకు రు50-0-0 లు విరాళమివ్వడమైనది.

నిండ్రకొలను విలేజిరోడ్లున్నూ, వల్లూరురోడ్డున్నూ, పాం . వ్వనుండి గణపవరం ఉండిరోడ్డుకున్ను, వెంకటాపురం చెర్వుకున్నూ ఈ సంవత్సరమే విశేషశ్రమలకును, వ్యయమునకును ఓర్చి తాలూకాబోర్డునుండి డబ్బును శాంక్షను చేయించిరి.

19-4-1923 భీమవరం: ఈ రోజున పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ మహాజనసభ వేలంకి వీరభద్రాచార్యులుగారి అధ్యక్షతక్రింద జయప్రదముగా జరిగినది. ఆహ్వానసంఘసభాధ్యక్షత నేనే వహించి సభ జరపడమైనది.

ఈరోజున దేశభక్తుని అధ్యక్షతక్రింత పశ్చిమగోదావరి జిల్లా మహాజనసభ జరిగినది. బహుజయప్రదముగా జరిగినది. వెయ్యి రూపాయిలవరకు స్వరాజ్యనిధి వసూలైనది వర్షంలో.

24-3-1923 వీరవాసరంలోని తాలూకాబోర్డు మీటింగుకు వెళ్ళడమైనది. డిస్ట్రిక్టు బోర్డుమెంబరు ఎన్నికవచ్చి అందరూ ఏకగ్రీవముగా నన్ను యెన్నుకొన్నారు.

4-4-23 తిలక్ స్వరాజ్యనిధికి అమితమైన చందాధనమును వసూయిచేసి రూ 25 లు నేను చందాయిచ్చితిని.

2.7-23 నిడమర్రునందు పంతులుగారు శివాలయమునకు ధ్వజస్తంభప్రతిష్ఠయు, అమ్మవారిప్రతిష్ఠయు జరిపిరి. వీరు చిన్నతనమునవే కాశీకివెడలి విశ్వనాథ సందర్శనము చేసుకొని స్వగ్రామమునకువచ్చి శివాలయంలో రాజేశ్వరునియొక్కయు, ఉమయొక్కయు విగ్రహములనుచూచి భక్తిపారవశ్యంచేత చాలసేపటివరకు యోగసమాధియందే యుండిపోయిరి. దానికి ఫలితముగా అమ్మవారికి జనకులైరి.

16-1-24 డిస్ట్రిక్టుబోర్డుబడ్జెటు చర్చజరిపించి చేబ్రోలు గణపవరం రోడ్డుకు రూ 12000 లున్ను కొవ్వూరోడ్డుకు రు12000 లున్ను బొండాడ మురుగుకాల్వరోడ్డుకు రు300 లున్ను శాంక్షను చేయించడమైనది. (ఈపనుల విలువ మా కొల్లేటూళ్ళలో రోడ్డూచెరువూ లేక అవస్థపడినవారికి తెలుస్తోంది. పందికోడుకు వంతెన వీరువేయించక క్రితం పెద్దవరదలువచ్చి దాంట్లో ఒల్లకట్టుకూడాలేనందున పశువులు, పిల్లలూకూడ కొట్టుకు పోయేవారు. వయ్యేటికి గణపవరం పెద్దవంతెనకూడా యీయనే విశేష శ్రమపడి ప్రయత్నించినారు. శ్రీమీర్జాపురంజమీందారువారిని వారింటికాహ్వానించి అనేకమంది బీదరైతులచే కష్టసుఖములు తెల్పించి వాళ్ళుకష్టపడేడి కష్టముల కండ్లార చూపించినారు. అప్పుడే అధ్యక్షులైన జమీందారుగారు ఆపనికిపూనుకొని శాంక్షనుచేసినారు. జమీందారుగారిని రప్పించి వారిస్వగృహమందు ఆతిధ్యమొసగిన ఒక్కదినమున శ్రీపంతులుగారు రూ 300 లు స్వంతసొమ్ము ఖర్చుపెట్టియున్నారు).

23-1-24 ఈరోజు వుదయం 9 గంటలకు శ్రీడిప్టికలెక్టరుగారి దర్శనం చేసుకొని నేను వకరయితుగామాట్లాడుటకనుజ్ఞ పొంది దాళ్వాఆర్డరు యిప్పటికే చాలాఆలస్యమైనదని చెప్పగా వెంటనే శిరస్తాదారుగారికి చీటీవ్రాసి చేతికే యివ్వగా ఆర్డరువేయించుకొన్నాను.

నిడమర్రుగ్రామమునందు పంతులుగారి నాటకాభిరుచి ఒక నాట్యమండలిగా వెలసినది. గ్రంథాలయ భవనహాలు పెద్దపెద్ద వుపన్యాసకులకును, నాటకములకును పనికివచ్చునట్లు కట్టించియున్నారు. స్వతహాగా గాయకులైనా, ఒక్క సూత్రధారిపాత్రతప్ప యేదియు వేసెడివారుకారు. శృంగారకవి నరశింహ్వాంపంతులుగారు, నిడమర్తి ఉమా

మహేశ్వరరావుగార్లు ముఖ్యనాయిక పాత్రలు ధరించెడి వారు.

పాందువ్వ గ్రామంలో తిరిగి య 1 కి 2 0-0 చొ॥న చందా 1300 వేయించి భీమవరంవెళ్ళి ప్రెశిడెంటుగారిచే ఒకరికి కంట్రాక్టు యిప్పించి అచ్చటి గ్రామస్తులమన్నన లకు పాత్రులైరి.

ఈ సంవత్సరముననే శ్రీ శ్రీ రాజా వేంకటాద్రియప్పారావు బహద్దరుగారు జిల్లాబోర్డు ఎన్నికల విషయంలో పంతులవారివలన అమితమైన సహాయం పొందియుండిరి. పంతులవారి లోకలుబోర్డు జీవితము చైతన్యవిలసితము. ఈయన చరిత్రయే డిస్ట్రిక్టుబోర్డు జీవితము.

## లోకలుబోర్డు పాలన

ఈయన పవిత్ర జీవితంలో లోకలుబోర్డు పాలన ఒక ప్రత్యేక ప్రాముఖ్యమైన ప్రకరణము. వారికి ప్రజాసేవ కార్యములందు విసుగు విరామము, తిండి తిప్పల దృష్టియే యుండెడిదికాదు. స్వగ్రామమందు నెలకు రెండుమూడు దినములకంటె ఎక్కువ వుండుటలేదు. ఉదాహరణముగా:

28-2-1925 న దినచర్య అవనిగడ్డ 9 గం॥లకు వెళ్ళి శ్రీ రాజా వారి దర్శనంచేసి భోజనంచేసి డిస్ట్రిక్టుబోర్డు మీటింగు సాయంత్రం 6 గంటలవరకు చేశికొని రాత్రి బయల్దేరి ఆరాత్రికే రేపల్లెవెళ్ళుడమైనది. ఇట్టి తిరుగుడు ప్రతినిత్య ముండెడిదిదే. 25 వ సంవత్సరమునందు ఎన్నికలలో నిడమర్రు సర్కిలునందు విజయముపొందిరి. గ్రంథవిస్తరభీతిచే చేసిన మహత్కార్యము లనేకములు న్నాయకసాక్షిస్వరూపుడగు భగవంతునకు వదలివేసినందు లకు పాఠకులకు నా క్షమాపణ లర్పించుచున్నాను.

నిడమర్రుగ్రామమందు 1920 సం॥న బ్రహ్మాండమైన తటాకమును తిరిగి త్రవ్వించి అశేషజనమునకు సంతర్పణ చేయించిరి. మద్రాసు రాజధానియం దెచ్చటనూ లేని ఆయుర్వేదవైద్యాలయమును నిడమర్రులో కట్టించుటకు శంకుస్థాపన చేయించి యెస్టిమేటు లక్ష్మీనారాయణగారు చేయించిరి కాని వారిశేషజీవితకాలమునం దది పూర్తి చేయలేకపోయిననూ వారి ప్రథమపుత్రుడు నిడమర్తి గౌరీశంకరదత్తుగారు వయస్సున పిన్నలైననూ కార్యనిర్వహణసమర్థు లగుటచే పట్టుదలతో కష్టనష్టములకోర్చి అవకాశమును చేజేతుల జారవిడువక నిర్మాణమును పూర్తి కావించిరి. వైద్యాలయము మంచి కేంద్రమున నుండినదగుటచే బహు గ్రామములకు అమితమైన సేవ చేయుచున్నది. అది వారి చలువయు, ప్రసాదమేనని నేటికిని రోగులు పొగడుచుందురు.

నిడమర్రునందు అందమైన స్కూలుభవనమునుకట్టించి దాదాపు రెండువందలమందికి అక్షయ సం॥ర భాద్రపద శు ౭ గురువారము (9-9-1926) న సంతర్పణ చేయించిరి. అందు 7 గురు ఉపాధ్యాయులు సర్వేశలింగమను నొక వడ్రింగి మేస్త్రరునూవని చేసెడివారు. 8 రాట్నములు, సైన్సు అపరేటసుకూడా శాంక్షను చేయబడి మహోన్నత దశ నందినది. తాడేపల్లిగూడెం తాలూకా బోర్డునందు తాత్కాలికాధ్యక్షపదవి నుండుటకు వీరే ప్రథములు. వీరి బోర్డుపాలన, కుల, మత, భేదములకు చోటీయ నందున సర్వజనశ్లాఘాపాత్ర మైనది.

## పోతన పుస్తక భాండాగారము.

ఈ గ్రంథభాండాగారము ఆంధ్రగ్రంథాలయచరిత్రలో ప్రసిద్ధమై మహోన్నతస్థితి ననుభవించినది. 1908 సంవత్సరమున శ్రీ నరశింహ్వాంగారు మొదలైన యువకులచే బ్రహ్మబాంధవీ పఠనాలయము పేర స్థాపింపబడి క్రమ క్రమముగా నభివృద్ధిచేయబడుచూవచ్చినది. శ్రీ లక్ష్మీనారాయణగారు 1914 నందు తమ స్వగృహమునందు తూర్పు వైపున విశాలమైన హాలులో పోతనపుస్తకభాండాగారమను నామమున పునఃప్రతిష్ఠగావించిరి. వారియాశ్రయపోషణలచే సర్వతోముఖముగ సర్వాంగ సౌందర్యముగ విలసిల్ల నారంభించినది. దాని కనుబంధముగా నైటుస్కూలు స్థాపింపబడినది. ముందు 15 గురు వయోజనులతో ఉదయించినయీబడి క్రమక్రమముగా 110మంది జనులతో కలకలలాడినది. అందు నలుగురుపాధ్యాయులు పనిచేయుచుండెడివారు. తోకలపల్లి నిడమర్రు గ్రామములందు పంచమాస్కూళ్ళుస్థాపింపబడి వీరిపోషణలోనడుపబడెడివి. కాలక్రమమున తోకలపల్లిస్కూలు బోర్డుస్కూలైనది. నిడమర్రుస్కూలు మిషనుస్కూలైనది. పోతననామమున మన ఆంధ్రదేశమునందెచ్చటను గ్రంథాలయములేదు. ఈనామకరణమునకు పంతులుగారికి భాగవతమునందుండెడి భక్తితాత్పర్యములే కారణములు. 1916న ప్రథమవార్షికోత్సవము శ్రీయుత చిలకమర్తి లక్ష్మీనరశింహంగారి ఆధిపత్యమున నమితవైభవముగా జరిగినది. నేటికిని లక్ష్మీనరశింహంగారు ఆనాటిగ్రామస్తుల ఉత్సాహమును పోతనగ్రంథాలయౌన్నత్యమును తత్సృష్టికర్తయైన పంతులుగారినిగూర్చియు కన్నీళ్ళువిడుస్తూంటారు. ద్వితీయ,తృతీయ, చతుర్థవార్షికోత్సవములకు వరుసగా వల్లూరి సూర్యనారాయణరావుగారు, నిడమర్తి బాలసూర్య భీమరాజుగారు, కొమ్మూరి నరశింహ్వాంపంతులుగార్లు అధ్యక్షతవహించి శోభ నినుమడింపజేసిరి. ఈసమయమునందు గ్రంథాలయమున 1500 ల ఉత్కృష్టాంధ్ర సంస్కృత గ్రంథ

సమకూర్చబడి చుట్టుప్రక్కలకు నాయకమణియై తనరుచుండెడిది. సరస్వతియను వ్రాతపత్రికను వీరు ప్రకటించి ప్రజాసంస్థలందలి లోపములను అభివృద్ధి సూచనలను ప్రకటించి తన్నివారణమునకై ప్రయత్నించెడివారు. ఆ సమయమందే కృష్ణామండల (పశ్చిమగోదావరిజిల్లా క్రింద విడగొట్టబడలేదింకా) గ్రంథాలయ చరిత్రను వ్రాసి లక్ష్మీనారాయణగారు గ్రంథాలయసర్వస్వము నందు ప్రకటించియుండిరి. ఆ ప్రకటన నేడు బహుయుపయోగకారిగానుండగలదని నా తలంపు. అట్టి పోతనపుస్తక భాండాగారము తరువాత నశ్రద్ధచేయబడినదని తెల్పుట కమితవిచారముకల్గుచున్నది. పుస్తకములన్నియు స్వార్థపరులయిండ్లయటుకలమీద చెదపురుగుల కాహార మగుచున్నవి. పంతులుగారి పూనికవలన ఈ గ్రంథాలయమునకు 6000 రూపాయిల విలువగలభవనము కలదు. మరల నేడు వారి ప్రథమకుమారులు శ్రీయుత గౌరీశంకర దత్తుగారు 100లు విరాళముతో పంచాయితీ తరఫునదీనిని శ్రీ లక్ష్మీనారాయణ పుస్తకభాండాగారముగ మార్చిరి. కాని తొంటివికాసమును కూర్పనెంత ప్రయత్నము జరుగుచున్నను గ్రామస్థుల అశ్రద్ధ నిరాదరణలు ప్రతిబంధకము లైనవి. సదయులు మరల పూనుకొని నిరక్షరులకు సేవ చేయుటకు రాత్రిపాఠశాలను స్థాపించి వయోజనవిద్యను వ్యాపింపచేసి ధన్యజీవు లయ్యెదరుగాక!

## జీవిత అస్తమయము (జీవిత విషాదాంతము)

నేడుత్తరదిక్కునుండి నిడమర్రు గ్రామమును తిలకించునెడల శ్రీలక్ష్మీనారాయణ నిర్మితగ్రంథాలయ పాఠశాల వైద్యాలయ సుందరభవనములు చాల నందముగానుండి కన్నులు కోరగిస్తూంటాయి. తటాకంనిండా వేలకొలదితెల్లతామరలు ఎర్రకలువలు, విచ్చిన దళవింజామరలతో అతిథుల నాహ్వానిస్తూ ప్రాణములను పులకింపజేస్తాయి. శ్రీపంతులవారు తమజీవితనాటకంనుండి పరీక్షితువలె సర్పదష్టుడై స్వర్గస్థులైరి. విగత జీవమైన భౌతిక శరీరమును, శ్రీపులవర్తి లక్ష్మణస్వామిగారు అమితదుఃఖము పొంది ఆకివీడు ఆస్పత్రినుండి స్వంతమోటారు మీద స్వగ్రామమునకు బంపిరి భౌతికశరీర మదృశ్యమైననూ మంచి తలంపులు, చేతలు, గణపవరం చేబ్రోలు రోడ్డుగాను, గ్రంథాలయభవనముగాను, పందికోడు, వయ్యేరు మురుగు, నారాయణపురం కాల్వల వంతెనలుగాను, వైద్యాలయంగాను, అనేక గ్రామములలో చెరువులుగాను, రోడ్లుగాను, దృశ్యనీయమౌతూ అశాశ్వతమైనజీవితమునకు ఆకల్పాంతస్థాయిగా శాశ్వతత్వ మాపాదించినవి.

సృష్టిలయములే ప్రకృతినియమము లైనప్పటికినీ ఈ త్యాగమూర్తి అంత్యావస్థను చిత్రింపబోవునప్పుడు నా కన్నులు చెమ్మగిలుచున్నవి. మనము దరిద్రీభూత మైనది. శోకతంత్రులు కదలింపబడి విషాదగీతికలు నినదించి అల్లనల్లన ప్రకృతిమౌనముద్రిలో లీనమైపోయినవి.

---

(110 వ పేజీ తరువాయి.)

ఆగ్రంథమెక్కడ నున్నది తెలిసికొని, అక్కడ నుండి తెప్పించి వాడెదరు. ఉపట్టికలవలన గూడ తెలియని యెడల ఇతర దేశములకు గూడ వ్రాసి, దానివివరములను సంపాదించి తెలిపెదరు.

### ఇతర వివరములు.

నవలలు మొదలగు చౌకరకపు పుస్తకములను కేంద్ర గ్రంథాలయము సప్లయిచేయదు. ఉపయుక్తమైన విషయముల మీది గొప్ప గ్రంథమునైన సరే- కొద్ది గ్రంథమునైన సరే- సప్లయిచేయును మరియు పుస్తకములనే గాక, ఆవిషయముల మీద పత్రికలలో నున్న వ్యాసములను గూర్చిన వివరములను గూడ సేకరించి పెట్టును. సాధారణముగా గ్రంథములను ఒక నెలవరకు ఎరు విచ్చెదరు. ఆ కాలములో ఇతరులెవ్వరును అదే గ్రంథము కొరకు దరఖాస్తు చేయని యెడల ఒకరు ఉంచుకొనదగిన కాలమును పొడిగింపవచ్చును. గ్రంథమును ఎరువిచ్చుటకు గాని, ఏ విషయములను గూర్చియైన వివరములను దెలుపుటకుగాని, సొమ్మేమియు పుచ్చుకొనరు. ఇతరగ్రంథాలయములనుండి పుస్తకముల నెరువు దెప్పించవలసి వచ్చునప్పుడు కొన్ని గ్రంథాలయములవారు అందుల కగు పోష్టుఖర్చులను దీసికొందరు. కొన్ని సగము దీసికొనును. మరికొందరు అసలే దీసికొనరు. కేంద్ర గ్రంథాలయము యొక్క ఖర్చులు పుస్తకములు కొనుటకగునవిగాక సంవత్సరమునకు ఒక లక్షరూపాయిలై యున్నవి.

# జాతీయ కేంద్ర గ్రంథాలయము, లండనునగరము

ఎరువుఇచ్చుట - తెచ్చుకొనుట.

ప్రపంచము నందలి పుస్తక సముదాయము అనంతము. అందుచేత ఎంతగొప్ప గ్రంథాలయమైనను అన్నిపుస్తకములును కలిగి యుండుట దుస్సాధ్యము. ప్రపంచమునం దంతటను 320 లక్షల వివిధరకములైన గ్రంథములుగలవని అంచనావేయబడినది. ప్రపంచము నందెల్లగొప్ప గ్రంథాలయమగు బ్రిటిషు మ్యూజియం గ్రంథాలయమందు 40 లక్షల గ్రంథములు మాత్రమే గలవు. ఇకమిగిలిన చిన్న గ్రంథాలయము లందలి గ్రంథముల సంఖ్య చెప్పనక్కరయేలేదు. ఇక ప్రతివత్సరమును తయారగుచున్న క్రొత్త పుస్తకముల సంఖ్యగూడ అమితముగ నుండుటచే ఒక గ్రంథాలయము వాని నన్నింటిని సేకరించి యుంచజాలదు.

ప్రతిమనుజుని యొద్దను కొన్ని గ్రంథములుండును. అవిచాలనినాడు గ్రంథాలయమునుండి ఆతడు గ్రంథముల నెరువు దెచ్చుకొనును. అట్లే గ్రంథాలయములు గూడ, తమయొద్దలేని గ్రంథములను ఇతరుల యొద్దనుండి ఎరువుతెచ్చుకొనుటయును, ఇతరులయొద్దలేని గ్రంథములను ఎరువు ఇచ్చుటయును అవసరమై పోయినది.

జాతీయ గ్రంథాలయ పద్ధతి.

లండనునగరమున జాతీయ కేంద్ర గ్రంథాలయము స్థాపింపబడినది. ఇందు 1,00,000 గ్రంథములుగలవు. ఇవిగాక ఇంకను ఈగ్రంథాలయమందులేని పదిలక్షల గ్రంథములు ఏగ్రంథాలయములం దున్నవియు వివరించు నిఘంటు పద్ధతిని తయారుజేసిన గ్రంథముల పట్టికలు ఇందు గలవు. దేశమునందున్న ముఖ్యమైన గ్రంథాలయము లన్నియు దీనికి శాఖలుగ జేయబడినవి. శాఖా గ్రంథాలయములం దున్నట్టిగాని కేంద్ర గ్రంథాలయమునం దున్నట్టిగాని గ్రంథములను పరస్పరము ఎరువు ఇచ్చుకొనుచుండెదరు. ఇట్టి వానిలో గొప్పవి 130 గలవు. విశ్వవిద్యాలయ గ్రంథాలయములు, ఇంకను ప్రత్యేక విషయములనుగూర్చి ఏర్పడిన గ్రంథాలయములు అన్నియు ఈ కేంద్ర గ్రంథాలయము ద్వారానే పరస్పరము ఎరు విచ్చుటయు నుఎరువు తెచ్చుకొనుటయును జేయుచుండును. దేశమంతయు 32 తాలూకాలు (Counties) గాను, అయిదుజిల్లాలు (Regional) గాను విభజింపబడినది. ప్రతిజిల్లాకు జిల్లాగ్రంథాలయమును, తాలూకాకు తాలూకా గ్రంథాలయమును గలవు. ఇవి అన్నియు జాతీయ కేంద్ర గ్రంథాలయమునకు శాఖలేను.

చదువరికి పుస్తకము లెట్లు లభించును?

ఇంగ్లాండు, వేల్సు దేశము నందున్న మొత్తము జనాభాలో నూటికి 97 మంది గ్రంథాలయములయొక్క అందుబాటులోనే నివసించి యుందురు. ఎవరికైన ఏపుస్తకము కావలసినుతమకు దగ్గరగానున్న గ్రంథాలయమునకు బోయి అక్కడ ఉన్న యెడల తీసికొందురు. అక్కడలేని యెడల, ఆగ్రంథాలయము ద్వారా కేంద్ర గ్రంథాలయమునుండి ఆగ్రంథమును తెప్పించుకొని చదువుచుందురు. జాతీయ కేంద్రగ్రంథాలయమునకు పుస్తకములకై దినమునకు 200 మొదలు 400 వరకు దరఖాస్తులు వచ్చుచుండును. కేంద్రగ్రంథాలయమందుకూడ కావలసిగ్రంథములు లేనప్పుడు, తమదగ్గరనున్న నిఘంటు గ్రంథవివరణ పట్టికలయందు జూచి

(109 వ పేజీ చూడుడు.)

# సభలు-రిపోర్టులు

## ద్వితీయ పశ్చిమ గోదావరిజిల్లా గ్రంథాలయ సభ

3-5-36 తేదీ మధ్యాహ్నము భీమవరం తాలూకా పాందువ్వగ్రామమున జిల్లాబోర్డు అధ్యక్షులగు శ్రీ దండు నారాయణరాజుగారి అధ్యక్షతక్రింద ఈ సభ సమావేశమయ్యెను. శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఎం. ఏ. గారు సభను ప్రారంభించిరి. (వారియుపన్యాసము క్రిందటి సంచికయందు ప్రకటింపబడినది.) జిల్లాయొక్క వివిధ భాగములనుండి పెక్కుమంది ప్రతినిధులేతెంచిరి.

అనంతరము అధ్యక్షులగు శ్రీ దండు నారాయణరాజు గారు ఇట్లు ఉపన్యసించిరి:—

### అధ్యక్షులు శ్రీ నారాయణరాజుగారు

ప్రజల అవసరములుతీర్చు భారము ప్రభుత్వము స్థానిక సంస్థలమీద పెట్టారు. ఆరోగ్యము, మార్గ సౌకర్యము, విద్యా, ఇంకా ఇతరవిషయములు ఎన్నోవున్నవి. ఈభారము పెట్టుతూ అవసరాలకు ఆదాయమునకు పోలికలేకుండా చేశారు. భూమిపన్ను, అబ్కారిపన్ను, స్టాంపు డ్యూటీ, ఇనకంటాక్సు అంతా ప్రభుత్వానిది. కోట్లకొలదీ ఆదాయము వారిది. అందులో పైసా స్థానికసంస్థలకురాదు. అదనముగా వేసికొన్న సెస్సులుమాత్రము స్థానికసంస్థల కిస్తున్నారు. ఈ కొద్దిధనముతో జిల్లాబోర్డు తన బాధ్యతల నెలా నిర్వహిస్తుంది? కాంగ్రెసువారుకాని మరెవరుకాని ఈస్వల్ప ఆదాయముతో అవసరాలన్నీ నిర్వహించలేరు. కాంగ్రెసు వారు పోటీచేయుటలో వచ్చే కొద్ది ఆదాయాన్ని సద్వినియోగం చేయుటే తలంపు.

శ్రీ పెద్దిరాజుగారు ప్రెశిడెంటుగా నున్నపుడు చాకచక్యంతో పనులు చేసేవారికి ప్రభుత్వంవల్ల సహాయధనం దొరికేది. ఆయన జిల్లాలో చాలా కొఱతలుతీర్చారు. నాయుడుగారు వచ్చుసరికి ప్రభుత్వం గ్రాంటు తగ్గింది. కాని రైల్వేసెస్సువారికి సహాయపడింది. అప్పుడు అయిదు లక్షల రూపాయిలిచ్చారు. అందులో మూడు లక్షలు అప్పు; రెండులక్షలు మరలనవసరములేని పద్ధతిని. అప్పు మూడు వాయిదాల్లో తీర్చాలన్నారు. అప్పుడు అప్పు చేశారు, ఇప్పుడు తీర్చవలసిన బాధ్యత బోర్డుమీదపడింది. 20 వాయిదా లిమ్మంటే ప్రభుత్వం 5 వాయిదాలుమాత్రం ఇచ్చారు. నిత్యకృత్యములు తీర్చుకోడానికి తోడు అప్పు కూడా తీర్చుకోవలసివచ్చింది. ఇట్టిస్థితిలో ఈబోర్డు ఏమి చేయగలదు? బోర్డు ఖర్చుచేయుసొమ్ము సద్వినియోగమగుచున్నదో లేదో మీరు చూచుకొనవలయును. ఇతర పరీక్షలకు జిల్లాబోర్డు నిలువజాలదు.

గ్రంథాలయములకు జిల్లాబోర్డు ఎంతసహాయము చేయగలదో అంతయుచేయుటకు మేము సిద్ధముగానున్నాము. గ్రంథాలయముల ఆవశ్యకత చాలయున్నది. అభినవ కాలమున జరుగుమార్పులను ప్రజలకు తెలియజేయు శక్తి మన ప్రస్తుత విద్యావిధానములో లేదు. ఈ పనికి గ్రంథాలయములే తగియున్నవి. ప్రస్తుతయుగ సంధిలో సమస్తమును వ్యక్తిగతలాభముపై ఆధారపడియున్నది. కేవల వ్యక్తిగతలాభముపై ప్రపంచ ఆర్థికస్థితి ఆధారపడియుండడం ప్రజాసౌకర్యమునకు భంగకరమని బుద్ధిమంతులు చెప్పుచున్నారు. ఇతరదేశాలలో ప్రజాసౌకర్యమే దృష్టిలో పెట్టుకొని జీవితవిధానము నడిపించుటకు ప్రయత్నములు చేయుచున్నారు. మానవుని ప్రధాన ప్రకృతి ప్రపంచ శ్రేయోభిలాషగాని స్వార్థంగాదని వారు చెప్పుచున్నారు. గొప్పగొప్ప యంత్రనిర్మాతలు, గ్రంథకర్తలు తనజీవితమును ధారపోసినది పరార్థముపై గాని స్వార్థమునకుగాదు. ప్రభుత్వమునకు వ్యక్తిగత జీవనమునకు ఆధారము కలిగించిన పరార్థపరత ప్రజలకు అలవడగలదు. పైగా బలవత్తరమగు ప్రబోధము ఇక్కడ అవసరము. ఈ మార్పు గలిగించుటకే గ్రంథాలయ విజ్ఞానము తోడ్పడాలి. ఈ అభివృద్ధికి అనుకూలము ఏర్పడుటకు గ్రంథాలయములు పూనుకోవలయును. వానిని మనము వృద్ధి చేయవలయును.

### తీర్మానములు.

అనంతరము ఈ దిగువతీర్మానములు అంగీకరింపబడినవి.

1. ఈ జిల్లాలోని అన్నితాలూకాలలోను కేంద్రగ్రంథాలయములను స్థాపించుటకును గ్రంథాలయములు లేని గ్రామములలో గ్రంథాలయములు స్థాపించుటకును ఈ సంఘమువారు తీర్మానించుచున్నారు.

2. జిల్లాలో ప్రస్తుతము బీదస్థితిలోనుండి పనిచేయలేకున్న గ్రంథాలయములను వెంటనే పునరుద్ధరించుటకు ఈ మహాసభవారు తీర్మానించుచున్నారు.

3. ఈ జిల్లాలోని గ్రామగ్రంథాలయములన్నియు ఏకోన్ముఖముగ పనిచేసి వయోజన విద్యాభివృద్ధి కలుగజేయుటకు ఒక ప్రణాళికను తయారుచేసి, ఆచరణలో పెట్టుటకు పశ్చిమగోదావరిజిల్లా గ్రంథాలయ సంఘము వారిని ఈ సభవారు కోరుచున్నారు.

4.1 గ్రంథాలయోద్యమమును వ్యాపింపజేయుటయును, వయోజనవిద్యను వ్యాపింపజేయుటయును జిల్లాబోర్డు యొక్క విధ్యుక్తధర్మములలో నొకటిగను, పశ్చిమ గోదావరిజిల్లాలోని అన్ని గ్రంథాలయములు ఏకోన్ముఖముగాను సక్రమముగాను పనిచేయుచు జనులందరియందును వయోజన విద్యావ్యాపకము చేయుటకుగాను 3 వ తీర్మానప్రకారము తయారైన ప్రణాళికను ఆచరణలో పెట్టుటకై ఈ దిగువ వివరించిన ప్రకారము ఖర్చుపెట్టుటకు రు4000ల విరాళము ప్రతి సంవత్సరము పశ్చిమగోదావరిజిల్లాగ్రంథాలయసంఘమునకు ఇప్పించవలసినదిగ పశ్చిమగోదావరిజిల్లా బోర్డువారిని ఈసభవారు కోరుచున్నారు.

II. రివెన్యూ డివిజనునకు ఒక్కరు చొప్పున, మాసమునకు భత్యంతోసహా రు 35 లు జీతంమీద జిల్లా మొత్తం మీద ముగ్గురు ప్రచారకులను నియమించుట.

III. ఈ ప్రచారమునందు జనసమూహము నాకర్షించుటకై, పైముగ్గురకు ప్లేటులతోసహా ఒక గ్రామోఫోనున్ను, ఉపన్యాసములు ఆకర్షణీయముగ వివిధవిషయములనుగూర్చి ఇచ్చుటకై స్లైడ్లతోసహా ఒక మాజిక్కులాంతరున్ను, గ్రామములవెంబడి జనులకు పుస్తకముల నందజేయుటకై ఒక గ్రంథాలయశకటమునున్ను సరఫరా చేయుట.

VI. తాలూకాలలో గ్రంథాలయములు సక్రమముగా నడపుటకును, క్రొత్తగా స్థాపించుకొను రాష్ట్రజిల్లా సంఘములతో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుటకును, ఒక్కొక్క తాలూకా గ్రంథాలయసంఘమునకు ఒక సంవత్సరమునకు ఒక నూరురూపాయలు విరాళమును ఇప్పించుట.

V. జిల్లాలో అన్ని తాలూకా సంఘములు ఏకోన్ముఖముగ పనిచేయునట్లు చూచుటకు రాష్ట్ర అఖిలభారత సంఘములతోను ఇతర సంస్థలతోను ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుటకుగాను జిల్లా గ్రంథాలయ సంఘమునకు సంవత్సరమునకు రు 200 లు విరాళమిచ్చుట.

VI. గ్రంథాలయములులేని గ్రామములకు ఒక గ్రంథాలయమునుండి మరియొక గ్రంథాలయమునకు గ్రంథములనంపుటకుగాను ప్రతితాలూకా సంఘమునకు ఆరు చొప్పునను, జిల్లాగ్రంథాలయ సంఘమునకు 8 యును మొత్తం 50 గ్రంథాలయ పేటికలను సప్లయి చేయుట.

VII. జిల్లామొత్తంమీద బాగా పనిచేయు గ్రంథాలయమునకు గ్రంథాలయసేవయందుత్సాహము కలుగజేయుటకుగాను రు 100 విలువగల ఒక బహుమానమును పుస్తకముల రూపమున నిచ్చుట.

VIII. మరియు జిల్లామొత్తంమీద ఆంధ్రమందు బాగుగ మాట్లాడు ఒక వ్యక్తికి బహుమానమిచ్చుట.

5.1 ఈ జిల్లాయందు గ్రంథాలయోద్యమమును వ్యాపనము చేయుటకుగాను, ఈ దిగువరీతిగా సహాయము చేయగలందులకు పశ్చిమ గోదావరిజిల్లా బోర్డువారిని ఈ సభవారు కోరుచున్నారు.

II. ఈ జిల్లాలోని అన్నిబోర్డు గ్రంథాలయములను పరిపాలన నిమిత్తంమాత్రం ఆయా తాలూకా గ్రంథాలయ సంఘములకు ఇప్పించుచు తాలూకాలో ఒకదానిని కేంద్ర గ్రంథాలయముగ ఏర్పరచుటకును, ఈ పశ్చిమ గోదావరి జిల్లా సంఘమువారిచే ఆమోదించబడిన నిబంధనలు సదరు అన్నిబోర్డు గ్రంథాలయములకు ఏర్పరచుటకును.

III. గ్రంథాలయభవనములను కట్టించుటకుఅగు సగముఖర్చులను జిల్లాబోర్డువారు గ్రాంటుగానిచ్చుటకును.

VI. జిల్లా గ్రంథాలయ సంఘమువారిచే సిఫారసు చేయబడిన గ్రంథములను కొనుటలో అగు సగముఖర్చును గ్రామ గ్రంథాలయములకును కేంద్ర గ్రంథాలయములకును గ్రాంటుగానిచ్చుటకును.

V. జిల్లాబోర్డు పాఠశాల గ్రంథాలయములను గ్రామస్థులు అందరి అందుబాటులో నుండునట్లు చేయుటకును.

VI. జిల్లాబోర్డుఉపాధ్యాయులు గ్రంథాలయములలో ఉచితముగాగాని కొంత పారితోషికముతోగాని గ్రంథభాండాగారి (Librarian) గా పనిచేయుటకు అనుమతి నిచ్చుటకును.

6. ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము (Registered under Act XXI of 1860) వారి నిబంధనలలో ఈ జిల్లాకు వర్తించునంతవరకును ఆయానిబంధనలను ఏర్పాటు చేయుటకును, వారి నిబంధనలకు వ్యతిరిక్తము కానంత వరకు ఇతర నిబంధనలు ఏర్పాటు చేయుటకును, ఈ సంఘమును క్రమముగా నడపుటకు అవసరమయిన ఇతర నిబంధనలును తయారుచేసికొనుటకును జిల్లా గ్రంథాలయసంఘమునకు అధికార మియ్యబడమైనది.

7. ఈ పశ్చిమ గోదావరిజిల్లా గ్రంథాలయసంఘమును ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకు శాఖగా యుండునట్లు అనుమతించగలందులకు సదరు సంఘమువారిని కోరడమైనది.

8. భీమవరంతాలూకా గ్రంథాలయసంఘము వారిచే తయారుచేయబడి ఆ తాలూకాలోని గ్రామ గ్రంథాలయములచే ఆచరించబడుచున్న మాదిరినిబంధనలను ఈమహాసభవారు ఆమోదించుచు, ఈ జిల్లాలోని అన్ని గ్రంథాలయములవారు వానినే తమ నిబంధనలుగా ఏర్పాటుచేసికొనగలందులకు కోరుచున్నారు.

9. గ్రంథాలయముల నిమిత్తం రాష్ట్రం మొత్తంమీద గవర్నమెంటువారు ఇచ్చుచున్న పదివేల రూపాయల గ్రాంటు చాల తక్కువయని ఈ మహాసభవారు విచా రించుచు ఇక ముందునుండి సంవత్సరమునకు ఒక లక్షరూపాయలనైన రాష్ట్రములోని గ్రంథాలయములకు గ్రాంటుగా ఏర్పరచుటకు మద్రాసురాష్ట్ర ప్రభుత్వమువారి నీసభవారు కోరుచున్నారు.

10. ప్రభుత్వమువారిచే ఇవ్వబడు గ్రాంటులతో కొను పుస్తకములు, ప్రభుత్వమువారిచే నిషేధింపబడిన గ్రంథములనుతప్ప మిగతాగ్రంథముల నన్నింటిని కొనుటకు గ్రంథాలయములకు అధికారమియ్యవలసినదనియు ఈవిషయములో జిల్లావిద్యాశాఖాధికారిసిఫారసు అవసరములేకుండా చేయించగలందులకుప్రభుత్వమువారి నీసభవారు కోరుచున్నారు.

11. గ్రంథాలయములను 1860 సం॥21 నెంబరుచట్ట ప్రకారము రిజస్టరు చేయుటకు చెల్లించవలసిన ఫీజు రు500 అవసరములేకుండ చేయవలసినదని ప్రభుత్వమువారి నీ సభవారు కోరుచున్నారు.

12. ఈజిల్లాలోని అన్నిగ్రంథాలయములకును ప్రభుత్వమువారిచే నిషేధింపబడిన గ్రంథముల పట్టికను ఒకదానిని సరఫరాచేయుచు, ఇకముందు నిషేధింపబడు గ్రంథముల పట్టికలనుగూడ మూడుమాసముల కొకసారి సప్లయిచేయునటుల ప్రభుత్వమువారి నీ సభవారు కోరుచున్నారు.

13. I గ్రంథాలయములను సోదా(సర్చి) చేయుటకు ప్రభుత్వోద్యోగులు వచ్చునప్పుడు వారంటులను జారీచేయించవలసినదనియు,

II. సదరు వారంటు పట్టుకొనివచ్చే పోలీసు ఉద్యోగులు సందేహమునకు తావివ్వకుండునటుల పోలీసు డ్రెస్సులో నుండునట్లు చేయవలసినదనియు,

II. అట్లు తనిఖీ అయినపిమ్మట పోలీసువారు వశపర్చుకొనే పుస్తకములకు రశీదును గ్రంథాలయమునకు ఇప్పించవలసినదనియు,

IV. పోలీసువారికి తీసికొన అవసరములేని గ్రంథములను తిరిగి వెంటనే గ్రంథాలయములకు వాపసు ఇప్పించవలసినదనియు,

ఈ జిల్లా పోలీసు అధికారిని ఉత్తరువు చేయగలందులకు ఈ సభవారు ప్రభుత్వమువారినికోరుచున్నారు.

14. ఈ దిగువవారిని ఈ జిల్లాగ్రంథాలయ సంఘమునకు కార్యనిర్వాహక సంఘముగా ఎన్నుకొనడమైనది.

అధ్యక్షులు:-దండు నారాయణరాజుగారు
ఉపాధ్యక్షులు:-భూపతిరాజుతిరుపతిరాజుగారు.
కార్యదర్శులు: పాలకోడేటి సత్యనారాయణశర్మగారు
తేతలి సత్యనారాయణమూర్తిగారు
ఆత్మకూరి గోవిందాచార్యులుగారు
ఇతరసభ్యులు:-బుద్ధవరపు రాజభూషణరావుగారు
మాగంటి బాపినీడుగారు
సామవేదం సత్యనారాయణగారు
తాడిమేటి కుటుంబశాస్త్రిగారు
యర్రమిల్లి నారాయణమూర్తిగారు
పోతాప్రగడ రామారావుగారు
తేతలి భీమేశ్వరరావుగారు
వేగేశ్న సూరపరాజుగారు
వద్దిపర్తి రాజారావుగారు

# రేపల్లె తాలూకా గ్రంథాలయ యాత్ర

## తాలూకాసంఘమువారి సంచారకార్యవివరము

యార్లగడ్డ శ్రీకృష్ణయ్య చౌదరిగారు,
అధ్యక్షులు.

మా రేపల్లెతాలూకా గ్రంథాలయసంఘ యాత్రా సంచార కార్యక్రమము ది 2-5-36 తేది ఉదయము గం 8 లకు రేపల్లె కార్యస్థానమునుండి ప్రారంభింపబడి ది 8-5-36 వ తేదీతో ముగిసినది; ఈ కార్యక్రమములో 82-83 మైళ్లు ప్రయాణముచేసితిమి. 33 గ్రంథాలయములను 1 రీడింగురూమును తిలకించితిమి. మూడుచోట్ల బహిరంగ సభలు జరిపితిమి. అనేకమంది పెద్దలతోను యువకులతోను గ్రంథాలయోద్యమమునుగూర్చి మాట్లాడితిమి. చూడబడిన గ్రంథాలయములయొక్క నిజస్థితి నీక్రింద క్లుప్తముగ బొందుపరచుచున్నాము.

### ౧

### శ్రీ ఆంధ్ర బాలసరస్వతీనిలయం, నల్లూరు.

2-5-36 సం॥ సా॥ గం॥ 2½ లకు

రేపల్లెకు 3 మైళ్లదూరములోనున్న యీ గ్రంథాలయమును తిలకించితిమి. గ్రంథాలయమునం దచ్చటచ్చట నీతివాక్యములచే విరాజిల్లు నట్టలు కట్టబడియున్నవి. మిక్కిలి యాకర్షణీయముగానున్నది. పాఠకులసంఖ్య తృప్తికరముగానే యున్నది. ఈ గ్రంథాలయమునకు దాదాపు ఒకవేయిరూపాయీల మూలధనమున్నది. దీని గౌరవాధ్యక్షులు శ్రీయుత వెలగపూడి రామకృష్ణ చౌదరి యం. ఏ. (ఆనర్స్) బి. యస్ సి. ఏ. సి. యస్. గారై యున్నారు. గ్రంథాలయము సక్రమపద్ధతులమీద నడుపబడుచున్నది. 1934-1935 సం॥లందు ఈగ్రంథాలమింకను నభివృద్ధిగాంచినట్లు తెలిసికొనగలిగితిమి. అంతకంటె నాదర్శకముగా నీ గ్రంథాలయమును నడుపుటకు కార్యనిర్వాహకులను గ్రామవాసులను కోరుచున్నాము.

### ౨

### శ్రీసనాతన వేదాంతనిష్ఠాశ్రమ గ్రంథాలయము,

### మైనేనివారిపాలెం

2-5-36 సం॥ సా॥ గం 4½ లకు

నల్లూరుకు 1½ మైలుదూరములో నున్న యీ గ్రంథాలయము జూచితిమి. గ్రంథాలయము నడుపబడుచున్నదిగాని యాదర్శకమైన పద్ధతులమీద నడపబడక పోవుట విచారకరము. రిజష్టర్లు వగయిరా సరియైన స్థితిలో లేవు. దీనికి ప్రత్యేకమూలధన మేదియు లేదు. గ్రంథాలయస్థాపకు లగు మ॥ రా॥ శ్రీ॥ వీరమాచనేని ఆంజనేయ చౌదరిగారిని గ్రంథాలయమును సరియైన పద్ధతులమీద నడపవలసినదిగా గోరితిమి.

### 3

### శ్రీవివేకానంద పుస్తక భాండాగారము.

### మూర్తోట (మునులతోట)

2-5-36 సా॥ గం 5½ లకు

మైనేనివారిపాలెమునకు మైలుదూరములో నున్న నీ గ్రంథాలయమును జూచితిమి. ఇది యోగి రాఘవేంద్రరావుగారి యాశ్రమకుటీరమున నున్నది గ్రంథాలయంబున పుస్తకములు తగినన్ని యున్నప్పటికిని పాఠకుల సంఖ్య చాల తక్కువగా నున్నది. శ్రీ రాఘవేంద్రరావుగారు ప్రకృతిచికిత్సయందు నిమగ్నులై యుండుటచే వారు కార్యభారము వహించుట కవకాశ మెక్కువగా గనుపించుటలేదు. కాని వారికి గాఢాభిమానమున్నట్లు గ్రహించితిమి. ఆట నున్న యువకుల నీకార్యభారము వహింపవలసినదిగా గోరితిమి. ఈ గ్రంథాలయ మచిరకాలములో నభివృద్ధికి రాగలదని దలంచుచున్నాము.

### ౪

### శ్రీ శీతారామవిజయసరస్వతీపుస్తక

### భాండాగారము

### సింగుపాలెము.

2-5-36 సం॥ రాత్రి గం 7½ లకు

మూర్తోటకు రెండుమైళ్ళదూరములో నున్న యీ గ్రంథాలయమును జూచితిమి. గ్రంథాలయ రిజష్టర్లు సక్రమమైన పద్ధతులమీద బెట్టబడియున్నవి. పాఠకులసంఖ్య తృప్తికరముగానే యున్నది. గతవత్సరముకంటె నీ వత్సరము చాలయభివృద్ధిలో నలరారుచున్నది.

యువకులు కడు నుత్సాహముతో నీ గ్రంథాలయమును నడుపుచున్నారు. గ్రంథాలయమునకు మూలధనము లేక పోయినప్పటికి జందా ధనమువలననే నడుపబడుచున్నది. యువకులకు బెద్దలకుగూడ నీ గ్రంథాలయమం దాదరణాభిమానమున్నట్లు గ్రహించితిమి. రాత్రి గం 8 లకు యిచ్చట గ్రంథాలయోద్యమమునుగూర్చి బహిరంగసభ జరిపితిమి. ఈ గ్రంథాలయ మచిరకాలములోనే చాల యభివృద్ధి జెందఁగలదని మా యాశయము.

## ౫

### శ్రీ సీతారామ గ్రంథాలయము
### నల్లూరుపాలెము

3-5-36 సం॥ ఉ॥ గం॥ 8 లకు

సింగుపాలెమునకు మూడుమైళ్ల దూరములోనున్న యీ గ్రంథాలయమును జూచితిమి. ఇందు రిజష్టరువగైరా లేమియు సరియైన స్థితిలోలేవు. ప్రస్తుతము ఈ భాండాగారము నల్లూరు నృసింహాచార్లుగారి యింటియందున్నది. దీనిని తిరిగి పునరుద్ధరింపవలసినదిగా గ్రామ మునసబుగారగు సుఖవాసి వెంకటామయ్య మొదలగు వారితో జెప్పితిమి. కొలదికాలములో దీనిని సక్రమమార్గమున నడపెదమని వారు చెప్పిరి.

## ౬

### శ్రీ కన్యాకాపరమేశ్వరీ గ్రంథాలయము
### రేపల్లె.

3-5-36 సం॥ సా॥ గం॥ 3 లకు

ఈ గ్రంథాలయము నల్లూరుపాలెమునకు మూడు మైళ్ల దూరములోనున్నది. ఈభాండాగారమును నడుపుచున్నారు గాని తృప్తికరముగా బనిచేయుటలేదు. పత్రికా పాఠకులసంఖ్య తృప్తికరముగా నున్నప్పటికి గ్రంథములనిచ్చి పుచ్చుకొనువారలు లేమిజేసి సరిగా బనిజేయుట లేదనవలసివచ్చినది. ఇందునుగూర్చి అధ్యక్ష కార్యదర్శులగు శ్రీయుత పువ్వాడ రామభట్టు, పోలుసెట్టి వెంకటసుబ్బారావుగార్లతో గ్రంథాలయ మందగమనమునుగూర్చి జెప్పితిమి. ఈ గ్రంథాలయమున కొన్ని దినవారమాసపత్రికలు వచ్చుచున్నవి. ఈ నిలయము జక్కని మార్గమున నడుపుటకు వారు ప్రయత్నించుచున్నారు.

## ౭

### శ్రీ రామకృష్ణ రీడింగురూము, రేపల్లె.

3-5-36 సం॥ సా॥ గం॥ 5 లకు

ఇచ్చటకు బత్రికలువగైరా మూడునాలుగు వచ్చుచున్నవి. పాఠకులసంఖ్య తృప్తికరముగానే యున్నది.

## ౮

### శ్రీ సాహితీగ్రంథనిలయము, బేతపూడి.

4-5-36 సం॥ ఉ॥ 7½ గం॥ లకు

రేపల్లెకు 1¼ మైళ్ళ దూరములోనున్న యీ గ్రంథనిలయము దిలకించితిమి. ఈ గ్రంథాలయము దృప్తికరముగా బనిజేయుచున్నది. దగినన్ని వార్తాపత్రికలుఁ గూడ వచ్చుచున్నవి. పాఠకులసంఖ్య తృప్తికరముగా నున్నది. రిజష్టర్లు సరియైనస్థితిలో నున్నవి. దీనిని డిక్టేటర్ షిప్పుతో శ్రీయుత మోటూరి రాజబాబయ్యగారు నడుపుచున్నారు. యువకు లుత్సాహపూరితులై యీ గ్రంథాలయముయొక్క పనిజేయుచున్నారు.

## ౯

### శ్రీ వేంకటేశ్వర గ్రంథాలయము, అడవులదీవి.

4-5-36 సం॥ ఉ॥ గం॥ 10½ లకు

ఈ నిలయము బేతపూడికి 12 మైళ్లదూరములో నున్నది. సామాన్యముగా నిచ్చోట బని జరుగుచున్నది. గాని తగినంతకృషి గ్రామవాసులు దీనియందు జూపుటలేదు. నిలయాభివృద్ధినిగూర్చియు గ్రంథాలయావశ్యకతను గూర్చియు గ్రామవాసులకు జెప్పితిమి.

## ౧౦

### శ్రీ వాణీనికేతనము, నిజాంపట్నము

4-5-36 సం॥ సా॥ గం॥ 6 లకు

ఈ నిలయము అడవులదీవికి 11 మైళ్ళదూరములో నున్నది. ఇదిచాలాకాలమునుండి నడపబడుచున్నది కాని యధ్యక్షకార్యదర్శు లీనిలయమునకు తగినంతకృషిసలుపుట లేదు. అందునుగూర్చి వారిని శ్రద్ధతీసికొనవలసినదిగా కోరితిమి. రాత్రియిట గ్రంథాలయోద్యమమును గూర్చి బహిరంగసభ జరిపితిమి. యువకులీగ్రంథాలయము నుత్సాహవంతముగానడుపుటకు ప్రయత్నించుచున్నారు. తగినంత సాహాయ్యము జేయవలసినదిగా బెద్దలకు జెప్పితిమి.

## ౧౧

### శ్రీ వినయాశ్రమ గ్రంథాలయము, కళ్యాణకావూరు.

5-5-36 సం॥ ఉ॥ గం॥ 10 లకు

ఈ గ్రంథాలయము నిజాంపట్నమునకు 10 మైళ్లదూరములోనున్నది. ఈనిలయము శ్రీ వినయాశ్రమస్థాపకులగు శ్రీయుత గొల్లపూడి సీతారామశాస్త్రి, తుమ్మల బసవయ్యచౌదరీగార్లచే స్థాపింపఁబడియున్నది. 500 ల వరకు నమూల్యములైనపొత్తరాజములు విలసిల్లుచున్నవి. రిజష్టర్లు గ్రంథాలయాభివృద్ధికి తగినన్ని బెట్టియుండలేదు. ఈగ్రంథాలయము ప్రాచీన పద్ధతులమీద నడపిన నాశ్రమమున కెంతయో వన్నె దెచ్చును. గ్రంథాలయస్థాపకులును నాశ్రమ యువకులును తగుశ్రద్ధదీసికొన గలరని నమ్ముచున్నాము.

## ౧౨

### శ్రీ సీతారామాంధ్రగ్రంథాలయము, కావూరు.

5-5-36 సం॥ సా॥ గం॥ 3 లకు

ఈగ్రంథాలయము కళ్యాణకావూరుకు 1½ మైలుదూరములోనున్నది. ఈ నిలయమునకు స్వంత భవనము గలదు. గ్రంథాలయము కొంతకాలమునుండి పనిజేయక నిలచిపోయినది. తిరిగి యిప్పుడు పనిజేయుటకు ప్రారంభించినది. గ్రంథాలయమునకు ముఖ్యముగా నుండవలసిన రిజష్టరుయొక్క నమూనాలను ఇచ్చుటవారి కిచ్చితిమి. గ్రామవాసులయాదరణ తిరిగి గ్రంథాలయము పొందుచున్నది. ఈ పురవరంబున 'విశ్వసందేశ'మను స్థానమున రాత్రి గం 9 లకు గ్రంథాలయోద్యమమును గూర్చి బహిరంగసభ జరిపితిమి.

## ౧౩

### భారతసేవకమండలి, కావూరు.

5-5-36 సం॥ సా॥ 4 గం॥లకు

ఈ గ్రంథాలయమునకు సుందరమైన స్వంతభవనమున్నది. ఇట్టి భవనమును కట్టించియిచ్చిన దాతధన్యుడు. ఈ గ్రంథాలయమునకుగూడ చాలాకాలము నిద్రావస్థపట్టినది. రిజిష్టర్లు 1,2 నామకమాత్ర మున్నవి. సక్రమపద్ధతులమీద నడుపుటకు రిజిష్టర్లుంచవలసినదిగా గోరుచు నమూనాల నిచ్చితిమి. తిరిగి యీగ్రంథాలయమునందభిమానము గ్రామవాసులు జూపుచున్నారు. ఈ నిలయమున నభివృద్ధి సూచకమగు పనులు ప్రారంభింపఁబడినవి. అచిరకాలములో నీపని యభివృద్ధిజెందగలదని మాయాశయము.

## ౧౪

### పాఠశాలగ్రంథాలయము, చెరుకుపల్లి.

5-5-36 సం॥ సా॥ 7 గం॥లకు

కావూరుకు 2 మైళ్ళలో నున్న నీ గ్రంథాలయమును జూచితిమి. ఈ గ్రంథాలయమును పాఠశాలోపాధ్యాయబృందము నడుపుచున్నది. పాఠకుల సంఖ్య తగినంత తృప్తికరముగా నుండునట్లు చేయవలసినదిగా నుపాధ్యాయబృందమును గోరితిమి "భావిసంతతి" విద్యాసంపన్నులు గావలెనంటే జాతీయపద్ధతులు. వారికి బోధ కావలెనంటే ఇట్టి యుపాధ్యాయబృందముచే స్థాపింపబడిన గ్రంథాలయము వారికెంతయు సహకారిగా నుండ గలదు. ఈ గ్రంథాలయము నభివృద్ధిపరచవలసినదిగా వారిని గోరితిమి.

## ౧౫

### శ్రీసరస్వతీ గ్రంథ నిలయము, పొన్నపల్లి అగ్రహారము.

6-5-36 సం॥ ఉ॥ 8. గం॥ లకు

ఈ నిలయము చెరుకుపల్లెకు 2 మైళ్లదూరములో నున్నది ఈ నిలయము కమిటీక్రిందనే నడుపఁబడుచున్నది. ఈ నిలయమున బి. ఏ., చదివిన యొక యువకమహానీయుడు కార్యదర్శిపనిచేయుచున్నాడు నిలయము మాత్రము తగినంత తృప్తికరముగాలేదు. రిజష్టర్లు సరియైన స్థితిలోలేవు. ఈ లోటును దీర్చవలసినదిగానున్న గ్రంథాలయము నింకనూ అభివృద్ధికి తేవలసినదిగానున్నూ గ్రామవాసులను గ్రంథాలయకార్యనిర్వాహకులను గోరితిమి.

## ౧౬

### శ్రీ తిలక్ గ్రంథాలయము, నడింపల్లి.

6-5-36 ఉ॥ గం॥ 9 లు

పొన్నపల్లిఅగ్రహారమునకు 1½ మైలులోనున్న యీ గ్రంథాలయమును తిలకించితిమి. ఇందు అమూల్యములగు పుస్తకములు చాలయున్నవి. తగినంతపని యీ గ్రంథాలయమున జరుగుటలేదు. 2,3 పత్రికలు ఈ నిలయమునకు వచ్చుచున్నవి. పాఠకులసంఖ్య తృప్తికరముగనుండునట్లు చేయగోరితిమి.

## ౧౭

### శ్రీ నెహ్రూగ్రంథాలయము, గూడవల్లి.

6-5-36 ఉ॥ గం॥ 10 లు

నడింపల్లికి ½ మైలులోనున్న యీ గ్రంథాలయమును

37



చూచితిమి. యువకులు ఉత్సాహపూరితులుగానే యున్నారు. గ్రంథాలయము నడుపబడుచున్నది. గాని తగినంత తృప్తికరముగ లేదు. 2,3 వార్తాపత్రికలు వచ్చుచున్నవి. గ్రామవాసులతో గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడవలసినదిగా సంప్రదించితిమి.

## ౧౮

### హరిజనగ్రంథాలయము, గూడవల్లి.

ఈ గ్రంథాలయాధికారి గ్రామాంతరుడగుటచే ఈ గ్రంథాలయమును సందర్శించు నవకాశమబ్బినదికాదు. ఈ నిలయము కాలనిర్ణయముమీద నడుపబడిన బాగుండునని దలచుచున్నాము.

## ౧౯

### శ్రీ జాతీయ బాలభారతీ గ్రంథనిలయము, కనగాల

6-5-36 సా॥ గం॥ 3 లు

గూడవల్లికి 1 మైలు దూరములోనున్న యీ గ్రంథాలయమునుగాంచితిమి. యువకులయొక్కయు పెద్దలయొక్కయు ఆదరణ యీ నిలయము పొందియున్నది. పాఠకులసంఖ్య కడుతృప్తికరముగనున్నది. వార్తాపత్రికలు విశేషముగా యీ గ్రంథనిలయమును అలంకరించుచున్నవి. రిజిష్టరులన్నియు సక్రమపద్ధతులమీద పెట్టబడియున్నవి. గ్రంథాలయమునందచ్చటచ్చట నీతివాక్యములలరారుచున్నవి. ఈ తాలూకాలో ప్రాముఖ్యతవహించిన గ్రంథాలయములలో నిది యొకటియైయున్నది. ఈ నిలయభాండాగారియగు యువకుని ఉత్సాహము కొనియాడుచున్నాము.

## ౨౦

### శ్రీ శారదాగ్రంథనిలయము, అయిలవరం.

6-5-36 సం॥ సా॥ గం॥ 4½ లు

కలగాలకు 2 మైళ్ళదూరములో నున్న యీగ్రంథాలయమును జూచితిమి. ఇందుగ్రంథములపట్టికతప్ప మిగతా రిజిష్టర్లు యేమియులేవు. గ్రంథములసంఖ్య ముచ్చటగానున్నది గాని పాఠకులసంఖ్య కడులుప్తముగానున్నది. ఇంకొకవిశేషము యీగ్రంథాలయంబున గానంబడును. ఈ తాలూకాలోని యే గ్రంథాలయమునలేని శతకముల సంఖ్య యీనిలయమున అయిదువందల వరకు గన్పట్టుచున్నది. గ్రంథాలయాధిపతితో భాండాగారాభివృద్ధి చేయు ప్రయత్నములు చేయవలసినదిగా కోరితిమి. 1919 సం॥న నీగ్రంథాలయము స్థాపింపబడినది.

## ౨౧

### శ్రీ సరస్వతీగ్రంథాలయము, పెద్దవరం.

6-5-36 సం॥ సా॥ గం॥ 5½ లకు

అయిలవరమునకు 2 మైళ్ళదూరములోనున్న ఈ గ్రంథాలయమును చూడనేగితిమి. భాండాగారమునకు బంధించినవారు గ్రామములో ఎవ్వరు లేమిజేసి తిరుగ ప్రుడు కొందరిని ఆనిలయమునుగూర్చి యడిగితిమి. యము శిథిలావస్థలో నున్నదని తెలుసుకొంటిమి. శాస్త్రపారంగతులున్నూ, వైష్ణవస్వాములున్నూ యు యీ గ్రామమున గ్రంథాలయమున కిట్టిస్థితి పట్టినందు విచారము కలిగినది.

## ౨౨

### శ్రీరామకృష్ణపరమహంసపుస్తకభాండాగార జిల్లేపల్లి.

6-5-36 సా॥ గం॥ 6 లు

ఈ గ్రంథాలయము పెద్దవరమునకు 2 మైళ్ళదు ములోనున్నది. ఈ గ్రంథాలయాభివృద్ధి తగినంత తృ కరముగలేదు. నిలయాధ్యక్షకార్యదర్శులతో గ్రం లను విషయములనుగూర్చి మాట్లాడితిమి. జూన్ మా ములో గ్రంథాలయ వార్షిక సభజరుపుటకున్నూ, గ్రం లయము సక్రమపద్ధతులమీద నడుపుటకున్నూ ప్రయత్ని చుచున్నామని చెప్పిరి.

## ౨౩

### శ్రీ సరస్వతీ గ్రంథనిలయము, పడమటిపాలెం

6 6 36 సం॥ సా॥ గం॥ 6½ లు

ఈ గ్రంథాలయము జల్లేపల్లికి 1½ మైలు దూరము నున్నది ఇదియొక చిన్నపల్లె. ఇక్కడ గ్రంథాలయ నామమాత్రమున్నది. ఈ నిలయమును స్థాపించిన య కుడు గ్రామాంతర మేగుటచే యీనిలయము చూచు కాశము జిక్కలేదు. యీ గ్రామము గౌడులకావాస యున్నది.

## ౨౪

### శ్రీరాధాకృష్ణగ్రంథాలయము, ధూళిపూ

6-5-36 సా॥ గం॥ 7 లు

పడమటిపాలెమునకు ఈ గ్రంథాలయము 1½ మై దూరములోనున్నది. ఈ గ్రంథాలయము యువకులచే స్థాపించబడియున్నది. ఉత్సాహవంతముగ నడచుచున్న యువకుల యుత్సాహము కొనియాడుచున్నాము యు

..డును, ఉత్సాహవంతుడును, మా మిత్రులునగు శ్రీయుత ..ఝ్ఝు బాబురావుగారి ప్రియపుత్రుడునగు సుబ్బారావు గారు "జండా" యనుమాసపత్రిక ప్రతిసంచిక చేతితో వ్రాసి గ్రంథాలయమున నుంచుచున్నారు. దీని యుగాదిసంచిక చిత్రమయ జగత్తుగా చిత్రింపబడియున్నది. దీనియందున్న చిత్రములు చేతితో వ్రాయబడియున్నవి. ఈ చిత్రలేఖనము మమ్ముల ముగ్ధులను గావించినది. పిన్నవయస్సులో ..న్న యీ యువకుని కొనియాడుటకుబదులు చిరంజీవిగా ..ండుగాక యని ఆశీర్వదించుచున్నాము.

## ౨౫

### శ్రీవాణీ విజ్ఞాననిలయము, ధూళిపూడి.

6-5-36 రాత్రి గం 7½ లు

ఈ నిలయము కమిటీపాలనక్రింద నడుపబడుచున్నది. ..రవాసులు ఈ నిలయమునకు చాలినంతసహాయము ..సియుండినయెడల యీనిలయమింకను అభివృద్ధికి రాగల ..దని మా యాశయము.

## ౨౬

### శ్రీ పట్టాభిరామ గ్రంథాలయము.
### పమిడిమర్రు.

7-5-36 ఉ గం 8 లు.

ధూళిపూడికి గ్రంథాలయము 2 మైళ్ళ దూరములో ..న్నది. ఈ నిలయము గ్రామయువకులచే స్థాపింపబడి ..యున్నది. ఈ వత్సరమే స్థాపింపబడియుండుటచేత ..లినన్నిగ్రంథములు సేకరించి భాండాగారమున నింప ..కపోయిరి. 1, 2 పత్రికలు వచ్చుచున్నవి. విరివిగ పుస్త ..ములు సేకరించుటకు ప్రయత్నములు చేయుచున్నారు. చిరకాలములోనే ఈ గ్రంథాలయము అత్యున్నత స్థితి ..దగలదని మా యాశయము.

## ౨౭

### శ్రీరాజగోపాల పుస్తకభాండాగారము
### పల్లెకోన

7-5-36 ఉ గం 9-10 ని.

పమిడిమర్రుకు గ్రంథాలయము 2 మైళ్ళదూరములో ..న్నది. ఈ నిలయము ప్రస్తుతము శ్రీయుత కంఠంనేని ..క్ష్మయ్యగారి యింటియందున్నది. నిలయము పని చేయుట ..దు. ఇందునుగూర్చి గ్రామవాసులతో ముచ్చటించి ..మి. తిరిగి ఈ నిలయమును పునరుద్ధరించుటకు వాగ్దత్త ..చ్చియుండిరి. 2, 3 వారములలో నిలయము పునరుద్ధ ..పబడవచ్చును.

## ౨౮

### శ్రీకృష్ణపుస్తకభాండాగారము, కొరుమూరు.

7-5-36 సా॥ గం 3 లు.

పల్లెకోనకు ఒకమైలుదూరములో నున్న యీ గ్రంథాలయమును జూచితిమి. నిలయము-కమిటీపరిపాలనములో నున్నప్పటికి యువకుడగు శ్రీయుత మంగళగిరి కృష్ణమూర్తిగారు దీనిని నడపుచున్నారు. గ్రామవాసులు తగినంత సహాయము చేయుటలేదు. దీని అధ్యక్షకార్యదర్శులు ఏ మాత్రము శ్రద్ధతీసుకొనినట్లు కనబడలేదు. కార్యదర్శి "నన్ను నామకా యెంచారు" అని చెప్పుటలో వారి నెందుకు నియమించినారో మాకర్థముకాలేదు. మొత్తముమీద యీ గ్రంథాలయము నడచుచున్నను తృప్తికరముగలేదు. తగు అభివృద్ధి చేసెదరు గాక యని కోరుచున్నాము.

## ౨౯

### శ్రీ జానకిరామ గ్రంథాలయము, వెల్లటూరు.

7-5-36 సా॥ గం॥ 5 లు

కొరుమూరుకు 4 మైళ్ళదూరములోనున్న యీ గ్రంథాలయమును తిలకించుటకు వెళ్లితిమి. ఈ నిలయమునునడుపుచున్న శ్రీయుత పమిడిముక్కల శివరామయ్యగారు గ్రామాంతర మేగుటచే గ్రంథాలయమును దర్శించలేకపోతిమి. గ్రంథాలయమును మూసియుంచుట విచారకరము. శివరామయ్యగారు తగు శ్రద్ధ తీసుకొని యీ నిలయాభివృద్ధికి తోడ్పడుదురని నమ్ముచున్నాము.

## 30

### చౌదరీగ్రంథాలయము, వెల్లటూరు.

7-5-36 సా॥ గం॥ 5-15 లు

ఈ గ్రంథాలయ కార్యనిర్వాహకులలో నొకరును, గ్రంథాలయమును కొంతకాలము నడపినవారును నగు శ్రీయుత మోటూరి అంకినీడుగారితో గలసి గ్రంథాలయమును తిరిగి పునరుద్ధరింపవలసినదిగా కోరితిమి. ఈ గ్రంథాలయము ప్రస్తుతము మూయబడియుండెను. తిరిగి దీని పునరుద్ధరణనిమిత్తము ప్రయత్నము చేసెదమనియు, గ్రామములోనున్న మూడు గ్రంథాలయములు నొక గ్రంథాలయముగా మార్చిన బాగుండుననియు వారుచెప్పిరి. ఇది సంతోషవిషయమే. అందుకు ప్రయత్నములు మేముకూడ చేసెదమనియు, ఎటులైనను గ్రంథాలయావశ్యకత ప్రజలకు బోధపడునట్లు చేయుటయే మాయాశయమనియు గ్రంథాలయమునుగూర్చి శ్రద్ధతీసుకొనవలసిన దనియు కోరితిమి.

39



### 3౧
### శ్రీ బాలగంగాధర పుస్తకభాండాగారము, పెదపులివఱ్ఱు.

7-5-36 సా॥ గం॥ 7 లు

తెల్లటూరుకు 2 మైళ్ళ దూరములోనున్న యీ గ్రంథాలయమును తిలకించితిమి. గ్రంథాలయము సక్రమపద్ధతులమీద నడుపఁబడుచున్నది ఈ నిలయము రిజిష్టరుజేయబడినది. అమూల్యములైన పొత్తరాజములు యీ నిలయమును అలంకరించుచున్నవి. రిజిష్టర్లు 15 వరకునున్నవి. పాఠకుల సంఖ్య తృప్తికరముగనున్నది. తగినన్ని వార్తాపత్రికలు వచ్చుచున్నవి. ఈ తాలూకాలో ప్రాముఖ్యత వహించిన గ్రంథాలయములలోనిది యొకటియైయున్నది. గ్రామవాసులకును ఈ గ్రంథాలయమున గాఢాభిమానమున్నట్లు గ్రహించితిమి. ప్రజల యొక్క మన్ననయే యీ శారదాదేవికి వన్నె దెచ్చుచున్నది.

### 3౨
### శ్రీ ఆంధ్రబాలసరస్వతీ గ్రంథాలయము, వోలేరు.

8-5-36 ఉ॥ గం॥ 8 లు

పెదపులివఱ్ఱుకు 2 మైళ్ల దూరములోనున్న యీ గ్రంథాలయమును జూచితిమి. ఈ నిలయము ప్రస్తుతము రామమందిరములోనున్నది. గ్రంథాలయము ప్రస్తుతము పనిచేయుటలేదు. శ్రీయుత రవవరపు రాఘవయ్యగారితో గ్రంథాలయము తిరిగి పనిచేయునటులుగా చేయగోరితిమి. కొలది దినములలో గ్రామమధ్యమున ఈగ్రంథాలయమును నెలకొల్పెదమనియు అప్పటినుండి చురుకు ఈనిలయము అభివృద్ధికి రాగలదనియు, చెప్పిరి. గ్రామవాసులను ఈ గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడగోరితిమి.

### 33
### శ్రీ సరస్వతీగ్రంథనిలయము, తూర్పుపా

8-5-36 ఉ॥ గం॥ 9½ లు

వోలేరునుండి 1 మైలుదూరములోనున్న యీ గ్రంథాలయమును జూచితిమి. సమయమునకు కార్యదర్శిగారు గ్రామాంతరమేగియుండిరి. అధ్యక్షుల సందర్శనము లభించలేదు. యీ నిలయమున పాఠకులసంఖ్య తగినంత తృప్తికరముగలేదు. రిజిష్టర్లు సక్రమపద్ధతులమీద పెట్టబడి యుండలేదు. ఈ నిలయాభివృద్ధికి గ్రామవాసుల తోడ్పడగోరితిమి.

### 3౪
### శ్రీ వైశ్యగాంధి గ్రంథాలయము, భట్టిప్రోలు.

ఈగ్రంథాలయమును తిలకించుటకు అవకాశముగలుగలేదు. గ్రంథాలయము పనిజేయుటలేదని తెలిసినది. ఇందునుగూర్చి గ్రంథాలయాధ్యక్షులగు శ్రీయుత మద్దు గిరిరావుగారు మొదలగు మిత్రులు తగు శ్రద్ధదీసుకొని యీ గ్రంథాలయమును చక్కనిమార్గమున నడపెదరని యాశించుచున్నాము.

# రైతాంగ వయోజన విద్యాలయము 1936

(తాడేపల్లిగూడెం తాలూకా, ప॥ గోదావరిజిల్లా.)

గ్రామప్రజలలో చాలామంది రైతులే. ప్రస్తుతగ్రామ పాఠశాలలలో చెప్పేచదువు రైతుబిడ్డలకు ఏ మాత్రం ఉపయోగించదనేసంగతి మన జాతీయనాయకులు అనేక వత్సరములనుండి గ్రామప్రజలలో ప్రచారంచేసిరి. వాటి ఫలితముగనే యిట్టి పాఠశాలలను గ్రామములలో పెట్టుటకు తగిన శక్తి గలిగినది.

ఈ పాఠశాల యీ వత్సరంలో జూలై నెలలో యీ గ్రామమున ప్రారంభమై వారమునకొకరోజు చొ॥ 52 వారములు (అనగా ఒక ఏడాది) జరుపబడును. ఈ పాఠశాలలో మన విద్య,విత్త, రాచకీయములనుగూర్చిన చదువు 17 వత్సరములు వయస్సులగాయితు 35 వత్సరములు వయసునన్న వారికి చెప్పబడును. ఈశాస్త్రములలో అనుభవజ్ఞులగు పండితులను ఆంధ్రదేశములోని వివిధజిల్లాలనుండి ఆహ్వానించి అట్టివారిచే విద్య నేర్పఁబడు ఏర్పాట్లు చేయఁబడును. ఏడాది అనంతరము అందుచదివినవారికి విద్యాలయము తరఫున పరీక్షనుగావించి యోగ్యతాపత్రములొసంగు యేర్పాట్లు గావింపబడును. వివరాలు తెలుసుకొనగోరువారు యీ విద్యాలయపు కార్యదర్శి పుట్టా సుబ్బారావుగారిని (కృష్ణాయపాలెంలో) కలిసికొని దరఖాస్తులను వారికి నియ్యకోరిక. ఇట్లు

రైతాంగ వయోజన విద్యాలయ సంఘము.

- శనివారపు సుబ్బారావు, అధ్యక్షులు.
- పుట్టా సుబ్బారావు, కార్యదర్శి.
- మద్దుకూరి తిరుమలరాయుడు.
- కందాళం వెంకటరామానుజాచార్యులు
- దుగ్గిన వెంకటామన్న.
- ఉండవిల్లి సత్యనారాయణమూర్తి.

# సంపాదకీయములు

## క్షమాపణ

ఈ మాసము మా కార్యాలయమునకు చేరిన వ్యాసాదులు మిక్కుట మగుటచే అనేకవిషయములను ప్రకటింపక నిలుపవలసివచ్చినది. జూలై మాసపు సంచికలో ప్రకటించెదము. ఆలస్యమునకు మమ్ములను క్షమింతురుగాక యని ప్రార్థించుచున్నాము. —సంపాదకుడు.

### క్రొత్తవోట్లు - గ్రంథాలయముల విధి.

గ్రంథాలయములవారు కడుజాగ్రత్తగా జూన్ నెల 20 వ తేదీలోపున నిర్వహించవలసిన కార్యక్రమ మొకటి కలదు. 1937 ఫిబ్రవరి నెలలో జరుగబోవు శాసనసభల యెన్నికల విషయమై ప్రభుత్వమువారును అన్ని పక్షముల ప్రజానాయకులును మెలకువతో పనినడుపుటకు ఉద్యుక్తులైనారు. అందులో ముఖ్యముగా దరఖాస్తు వ్రాయగల శక్తినిపొందిన ప్రతివ్యక్తి చేతను దరఖాస్తు వ్రాయించి వోటు అర్హతను సంపాదించునట్లు చేయుటకు పాటుపడుచున్నారు. అర్హతగల ప్రతివ్యక్తిని వోటు సంపాదించుకొనునట్లు ప్రోత్సాహపరచుట యందు రాజకీయ కక్షల ప్రసక్తి యేమియులేదు. ప్రజలకు శాసనప్రకారముగల హక్కును సంపాదించి యిచ్చుట తప్ప వేరు జోక్యమిందులో కలుగదు. వోటుహక్కు సంపాదించుకొనునట్లు ప్రజలను తయారు చేయుట విజ్ఞానవ్యాపనకార్యములలో మున్నెన్న దగిన కార్యము. కాబట్టి గ్రంథాలయములవారు వోటు యొక్క ప్రయోజనమును గుర్తించి ప్రత్యేకము బోధజరిపి దేశమున నెందరికి అర్హతకలదో అందరును వోటర్లగునట్లు ప్రయత్నించుట పరమవిధి. గ్రంథాలయ సేవకులు ప్రత్యేకము గమనించి తమతమ ఊళ్లలో కార్యక్రమము నడిపి ప్రజాసేవ యొనరింపవలసిన దని కోరుచున్నాము.

### రేపల్లెతాలూకా గ్రంథాలయ యాత్ర

మే నెల 2 వ తేది మొదలు 8 వ తేదివరకును యార్లగడ్డ శ్రీకృష్ణయ్యచౌదరిగారధ్యక్షులుగా రేపల్లెతాలూకా గ్రంథాలయ సంఘమువారు జరిపిన గ్రంథాలయయాత్ర కార్య వివరమును మరియొకచోట ముద్రించితిమి. ఈయారుదినములలో నల్లూరు, మైనేనివారిపాలెం, మూర్తోట, సింగుపాలెము, నల్లూరుపాలెం, రేపల్లె, బేతపూడి, అడవులదీవి, నిజాంపట్టణము, కల్యాణకావూరు, కావూరు, చెరుకుపల్లి, పొన్నపల్లిఅగ్రహారము, నడింపల్లి, గూడవల్లి, కనగాల, అయిలవరం, పెద్దవరం, జిల్లేపల్లి, పడమటిపాలెం, ధూళిపూడి, పమిడిమర్రు, పల్లెకోన, కారుమూరు, వెల్లటూరు, పెదపులివర్రు, వోలేరు, తూర్పుపాలెం, భట్టిప్రోలు అను 29 యూళ్లు తిరిగి 34 గ్రంథాలయములను దర్శించి గ్రామవాసులను కలిసి సంప్రదించి కొన్నిచోట్ల బహిరంగోపన్యాసములుచేసి కార్యభారము నిర్వహించిన ఈసంఘమువారి నభినందించుచున్నాము. వీరుకనుగొనిన విశేష విషయములను రెంటిని ప్రత్యేకముగా నమూదు చేయుట యవసరమని తోచును. అయిలవరం శ్రీ శారదా గ్రంథనిలయములో 500 శతకములు చేర్పగలిగినారట. ఆకార్య నిర్వాహకులు ప్రశంసార్హులు. ఒక్క ప్రదేశములోని కొన్ని గ్రంథాలయములు కలియ బలుకుకొని ఒక్కొక్క రొక్కొక్క ప్రత్యేక శాఖావాఙ్మయమునం దె

కున్న శ్రద్ధచేసి గ్రంథముల చేర్చినచో సమిష్టి ప్రయత్నముచేత ప్రాంతమున కన్ని శాఖల గ్రంథములనవలీలగా సమకూర్చు కొనవచ్చును. ప్రాంతమునకు కేంద్రసంఘ మేర్పరచు కొని ఒండొరులు గ్రంథముల నెరవుతీసికొనుచు పూర్ణో పయోగము పొందవచ్చును. ఇట్టి పనికి నిశతక గ్రంథాలయముబోటి గ్రంథాలయములు ఘనా దులు కాగలవు. ఇక రెండవ విషయము ధూళి పూడిలోని శ్రీరాధాకృష్ణ గ్రంథాలయ నిర్వా హకుడు యువకుడునగు వఝ్ఝా సుబ్బారావుగారు 'జండా' యను మాసపత్రికను చేతితో వ్రాసి గ్రంథాలయోపయోగమున కిడుచున్నాడట. ఉగాది సంచిక ప్రేక్షకులను ముగ్ధులను చేయు రీతిగా సచిత్రముగా దీర్చినాడట! ఇట్టి యుత్సాహమునకు నిజముగా విలువ కట్టగల మా! మరి యింకొక్క సంగతి. దేశసేవాపరాయ ణులగు శ్రీయుత గొల్లపూడి సీతారామశాస్త్రి తుమ్మల బసవయ్య చౌదరీగార్లచే స్థాపితమైన కల్యాణకావూరు వినయాశ్రమ గ్రంథాలయ మున 500 అమూల్య గ్రంథరాజము లున్నవట. కాని యాత్రికుల కంటికి తగిన శ్రద్ధ ఇచ్చుట కానరాలేదట! ఇట్టి యాశ్రమములలో నిజ ముగా గ్రంథాలయ మెల్లసంచలమునకు నాది పీఠమై తనరారవలసినది. విజ్ఞానగంగాప్రవాహ మిచ్చటినుండి పొంగి పొరలి చుట్టుంగల మానవ మేధఃక్షేత్రములను సకలసస్యాఢ్యముల గావింప వలసినది. ఏలొకో ఈపని జరుగలేదని ఆశ్రమ నిర్వాహకు లాలోచింతురుగాక. యాత్రికుల యభిప్రాయము తప్పయినదని రుజువగుంగాక!

ఆంధ్రప్రముఖులు

కన్నుల తెరచి కార్యము పూనుడు.

గ్రంథాలయయాత్రలవలన నెంత ప్రయో జనము గలదో పైనిమేము శ్రుతపరచిన విషయ ముల వల్లనే తెల్లముకాగలదు. గ్రంథాలయ ములు లేనిచోట్ల నట్టి యాత్రలకు పనిలేదను కొనవలదు. అట్టి చోట్ల తాలూకా సంఘ ములుగాక ఫిర్కాసంఘము లేర్పడి పనిచేయ వలెను. యాత్రలోనే గ్రంథాలయస్థాపనను ప్రోత్సహింపవలెను. గ్రామమున నొక పత్రిక నుమ్మడిని తెప్పించు కొనునట్లును ఏ రామాల యముననో రచ్చకట్ట మీదనో కూర్చొని పది మంది ఆపత్రికను చదివించి వినునట్లును ఏర్ప రచుచు దానికొకసంఘమును నిర్మించి ఫిర్కా లో ఏరెండుమూడుచోట్లనో మంచి గ్రంథాల యముల నిర్మాణమును ప్రోత్సహించుట గ్రంథా లయాభిమానుల విజ్ఞానాభిమానుల దేశాభి మానుల కనీస ధర్మము. ఈ కనీస ప్రయత్నము నడచుటకు శ్రీమతి ఈడ్పుగంటి వెంకట రత్నమ్మగారు చేసిన సలహా తాత్కాలికముగా నుపయోగపరచు కొనవచ్చును. విద్యాపేక్షు లం దరును బ్రహ్మచారులు. 'భవతీ భిక్షాందేహి' యను వాక్యము వారిస్వత్వము. వారికిభిక్షపెట్టు ధర్మము మనయిండ్లలోన, యన్నపూర్ణలది. గ్రంథాలయము నొకబ్రహ్మచారిగా నెంచి ఘన యన్నపూర్ణలు దినమున నొకభిక్ష సరస్వతీ భిక్షా పాత్రికయందిడుదురేని ఈయుద్యమము కొన సాగిపోగలదు. ఆంధ్రప్రముఖులు - ఎల్లప్రాంత ములవారును—కన్నులు తెరచి కార్యమునకు గడంగుదురా?

* * * * *

కృష్ణాజిల్లా, దివితాలూకా, నంగిగెడ్డగ్రామందు కీర్తి శేషులైన పి. వి. దాసుగారి జ్ఞాపకార్థమై గ్రంథాలయ మును కృష్ణామండల డెలిగేటు ప్రెసిడెంటుగారగు పెద సింగు వెంకటనారాయణగారు తెరచిరి. డాక్టరు గుంటూరు సుబ్బారావుగారు అధ్యక్షులుగాను, అమ్మల సుదర్శనం గారు ఉపాధ్యక్షులుగాను, అమ్మల రఘునాథంగారు కార్యదర్శిగాను, అమ్మల లక్ష్మీనారాయణగారు సహాయ కార్యదర్శిగాను, అమ్మల రామమూర్తిగారు కోశాధిపతి గాను ఎన్నుకొనఁడిరి. ఈ గ్రంథాలయము నిరంతరాభి వృద్ధి నొందుగాక.

కీ॥ శే॥ దీ॥ బ॥ మోచర్ల రామచంద్రరావుగారు

శ్రీ మోచర్ల రామచంద్రరావు పంతులు గారినెరుగని ఆంధ్రసోదరుడుండడు. వారు తెలుగు దేశమునకు చేసిన సేవ యమోఘము. విజ్ఞాన నిధియని పొగడ్తగన్న ఆంధ్రమాత పుత్రుడీయన. స్థానికసంస్థలు, శాసనసభలు, రౌండు టేబిల్ కాన్ఫరెన్సులు, ఆర్థిక సంఘములు అన్నిటను కృషిచేసిన ప్రజ్ఞావంతుడు. స్వదేశసంస్థానములప్రజలగోడును ప్రపంచమునకు చాటి చూపిన దయామయుడు. మద్రాసుభూమి తనఖాబ్యాంకుకు ప్రథమాధ్యక్షుడై మెప్పుగనిన మేధావి. భారతావని యందలి లిబరలు పక్షనాయకులలో శాంతసముద్రుడని ప్రఖ్యాతిగనిన పరమధీశాలి. 1914 లో గ్రంథాలయోద్యమ మిాకోస్తాలో నారంభ మైనప్పుడు ఆంధ్రదేశ గ్రంథాలయమునకు ప్రథమాధ్యక్షుడు. ఇట్టి యాంధ్ర పుత్రరత్నము 67 ఏండ్ల వయసున ఈమే 16 వ తేది కీర్తిశేషుడయ్యె. ఆంధ్రావనికి కలిగినకొరంత తీరరానిది. వీరియాత్మకు పరమేశ్వరుడు శాంతి నొసంగుగాక!


# హిందూ యువజనసంఘము అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజము, గోసంరక్షణసమితి (ఏలూరు.)

ధర్మకార్యముల శాశ్వతసభ్యుల తరగతులు.

| | | |
|---|---|---|
| (1) శాశ్వత ధర్మకర్తలు రు.500 | (4) శాశ్వత అభిమానులు రు.150 | (7) నె 3 రు శాశ్వత సభ్యులు రు.35 |
| (2) శాశ్వత పోషకులు 250 | (5) నె 1 రు శాశ్వత సభ్యులు 100 | (8) నె 4 రు శాశ్వత సభ్యులు 20 |
| (3) శాశ్వత సహాయులు 180 | (6) నె 2 రు శాశ్వత సభ్యులు 68 | (9) నె 5 రు శాశ్వత సభ్యులు 10 |

☞ ఆదానుబట్టి ధర్మములు జరుగుటకు పైన తెలిపినప్రకారం శాశ్వతనిధికి ధర్మముయిచ్చి క్రమేణా హెచ్చుతరగతులుగా హోదాలకు చేరవచ్చును. ఇట్టి ధర్మములకు రశీదులును యివ్వబడును. ప్రత్యేక పట్టాలనుకూడా అయిదుగురకు తక్కువకాని శాశ్వత ధర్మకర్తల సంతకములతో నిచ్చెదరు. శాశ్వతధర్మకర్తలకు వారు యిచ్చు ఛాయాపటము (Oil painting or enalargement) కార్యస్థానమున అలంకరించెదరు. వారు ఫోటోబ్లాకులు (Half tone block) యిచ్చిన సంవత్సర రిపోర్టులలో ముద్రించెదరు. ఎల్లరు యథాశక్తిని సహాయముచేసి పుణ్యము సంపాదించగోరెదను

శాశ్వత ధర్మకర్త:—మద్దుల వేంకట చినరాజుశ్రేష్ఠి.

ఉపాధ్యక్షులు : అన్నదాన సమాజము, ఉపాధ్యక్షులు : గోసంరక్షణ సమితి,
గౌరవకార్యదర్శి : ట్రస్టుబోర్డు, హిందూయువజన సంఘము.

# ఇంగ్లీషు-తెలుగు పారిభాషిక నిఘంటువు

530 పుటలు. "వ్యవహారకోశము — శాస్త్రపరిభాష" వెల రు 2-8-0 లు.

కలసిన సంపుటము

**రచయిత: దిగవల్లి వేంకట శివరావు, బి. ఏ., బి. యల్.**

మద్రాసు టెక్స్టుబుక్కు కమిటీవారిచే గ్రంథాలయోపయోగముకొరకు ఆమోదింపబడినది.

(ఫోర్టుసెంట్‌జార్జి గెజెట్ 16-4-35, పుట 258)

---

ఇది కేవలము నిఘంటువుమాత్రమేగాక విజ్ఞానసర్వస్వ సంగ్రహము. దీని నుపయోగించికొలదియు నీకు అమూల్య విజ్ఞానము లభించును. మంచి వాగ్జాల మలవడును. సంభాషణలందు, ఉపన్యాసములందు, గ్రంధరచనమందు, తర్జుమాలందు నీవెవ్వరికని జంకనక్కరలేనిశక్తిని ప్రసాదించి నీ విజ్ఞానసంపదను నీతోడివారును నీపైవారును గూడ అచ్చెరువంది నిన్ను గౌరవించునట్లు చేయును. సర్వవ్యవహారములందును నీకు తోడ్పడి నీకు పేరుదెచ్చును. నీగడనను లాభమును పెంపొందించును

వ్యాపార వ్యవహారములందేమి, రాజకీయ ఆర్థిక న్యాయశాస్త్రవిజ్ఞానమునందేమి, పదార్థవిజ్ఞాన రసాయన గణిత ఖగోళ భూగోళ భౌతిక జీవజంతుశాస్త్రాది ప్రకృతిశాస్త్రములందేమి, వేదాంతవిద్యయందేమి, వైద్యశాస్త్రమునందేమి మరి యేవిషయమునందేమి ఏ ఇంగ్లీషు పారిభాషిక పదమునకైనను అర్థముగాని, నిర్వచనముగాని వ్యాఖ్యానముగాని, పర్యాయపదముగాని నీకు గావలసివచ్చినచో నీవు తడవులాడుకొని దిగ్భ్రమ జెందనక్కరలేదు; ఈ గ్రంథమునందది నీకు లభించును. ఇది సమగ్రమును సప్రమాణమును ఆధునికమును అగు ఉత్తమ విజ్ఞానకోశము. మొన్న మొన్ననే వాడుకలోనికివచ్చిన పదములు వాని ఉపయోగములు నవీనశాస్త్రపరిశోధనల ఫలితములు, అన్ని ఆధునిక సాంకేతిక వైజ్ఞానికశాస్త్రీయభావములుగూడ యిందు సమకూర్చబడినవి.

కొన్నివందల హిందూస్థానీపదములు, వానికి తెనుగు ఇంగ్లీషు పర్యాయపదములు గలవు. ప్రపంచ రాజ్య విస్తీర్ణము, జనసంఖ్య, చలామణియు దెలుపు పట్టికలును ఇంగ్లీషు-దేశవాళీ తూనికలు, కొలతలు, మానములు, గల అనుబంధములును గలవు.

ప్రభుత్వమువారి తెనుగు తర్జుమా పరీక్షలకు బోవువారికి, తెనుగు తర్జుమా యవసరముగల గ్రామ పంచాయితీ, మునిసిపల్, జిల్లాబోర్డు సహకారసంఘముల ఉద్యోగులకు, వర్తకులకు, భీమా ఏజంట్లకు, వైద్యులకు, గ్రంథకర్తలకు, ఉపాధ్యాయులకు ఎల్లప్పుడు చేత నుండవలసిన అమూల్యగ్రంథము.

"కోర్టులు, రాజకీయములు, శాస్త్రీయవిషయములకు సంబంధించిన అనేకపదములకు అర్థములు వ్రాయబడినవి. వ్యవహారస్థులకు, దేశసేవకులకు, విద్యార్థులకు, వ్యాసరచయితలకు, దీనివలన గలుగు ప్రయోజనము లనంతములు. ఆంధ్రభాష కిది అమూల్యభూషణము. విద్యాధికు లనేకుల ప్రస్తుతు లందినది. పాఠ్యగ్రంథనిర్ణయ సభవారిచే గ్రంథాలయోపయోగనిమిత్త మంగీకరింపబడినది". —గృహలక్ష్మి, మార్చి 1935.

'విద్యార్థులకేగాక ప్రచారకులు, లేఖకులు, పత్రికాసంపాదకులు మొదలగువారికెల్ల జాల నుపయోగిముగ నుండగలదు'. — కృష్ణాపత్రిక.

'వ్యవహారపరులేగాక కేవలము భాషాభిమానులును, దీనివలన గొప్పప్రయోజనములు పొందగలరు'.—భారతి

'ఇంగ్లీషు తెలుగు తర్జుమాల యవసరముగల ప్రభుత్వశాఖలందలి అన్ని కార్యాలయములయందును, ఇతర సంస్థలందును ఇది అత్యంతావశ్యకమగుననుటకు సందియము లేదు'. — హిందూ.

దిగవల్లి వేంకటశివరావుచే రచియింపబడిన ఇతరగ్రంథములు

# సహకారవస్తు నిలయోద్యమము

గ్రంథాలయములం దుంచుటకు మద్రాసు టెక్స్టుబుక్కు-కమిటీవారు ఆమోదించినారు

( ఫోర్టుసెంట్‌జార్జి గెజెట్ 16-4-35, పుట 256 )

ఇది సహకారశాస్త్రమును దేశీయ దేశాంతర సహకారోద్యమమును అందుకు సంబంధించిన సమస్యలను విపులముగా చర్చించు ఉత్తమగ్రంథము. రాక్డేలుసహకారోద్యమచరిత్ర, సహకారోత్పత్తి, కృషి, పరిశ్రమ, వ్యాపారములు, ప్రజారోగ్యము విద్యనభివృద్ధిచేయుగల సహకారపద్ధతులు, భారతదేశ ప్రజాజీవనము, పారిశ్రామికాభివృద్ధి గ్రామపునర్నిర్మాణములను గూర్చిన ప్రకరణములు నిందుగలవు. ప్రజల ఆర్థికస్థితిగతులను ప్రభుత్వాదాయ వ్యయ పద్ధతులను ప్రపంచములోని ఇతరదేశములవానితో పోల్చిచూపు స్థితిగతి లెక్కలును మనదుస్థితినితూలగించు మార్గములను సూచించు వ్యాఖ్యానములును గలవు. ఇది కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ ఫెడరేషనుచే ప్రకటింపబడినది. 260 పుటలు

సాదాబైండు వెల రు 1—0—0 క్యాలికోబైండు వెల రు 1—4—0

# అధినివేశ స్వరాజ్యము

విజ్ఞానచంద్రికలోని 40 వ గ్రంథము.

బ్రిటీషుసామ్రాజ్య స్వరూపస్వభావములు, స్వరాజ్యప్రయోజనము, అధినివేశస్వరాజ్యచరిత్ర, అధినివేశ స్వరాజ్యసమస్యలు, ఫెడరలు రాజ్యాంగవిధానము, ప్రజాప్రభుత్వ ప్రాతినిధ్యపద్ధతులు, కెనడా డొమినియను, ఆస్ట్రేలియా కామన్వెల్తు, ఐరిషు ఫ్రీస్టేటు, ఆంగ్లరాజ్యాంగములనుగూర్చి చర్చించు ఉత్తమ రాజ్యాంగశాస్త్రగ్రంథము. నూతన ఇండియా రాజ్యాంగ చట్టములోని మంచిచెడ్డలు గ్రహించుట కిది తోడ్పడగలదు. వివిధదేశ ప్రజల ఆర్థికస్థితిగతులు ప్రభుత్వాదాయ వ్యయపద్ధతులు పోల్చి జూపు స్థితిగతిలెక్కల జాబితాలు 36 కలవు. ఇది "అధినివేశ స్వరాజ్యము, ప్రపంచ రాజకీయములనుగూర్చిన ఉత్తమ గ్రంథ"మని హిందూపత్రిక ప్రశంసించినది. దీని ప్రాశస్త్యమును గూర్చి ఆంధ్రపత్రిక 2-9-33 తేదీన సంపాదకీయ వ్యాసమును ప్రచురించినది. 250 పుటలు. వెల రు. 0-12-0.

# దక్షిణాఫ్రికా

విజ్ఞానచంద్రికా గ్రంథమాలలోని 36 వ గ్రంథము.

దేశచరిత్ర, రాజ్యాంగచరిత్ర, భారతీయులబాధలు, గాంధిమహాత్మునిసత్యాగ్రహచరిత్రము నిందుగలవు.

అనేకపటములు. కాలికోబైండు — 432 పుటలు. వెల రు 2—0—0

# భారతదేశ స్థితిగతులు

వివిధదేశప్రజల ఆర్థికపరిస్థితులు, ప్రభుత్వాదాయ వ్యయవిధానములు, మనదుస్థితిని ఇతరదేశముల యౌన్నత్యమును పోల్చిచూపు స్థితిగతిలెక్కలు. 72 పుటలు. వెల రు 0—2—0

## ఆంగ్ల రాజ్యాంగము 30 పుటలు వెల రు 0-1-0

## అంకుల్‌టామ్ కథ "అంకుల్‌టామ్సుకాబిన్" అను సుప్రసిద్ధ నవలకు తెలుగు. 34 పుటలు వెల రు 0-1-0

---

వలయువారు :-దిగవల్లి వేంకటశివరావు బి.ఏ., బి. యల్., బెజవాడ.

# ఏలూరు, అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య విద్యాదానసమాజము 1913 సం॥ రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచినీళ్ల చలివేంద్రలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులును, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు
కొత్తమాసు సీతారామయ్యగారు, ( సోల్‌ట్రస్టీలు )
పసుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు)
మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)
నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)
కందుల రామయ్యగారు, (సెక్రెటరీ)
} శాశ్వతధర్మకర్తలలోనివారు

# ఏలూరు, హిందూ యువజనసంఘము

## Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రము సంఘమురిజిష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్‌లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందుత్తీర్ణులకు బహుమతులొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసిన యున్నవి. ఎలక్ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కావ ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను. బజారులో బ్రాంచి లైబ్రరీకూడ కలదు.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి)

RSVM01A157



Grandhalaya Sarvasvam - Registered No. M. **1714**

# Gosamrakshana Samithi, Ellore.

## గోసంరక్షణ సమితి, ఏలూరు.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్నయెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బీదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డి నిమిత్తము బీడుభూమి కొనవలసియున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా అయిదు గురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [రు 500 దాతలు] సంతకములతో పట్టాల నిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షిక మామూళ్లును, నెల చందాలుగను పచిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీసమితి యభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి :-

ఏలూరు
5-1-1935.

రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, (ప్రెసిడెంటు, ట్రస్టి.)
మద్దుల వెంకట చినరాజుశ్రేష్ఠిగారు, (వైస్ ప్రెసిడెంటు, ట్రస్టి.)


# ఓ రి య ం ట ల్ . .

## గవర్న్మెంటు సెక్యూరిటీలైఫ్ అస్యూరెన్సుకంపెనీ, లిమిటెడ్

స్థాపితము 1874. హెడ్ ఆఫీసు : బొంబాయి.

**1934** ని వే ది క — సం గ్ర హ ము.

| | | | | | |
|---|---|---|---|---|---|
| జారీచేసిన క్రొత్త పాలిసీలు | రూ. | 7,62,42,761 | చెల్లించిన క్లెయిముల మొత్తం | రూ | 16,29,88,814 |
| సాలీనా ఆదాయము | ,, | 3,14,01,970 | పెరిగిన ఫండు మొత్తములు | ,, | 15,53,88,843 |
| అమలులోనున్న పాలసీలు | ,, | 54,20,38,518 | | | |

ఈ పైన తెలుపబడిన అంకెలు ఓరియంటల్ యొక్క ప్రజాదరణ, కంపెనీస్థిరత్వముగూర్చి వేనోళ్ళ చాటుచున్నవి.

ప్రజాదరణబొంది దినదినాభివృద్ధిగాంచుచున్న ఈహైందవ భీమాసంస్థలో మీజీవితము భీమా చేసికొనుటకు

ఆ ల సిం ప వ ల దు.

వివరములకు : ☛ పి. హెచ్. గుప్త, బార్-ఎట్-లా సెక్రటరీ, ఉత్తరజిల్లాలు,, గోడేవారివీధి, విశాఖపట్టణము, లేక ఈక్రింది ఉదాహరింపబడిన కంపెని కార్యాలయములకు వ్రాయవచ్చును.

ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాద్, అంబాల, బెంగుళూర్, బెరిమేలీ, బెల్లారి, కలకత్తా, కాలికట్, కోయంబతూర్, కొలంబో, ఢక్కా, ఢిల్లి, గౌహతి, గుంటూరు, జల్గాను, జల్పాయిగురి, జబ్బల్పూర్, కరాచీ, కౌలాలంపూర్, లాహోరు, లక్నో, మాండలీ, మధుర, మెర్కారా, మొంబాసా, నాగపూరు, పాట్నా, పూనా, రాయపూరు, రాజసాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూర్, సుక్కూర్, తిరుచునాపల్లి, తిరువనంతపురము, విశాఖపట్టణము.

(Oriental)


బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యగారిచే ముద్రింపబడినది.

| | |
|---|---|
| | మనసు ఫౌండేషన్ |
| | పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVMMDIA 157 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 49 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |